www.vishvambhara.com
ప్రజా విశ్వంభర
తెలుగు దినపత్రిక
అక్షరం సాక్షిగా..
ఆదివారం 26-07-2026
RNI No : TGTEL/25/A1676
సంపుటి : 2 | సంచిక : 13 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్






విద్యాశాఖ మంత్రిగా

## ప్రహ్లాద్ జోషి

అదనపు బాధ్యతలు అప్పగింత

ప్రధాన్ రాజీనామాకు ఆమోదించిన రాష్ట్రపతి

2లో



పదవుల్లో ఉన్న వారికంటే


## ప్రజల బలమే గొప్పది

విద్యార్థులు సాగించిన ఉద్యమం ప్రజాస్వామ్య చరిత్రలో ఒక మైలురాయి

యువత చూపిన తెగువ, ఐక్యత, పోరాట పటిమ దేశానికి స్ఫూర్తిగా నిలిచింది

ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుణపాఠం నేర్చుకోవాలి

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై స్పందించిన కేటీఆర్




- నీట్ అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నా
- నా రాజీనామా లేఖను ప్రధానికి పంపా..
- పది రోజులుగా చోటుచేసుకున్న పరిణామాలు తనను తీవ్రంగా బాధించాయి
- నాకు వ్యక్తిగత ప్రతిష్ఠ కంటే విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యం
- బలమైన దేశానికి బలమైన విద్యా వ్యవస్థ పునాదని ఎప్పుడూ నమ్ముతా
- లక్షలాది మంది విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యం: ధర్మేంద్ర ప్రధాన్

**నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీస్తున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. నీట్ యూజీ పరీక్షలో చోటుచేసుకున్న అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ ఆ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్ర మోడీకి పంపినట్లు ఎక్స్ వేదికగా తెలిపారు.**

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**

నీట్ లీకేజీపై విద్యార్థుల ఆందోళనలు, ప్రతిపక్షాల విమర్శలు కొనసాగుతున్న సమయంలో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర మంత్రులతో జరిగిన చర్చల్లో కాక్రోచ్ జనతాపార్టీ ప్రతినిధులు విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ప్రధాన డిమాండ్‌గా పెట్టినట్లు సమాచారం. ఆ డిమాండ్ల నేపథ్యంలోనే ఈ పరిణామం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. రాజీనామా అనంతరం ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ, తనకు వ్యక్తిగత ప్రతిష్ఠ కంటే విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యమని స్పష్టం చేశారు.

**తీవ్రంగా బాధపడ్డా: ధర్మేంద్ర..**

గత పది రోజులుగా చోటుచేసుకున్న పరిణామాలు తనను తీవ్రంగా బాధించాయని పేర్కొన్నారు. దేశ యువత గందరగోళ పరిస్థితుల్లో చిక్కుకోకుండా చూడాలన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ చదువుపైనే దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. నీట్ వివాదాన్ని కొన్ని శక్తులు తమ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే అవకాశం ఇవ్వకూడదని పేర్కొన్నారు. దేశ ఐక్యత, యువత భవిష్యత్తు కాపాడటం అందరి బాధ్యత అని తన రాజీనామా లేఖలో వివరించారు.

**నాలుగు దశాబ్దాలుగా విద్యా రంగంతో అనుబంధం..**

తన రాజీనామా లేఖలో ధర్మేంద్ర ప్రధాన్ విద్యా రంగంతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా సంస్కరణలతో కలిసి పనిచేస్తున్నానని తెలిపారు. బలమైన దేశానికి బలమైన విద్యా వ్యవస్థ పునాది అని తాను ఎప్పుడూ నమ్ముతానని చెప్పారు. నీట్ యూజీ పరీక్షలో అక్రమాలు బయటపడిన వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించిందని ప్రధాన్ తెలిపారు. దర్యాప్తును సీబీఐకి అప్పగించడం, పరీక్షను రద్దు చేయడం, తిరిగి పరీక్ష నిర్వహణకు తేదీ ప్రకటించడం వంటి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

2లో



ఏ ప్రభుత్వమైనా తప్పు జరిగితే

# తలవంచాల్సిందే

- యువత తరఫున గళం విప్పిన ప్రతిపక్షాలు విజయం సాధించాయి
- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే
- విద్యావ్యవస్థ పునర్నిర్మాణంలో తొలి అడుగు పడింది: రాహుల్ గాంధీ
- యువత పోరాటం అసామాన్యం.. ఇదంతా వారి విజయం: ప్రియాంక గాంధీ
- శాంతి, సహనం, పట్టుదలకు దక్కిన విజయమిది: సోనమ్ వాంగ్‌చుక్
- ప్రధాన్ రాజీనామాపై స్పందించిన విపక్షాలు

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**

కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసనలతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీనిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను స్వాగతించారు. విద్యావ్యవస్థ పునర్నిర్మాణంలో తొలి అడుగు పడిందన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థుల పోరాటం చూసి గర్విస్తున్నట్లు పేర్కొన్నారు. వీధుల్లోకి వచ్చి పోరాడిన యువత, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. మరో రెండు డిమాండ్లు మిగిలి ఉన్నాయని..వాటిని కూడా త్వరగా తీర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆందోళనకారులపై జరిగిన లాఠీఛార్జిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

– 'విద్యా వ్యవస్థను సరిదిద్దడం కోసం దేశవ్యాప్తంగా లక్షలాది మంది యువత ధైర్యంగా పోరాడారు. ప్రధాన్ రాజీనామాతో విద్యార్థులు, అవినీతి ప్రభుత్వం కారణంగా తమ పిల్లలను కోల్పోయిన కుటుంబాలు, యువత తరఫున పార్లమెంట్‌లో గళం విప్పిన ప్రతిపక్షాలు విజయం సాధించాయి' ఏ ప్రభుత్వమైనా తప్పు జరిగితే ప్రజల ముందు తలవంచాల్సిందేనన్నారు.

**–కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే**

– 'యువత పోరాటం అసామాన్యం.. ఇదంతా వారి విజయం. ప్రజాస్వామ్యంలో ప్రజల ఆకాంక్షలే అంతిమం. పోరాడి సాధించిన విద్యార్థి లోకానికి శుభాకాంక్షలు'

**– కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ**

– 'ఇది ప్రజాస్వామ్య విజయం. వీధుల నుంచే నేరుగా వచ్చిన ప్రత్యక్ష ప్రజాస్వామ్యం ఇది. శాంతి, సహనం, పట్టుదలకు దక్కిన విజయమిది. భయాన్ని వీడి దేశంలోని నలుమూలల నుంచి కదిలి వచ్చిన పౌరులందరికీ కృతజ్ఞతలు. కాక్రోచ్ జనతా పార్టీ నేతలకు అభినందనలు'

**– సోనమ్ వాంగ్‌చుక్**

2లో



2లో



# చట్ట సభల్లోకి జెన్ జీ

- 21 ఏళ్లకే శాసనసభ, లోక్‌సభ, 25 ఏళ్లకే మండలి, రాజ్యసభకు పోటీ
- జెన్ జీకి అవకాశం కల్పించాలంటూ శాసనసభలో ప్రత్యేక తీర్మానం
- లోక్‌సభలో 1 శాతం కంటే తక్కువగా జెన్ జీ ప్రాతినిధ్యం
- రాహుల్ మంత్రివర్గంలో జెన్ జీకే విద్యా శాఖ
- జెన్ జీ నిరసన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- జంతర్‌మంతర్‌లో విద్యార్థులపై దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

అత్యున్నత చట్ట సభలైన శాసనసభ, శాసనమండలి, లోక్‌సభ, రాజ్యసభల్లో జెన్ జీ తరం ప్రాతినిధ్యం వహించాలని, అందుకు అవసరమైన తీర్మానాన్ని శాసనసభలో ఆమెదించి కేంద్రానికి పంపుతామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రపంచంలో అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో 21 ఏళ్లకే ప్రధానమంత్రులు అవుతున్నప్పుడు మన దేశ యువతకు ఎందుకు ఆ అవకాశం ఉండకూడదని ఆయన ప్రశ్నించారు.



ఎల్ నినో సవాళ్లను మైక్రో ఇరిగేషన్‌తో

# అధిగమిస్తాం

రైతులు సంప్రదాయ పంటల నుంచి పంటల వైవిధ్యీకరణ వైపు అడుగులు

వారికి అవసరమైన సూక్ష్మ సాగునీటి సదుపాయాలను అందిస్తాం

రైతులకు అందించే పరికరాల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దు

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

2లో

ఇందిరమ్మ టవర్స్‌పై సందేహాల

## నివృత్తికి కాల్ సెంటర్

క్యూర్ పరిధిలో లక్ష ఇండ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నాం

తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో 7680 ఇండ్ల నిర్మాణం చేపట్టనున్నాం

కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షల వరకు ఉండాలి

ఒక కుటుంబం నుంచి ఒక దరఖాస్తు మాత్రమే తీసుకుంటాం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

2లో



NEET ఫలితాలలో మరోసారి సత్తాచాటిన

అపోలో మెడికల్ అకాడమి






దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలలో ప్రభంజనం సృష్టించి అత్యుత్తమ ర్యాంకులు సాధించామని దిల్ సుఖ్ నగర్ అపోలో మెడికల్ అకాడమి చైర్మన్ పోసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అకాడమీలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను అభినందించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ అకాడమీ నుండి 620 మంది నీట్ రాయగా 405 విద్యార్థులు మెడికల్ సీట్లతో పాటు, 720 మార్కులకు గాను యస్.నిఖిల్ 700 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యా విధానంలో మార్పులకు అనుగుణంగా అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంతో బోధించడం వల్లనే అత్యుత్తమ ఫలితాలు రాబట్టగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అల్వాల మధుసూదన్, అధ్యాపకులు శ్రీధర్, రాజు, KVR, సునీల్, SMR, హరి బాబు పాల్గొనడం జరిగింది.

NEET
Apolo MEDICAL ACADEMY
Strava Free Education

METRO PILLAR NO. 1555,
POCHAMMA TEMPLE LANE,
CHAITANYAPURI, DILSUKHNAGAR
95056 04576
92480 93812

ప్రజా విశ్వంభర

# చట్ట సభల్లోకి జెన్ జీ

**విశ్వంభర, హైదరాబాద్:** నీట్ ప్రశ్నా పత్రాల లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లింపు డిమాండ్, జంతర్‌మంతర్‌లో విద్యార్థులపై లాఠీఛార్జ్‌కి నిరసనగా పీపుల్స్ ప్లాజా నుంచి నెక్లెస్ రోడ్డు వరకు పీసీసీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన కొవ్వొత్తు ర్యాలీలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం వేలాదిగా తరలివచ్చిన జెన్ జీని ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. సింగపూర్, బ్రిటన్, జర్మనీ వంటి దేశాల్లో 21 ఏళ్లకే ప్రధానమంత్రులు అయ్యే అవకాశం ఉందని, మన దేశంలోనూ ఆ అవకాశం జెన్ జీకి ఇవ్వాల్సి ఉందన్నారు. రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు 61వ రాజ్యాంగ సవరణ చేసి ఓటు హక్కును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించారని సీఎం తెలిపారు. నాడు రాజీవ్ గాంధీ తీసుకున్న నిర్ణయంతోనే నూనుగు మీసాల యువకులు, సోదరీమణులు ఓటు హక్కు పొందగలిగారని చెప్పారు. అలాగే పి.వి.నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల్లో మేయర్లు, జడ్పీ ఛైర్మన్లు వంటి పోస్టులకు ఎన్నికయ్యే వయస్సును 25 నుంచి 21 ఏళ్లకే తగ్గించారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. నాడు కాంగ్రెస్ ప్రధానమంత్రులు తీసుకున్న నిర్ణయంతోనే యువత 18 ఏళ్లకే ఓటు వేయగలుగుతున్నారని, 21 ఏళ్లకే స్థానిక సంస్థల్లో పదవులు సాధించగలుగుతున్నారని తెలిపారు. 21 ఏళ్లకే ఒక సోదరీమణి తిరువనంతపురం మేయర్‌గా ఎంపిక కావడానికి నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అవకాశమే కారణమన్నారు. లోక్‌సభలో 543 మంది ఎంపీలు ఉంటే 1 శాతానికి లోపే జెన్ జీ ప్రాతినిధ్యం ఉందన్నారు. 30 శాతంగా ఉన్న జెన్ జీకి లోక్‌సభలో 1 శాతం కన్నా తక్కువ ప్రాతినిధ్యం ఉండడం సరికాదన్నారు. 21 ఏళ్లకే లోక్‌సభకు, శాసనసభకు పంపించే బాధ్యత తాము తీసుకుంటామని... అందుకు మీరు సిద్ధంగా ఉన్నారా అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించగా.. తాము సిద్ధమని జెన్ జీ స్పందించింది. జెన్ జీ సమస్యలు పరిష్కారం కావాలంటే చట్ట సభల్లోనూ వాళ్ల ప్రాతినిధ్యం ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఇందుకోసం శాసనసభ, లోక్‌సభలకు 21 ఏళ్లకు, శాసనమండలి, రాజ్యసభకు 25 ఏళ్లకే పోటీ చేసే అవకాశం కల్పించాలని తాము డిమాండ్ చేస్తున్నామని సీఎం అన్నారు. ఈ అంశంపై ఆగస్టు మొదటి వారంలో శాసనసభ, శాసనమండలిని ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి చట్టసభల్లో పోటీ చేసే వయస్సు తగ్గింపు తీర్మానం పెట్టి ఆమోదిస్తామని సీఎం తెలిపారు. ఆ తీర్మానాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని సీఎం వెల్లడించారు. దేశంలో అత్యున్నతమైన సివిల్ సర్వీసుకు 21 ఏళ్లకే ఎంపికయ్యే అవకాశం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా 21 ఏళ్ల వయస్సుకే శ్రీలక్ష్మి, 22 ఏళ్లకే మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అనన్య, 22 ఏళ్లకే ప్రస్తుత డీజీపీ సి.వి.ఆనంద్ ఐపీఎస్‌లుగా ఎంపికైన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ కు ప్రదర్శనగా కాదని, రోడ్లపై నుంచి నేరుగా పార్లమెంట్‌లోకి (సడక్ సే సంసద్) వెళ్లేలా యువత ఉండాలన్నారు. 21 ఏళ్లకే లోక్‌సభకు పోటీ చేసే అవకాశం ఉంటే సభలోనే జెన్ జీ గళాన్ని వినిపించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. లోక్‌సభ, రాజ్యసభల్లో జెన్ జీ గళం వినిపించడం ద్వారా యువతకు దేశాన్నిపాలించే అవకాశం ఇవ్వాలని శాసనసభలో తీర్మానం చేస్తామని సీఎం పునరుద్ఘాటించారు. కేంద్రంలో రాహుల్ గాంధీ నేతృత్వంలో ఏర్పాటయ్యే ప్రభుత్వం విద్యా శాఖ జెన్ జీ నేతకు వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ అంశంలో రాహుల్ గాంధీని, ఇండియా కూటమి నేతలను ఒప్పిస్తానని సీఎం తెలిపారు. విద్యా శాఖ, ఐటీ శాఖ వంటి కీలకమైన శాఖలు.. 60, 70, 90 ఏళ్ల వాళ్లకు కాదు 21 వాళ్లకే ఇవ్వాలని, వాళ్లకేం కావాలో వాళ్లకే తెలుసని సీఎం అన్నారు. జెన్ జీ పోరాట పటిమను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసించారు. జెన్ జీ సాధించిన విజయాలను కాంగ్రెస్ పార్టీ ఖాతాలో రాసుకునే ఉద్దేశం తమకు లేదని సీఎం స్పష్టం చేశారు. లాఠీలు, తూటాలకు తలవంచకుండా పోరాడి 56 అడుగుల ఛాతీ అని చెప్పుకునే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మెడలు వంచి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించాగలిగారని ప్రశంసించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో పోరాటం ముగిసిపోలేదని సీఎం అన్నారు. పరీక్ష పేపర్ల లీక్‌తో చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లింపు, ఉద్యమం సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులపై కేసులు సోమవారం లోపు ఎత్తివేయకపోతే పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ, ఖర్గేల నాయకత్వంలో కాంగ్రెస్ పోరాడుతుందని సీఎం తెలిపారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికెపూడి గాంధీ, వల్లాల నవీన్ యాదవ్, శ్రీగణేష్, మల్ రెడ్డి రంగారెడ్డి, టి.రామ్మోహన్ రెడ్డి, సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ నేత పల్లా వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా..

## విద్యార్థుల విజయం..


### బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు మునగాల నారాయణరావు



**విశ్వంభర, నల్లగొండ:** కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయడం విద్యార్థుల, ఈ దేశ యువత చేసిన పోరాట ఫలితమని బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు సీనియర్ న్యాయవాది మునగాల నారాయణరావు అన్నారు.దేశ విద్యా వ్యవస్థపై విద్యార్థులు,తల్లిదండ్రులు ఉంచిన విశ్వాసానికి నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం తీవ్రమైన దెబ్బ తీసిందని అన్నారు. దేశ విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర రాజీనామా చేయడాన్ని కీలక పరిణామంగా భావిస్తూ శనివారం నల్లగొండ న్యాయవాదులు కోర్టు ఆవరణంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ యువత ప్రాణాలు పణంగా పెట్టి చేసిన పోరాటానికి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిగివచ్చి రాజీనామా చేయడంతో ప్రభుత్వం యొక్క తప్పిదం బహిర్గతమైందన్నారు.దేశవ్యాప్తంగా యువత సాగించిన ఉద్యమాలు,వ్యక్తమైన ప్రజా ఆందోళనల నేపథ్యంలో ఏర్పడిన పరిణామాలు కేంద్ర ప్రభుత్వానికి ఒక గట్టి హెచ్చరిక అన్నారు.విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన పరీక్షల విషయంలో నిర్లక్ష్యం, పరిపాలనా వైఫల్యం లేదా భద్రతా లోపాలకు అద్దం పడుతుందన్నారు. ప్రజాస్వామ్యంలో పదవులు అధికారాన్ని అనుభవించడానికి మాత్రమే కాదు,వైఫల్యాలకు జవాబుదారీతనం కూడా వహించాల్సిన అవసరం ఉందన్నారు.బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కట్టా అనంతరెడ్డి మాట్లాడుతూ వ్యవస్థాగత వైఫల్యాలను సరిదిద్దుకోకపోతే ఇటువంటి ఘటనలు మళ్లీ పునరావృతమవుతాయి అన్నారు.అందువల్ల పరీక్షల నిర్వహణకు సంబంధించి పూర్తిస్థాయి సంస్కరణలు, అత్యాధునిక భద్రతా వ్యవస్థలు,పారదర్శక పర్యవేక్షణ,స్వతంత్ర ఆడిట్ వ్యవస్థను వెంటనే అమలు చేయాలన్నారు.కేంద్ర ప్రభుత్వానికి మా స్పష్టమైన హెచ్చరిక ఏమిటంటే దేశ యువత సహనాన్ని బలహీనతగా భావించవద్దు అన్నారు.విద్య, ఉపాధి, పోటీ పరీక్షల విషయంలో జరిగే ప్రతి వైఫల్యానికి ప్రజాస్వామ్యబద్ధమైన నిరసనలు మరింత ఉధృతమవుతాయన్నారు. విద్యార్థుల కలలతో, వారి జీవితాలతో చెలగాటం ఆడే ఏ ప్రభుత్వాన్నీ చరిత్ర క్షమించదు అన్నారు.ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లేపల్లి ఆది రెడ్డి మాట్లాడుతూ నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి పాల్పడిన ప్రతి వ్యక్తిని, అధికారులు ఎవరైనా సరే, రాజకీయ జోక్యం లేకుండా చట్టం ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. యువతకు న్యాయం చేయడం, పరీక్షలపై విశ్వాసాన్ని పునరుద్ధరించడం కేంద్ర ప్రభుత్వ రాజ్యాంగబద్ధమైన బాధ్యత అన్నారు.ప్రభుత్వాలు మారవచ్చు,మంత్రులు మారవచ్చు, కానీ విద్యార్థుల భవిష్యత్తు ఒక్కసారి దెబ్బతింటే దాన్ని తిరిగి తీసుకురావడం సాధ్యం కాదన్నారు. అందుకే ఈ ఘటనను కేంద్ర ప్రభుత్వం చివరి హెచ్చరికగా తీసుకుని విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలని లేనిపక్షంలో దేశ యువత ప్రజాస్వామ్యబద్ధంగా మరింత బలమైన ఉద్యమాలతో తమ హక్కులను సాధించుకునే దిశగా ముందుకు సాగడం అనివార్యం అవుతుందని హెచ్చరించారు.ఈ విలేకరుల సమావేశంలో నజీరుద్దీన్,గిరి లింగయ్య గౌడ్, పెరుమాళ్ళ శేఖర్,అన్నపూసల ఐలేష్, పందుల సైదులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా వర్షాలు .. 3 రాష్ట్రాలకు 'రెడ్ అలర్ట్'

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు తీవ్రరూపం దాల్చడంతో వివిధ రాష్ట్రాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. జూలై 26న గుజరాత్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. ఇప్పటికే గుజరాత్‌లోని పాటన్ జిల్లా సంతల్‌పూర్‌లో గడిచిన 24 గంటల్లో 390 మి.మీ అత్యధిక వర్షపాతం నమోదైంది.రాబోయే 24 గంటల్లో తెలుగు రాష్ట్రాలు సహా అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మేఘాలయ, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ స్పష్టం చేసింది. తీర ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశముందని అప్రమత్తం చేసింది.నైరుతి రాజస్థాన్, వాయువ్య బంగాళాఖాతం పరిసరాల్లో ఏర్పడిన అల్పపీడనాలు, వాటికి తోడైన పశ్చిమ విక్షోభం ప్రభావంతోనే వర్షాలు ఉధృతమయ్యాయని అధికారులు వెల్లడించారు. గుజరాత్‌లోని సౌరాష్ట్ర, కచ్‌తో పాటు జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ జిల్లాల్లో ఆకస్మిక వరదలు సంభవించే ముప్పు ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఐఎండీ అధికారులు హెచ్చరించారు.



## ఎల్ నినో సవాళ్లను మైక్రో ఇరిగేషన్‌తో అధిగమిస్తాం

**రైతులు సంప్రదాయ పంటల నుంచి పంటల వైవిధ్యీకరణ వైపు అడుగులు**

**వారికి అవసరమైన సూక్ష్మ సాగునీటి సదుపాయాలను అందిస్తాం**

**రైతులకు అందించే పరికరాల నాణ్యతఁ విషయంలో ఎలాంటి రాజీ పడవద్దు**

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో ఎల్-నినో పరిస్థితుల అధిగమించేందుకు మైక్రో ఇరిగేషన్ వ్యవస్థల ఏర్పాటును వేగవంతం చేయాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సూచించారు. శనివారం సచివాలయంలో కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విపత్కర పరిస్థితుల్లోనే ప్రభుత్వంతో పాటు కంపెనీల బాధ్యత కూడా మరింత పెరుగుతుందని అన్నారు. రైతులు సంప్రదాయ పంటల నుంచి పంటల వైవిధ్యీకరణ వైపు అడుగులు వేస్తున్న ఈ సమయంలో వారికి అవసరమైన సూక్ష్మ సాగునీటి సదుపాయాలను అందిస్తామన్నారు. రాష్ట్రంలో సుమారు 80 శాతం మంది రైతులు చిన్న, సన్నకారు రైతులేనని సుమారు 30 లక్షల బోర్‌వెల్స్ ద్వారా సాగు జరుగుతోందని పేర్కొన్నారు. డ్రిప్ వ్యవస్థతో తక్కువ నీరు, తక్కువ విద్యుత్, తక్కువ పురుగుమందులతో అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సూక్ష్మ సాగునీటి విస్తరణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఈ సంవత్సరానికి 2,38,750 ఎకరాల లక్ష్యాన్ని నిర్దేశించామని, ఇందులో 85 వేల ఎకరాలు ఆయిల్‌పామ్‌కు, 1,53,750 ఎకరాలు ఇతర పంటలకు కేటాయించినట్లు చెప్పారు. ఇప్పటివరకు 65,446 ఎకరాలకు పరిపాలనా అనుమతులు జారీ చేసినప్పటికీ, కేవలం 34,909 ఎకరాల్లో మాత్రమే డ్రిప్ వ్యవస్థల ఏర్పాటు పూర్తైందని, ఇంకా 30,537 ఎకరాల్లో పనులు పెండింగ్‌లో ఉండటం సంతృప్తికరంగా లేదన్నారు. ప్రతి మైక్రో ఇరిగేషన్ కంపెనీ తమకు కేటాయించిన జిల్లాల్లో పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. రైతులకు అందించే పరికరాల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని, ప్రమాణాలకు అనుగుణమైన సామగ్రినే అందించాలని స్పష్టం చేశారు. వ్యవస్థల ఏర్పాటు అనంతరం ఆఫ్టర్ సేల్స్ సర్వీస్‌ను క్రమం తప్పకుండా అందిస్తూ, రైతుల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కంపెనీలు బెంచ్‌మార్క్ సర్వే , బిల్ ఆఫ్ క్వాంటిటీస్ పూర్తి చేసి, పరిపాలనా అనుమతుల కోసం వెంటనే సమర్పించాలని సూచించారు. పరిపాలనా అనుమతుల జారీ ప్రక్రియలో జాప్యం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమతులు జారీ అయిన వెంటనే రైతులకు అవసరమైన డ్రిప్ సామగ్రి సరఫరా చేసి, సంస్థాపన పనులను పూర్తి చేయాలని చెప్పారు.

**రైతులకు నీటి పొదుపుపై అవగాహన అవసరం..**

ఎల్-నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం రూపొందించిన కంటింజెన్సీ కార్యాచరణలో భాగంగా గ్రామ, క్లస్టర్, మండల స్థాయిలో నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో అన్ని మైక్రో ఇరిగేషన్ కంపెనీలు తప్పనిసరిగా పాల్గొని రైతులకు నీటి పొదుపు, సూక్ష్మ సాగునీటి ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఉద్యానశాఖ అధికారులు వ్యవసాయశాఖతో పాటు ఇతర శాఖలతో కూడా సమన్వయం చేసుకొని లక్ష్యాల సాధనకు కృషి చేయాలని ఆదేశించారు. సమావేశంలో కంపెనీల ప్రతినిధులు తమ ఆర్థికపరమైన ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి, పెండింగ్ బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం తరఫున పూర్తి స్థాయిలో కృషి చేస్తానని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గత రెండేళ్లలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు 400 కోట్లు చెల్లించామని, అయితే, చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయనే కారణంతో పనుల వేగం తగ్గించడం సమంజసం కాదని, రైతుల ప్రయోజనాల దృష్ట్యా పనులను నిరాటంకంగా కొనసాగించాలన్నారు. కంపెనీల పనితీరును ప్రభుత్వం జిల్లాల వారీగా నిరంతరం సమీక్షిస్తుందని, ఆలస్యం, నాణ్యత లోపాలు లేదా రైతుల ఫిర్యాదుల విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని కంపెనీలకు సూచించారు. అవసరమైతే ఇతర జాతీయ, అంతర్జాతీయ మైక్రో ఇరిగేషన్ కంపెనీలు తెలంగాణలో పనిచేయడానికి ఆసక్తి చూపితే, వాటిని కూడా ఎంప్యానెల్ చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది నిర్దేశించిన లక్ష్యాలను సమయానికి పూర్తి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రభుత్వం, అధికారులు, మైక్రో ఇరిగేషన్ కంపెనీలు సమన్వయంతో పనిచేస్తేనే రైతులకు పూర్తి స్థాయిలో ప్రయోజనం చేకూరుతుందని, సూక్ష్మ సాగునీటి విస్తరణలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

## ఇందిరమ్మ టవర్స్‌పై సందేహాల నివృత్తికి కాల్ సెంటర్

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** హైదరాబాద్ నగరంలోని నిరుపేదల సొంతింటి కలను నిజం చేయడానికి క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టినట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ పథకంపై ప్రజల్లో ఎలాంటి గందరగోళం, అపోహలు లేకుండా దరఖాస్తు విధానం, అర్హతలు, అవసరమైన పత్రాలు, చెల్లింపులు, కేటాయింపు విధానం తదితర అంశాలపై పూర్తి సమాచారం అందించేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు వివరించారు. శనివారం హౌసింగ్ బోర్డు కార్యాలయంలో స్పెషల్ కాల్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ప్రజలు మధ్యవర్తులను నమ్మకుండా ఎలాంటి సందేహం ఉన్నా నేరుగా 040-24603572 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ హెల్ప్ లైన్ పనిచేస్తుందన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో వివరాలు తెలియజేస్తారన్నారు.

**లక్ష ఇండ్ల నిర్మాణం లక్ష్యంగా..**

'క్యూర్ పరిధిలో లక్ష ఇండ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నాం. తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో 7680 ఇండ్ల నిర్మాణం చేపట్టనున్నాం. ఏ నియోజకవర్గానికి చెందిన ప్రజలు అదే నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకోవాలి. ప్రజలు తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు. మీసేవ కేంద్రాలు, ఆన్‌లైన్ పోర్టల్, వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షల వరకు ఉండాలి. ఒక కుటుంబం నుంచి ఒక దరఖాస్తు మాత్రమే తీసుకుంటాం. దరఖాస్తులను డిజిటల్ విధానంలో పరిశీలిస్తాం. క్షేత్రస్థాయిలోనూ పరిశీలన ఉంటుంది. నిర్మిస్తున్న ఫ్లాట్ల సంఖ్య కంటే అర్హులైన దరఖాస్తుదారుల సంఖ్య ఎక్కువగా ఉంటే.. పారదర్శకమైన విధానంలో లాటరీ ద్వారా ఇండ్లను కేటాయిస్తాం. దరఖాస్తుదారులు క్యూర్ పరిధిలో పదేళ్లుగా నివాసం ఉండాలి. క్యూర్ పరిధిలో సొంత ఇల్లు, ఫ్లాట్, ప్లాట్ ఉండకూడదు. ఒక కుటుంబం నుంచి ఒక దరఖాస్తు మాత్రమే సమర్పించాలి' అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

**525 చదరపు అడుగుల్లో ఇల్లు..**

'ఈ పథకం కింద ఒక బెడ్‌రూమ్, హాల్, కిచెన్‌తో సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఇల్లు నిర్మిస్తున్నాం. ఒక్కో ఫ్లాట్ ఖరీదు రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉంటుంది. ఇందులో ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీతో పాటు అన్ డివైడెడ్ షేర్ కింద 20 నుంచి 25 గజాల స్థలాన్ని కూడా లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేస్తుంది. లబ్ధిదారులు కేవలం రూ.6 లక్షలు చెల్లిస్తే చాలు. అప్లై చేసే సమయంలో ఆధార్ నెంబర్ ఇస్తే సరిపోతుంది. ఇతర డాక్యుమెంట్స్‌ను అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదు. లాటరీ సమయంలో వీటిని సమర్పించవచ్చు. దరఖాస్తు సమయంలో రూ.10 వేల చెల్లింపునకు యూపీఐ, నెట్ బ్యాంకింగ్‌ను మాత్రమే ఉపయోగించాలి. ఒకవేళ ఇల్లు మంజూరు కాకపోతే తిరిగి అదే ఖాతాకు ఆ మొత్తాన్ని వాపసు చేస్తాం. పరిశీలన, కేటాయింపు, వాపసు పూర్తయ్యేవరకు మీసేవ రశీదు, చెల్లింపు రశీదు, దరఖాస్తు సంఖ్య, మొబైల్ నెంబర్‌లను యాక్టివ్‌గా ఉంచుకోవాలి' అని మంత్రి పొంగులేటి సూచించారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా
## సీజేపీ ఉద్యమంతో దిగొచ్చిన కేంద్రం

**లక్షలాది మంది విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యం..**

నీట్ పరీక్షకు హాజరైన లక్షలాది మంది విద్యార్థుల ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. పరీక్ష వివాదం కారణంగా ఏ ఒక్క ప్రతిభావంతుడైన విద్యార్థి నష్టపోకూడదనే ఉద్దేశంతో పనిచేశానని తెలిపారు. నీట్ ఫలితాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పలువురు విద్యార్థులు కూడా మంచి ఫలితాలు సాధించారని చెప్పారు. అయితే కొందరు బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న వ్యక్తులు విద్యార్థులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు.

**పేపర్ లీక్‌లపై కఠిన చర్యలు..**

దేశవ్యాప్తంగా పేపర్ లీక్‌లను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. పేపర్ లీక్‌లను నియంత్రించేందుకు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసేలా కొత్త చట్టాన్ని తీసుకురావాలని కేంద్రం యోచిస్తోంది. ఇటీవల నీట్ వ్యవహారంపై దేశంలోని పలు ప్రాంతాల్లో విద్యార్థులు నిరసనలు చేపట్టారు. ఢిల్లీ జంతర్ మంతర్ సహా అనేక ప్రాంతాల్లో ఆందోళనలు కొనసాగాయి. విద్యార్థుల న్యాయం కోసం వివిధ సంఘాలు కూడా ఉద్యమించాయి.

**వచ్చే ఏడాది నుంచి కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్..**

నీట్ పరీక్ష నిర్వహణలో మార్పులు తీసుకురావాలని కేంద్రం నిర్ణయించింది. వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్షను కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించే అంశంపై చర్యలు తీసుకుంటున్నట్లు ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. పరీక్షా విధానంలో పారదర్శకత పెంచడం, అక్రమాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఈ మార్పులు చేపడుతున్నట్లు చెప్పారు. రాజీనామా లేఖలో ప్రధాని నరేంద్ర మోదీకి ధర్మేంద్ర ప్రధాన్ కృతజ్ఞతలు తెలిపారు. విద్యాశాఖ మంత్రిగా పనిచేసే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు చెప్పారు. దేశ సేవ తన జీవితంలో అత్యంత ముఖ్యమైన బాధ్యత అని పేర్కొన్నారు.

### ఏ ప్రభుత్వమైనా తప్పు జరిగితే
## తలవంచాల్సిందే

– 'కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేశారన్న వార్త ఇప్పుడే విన్నాను. ఈ రాజీనామాను నేను స్వాగతిస్తున్నాను. ఈ చర్య దేశంలోని పరిస్థితిని చక్కదిద్ది.. పార్లమెంటులోనూ, వెలుపలా మౌలిక సమస్యలపై చర్చలకు మార్గం సుగమం చేస్తుందని ఆశిస్తున్నాను' **– కాంగ్రెస్ నేత చిదంబరం**

– 'అభినందనలు.. ఎట్టకేలకు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. విద్యార్థులు లాఠీ దెబ్బలు తిని.. గాయాలపాలయ్యారు. కొందరు 23 రోజుల పాటు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ నిరసనలతోనే కేంద్రం దిగి వచ్చింది'
**– రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్**

– 'ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనం నుంచి తప్పించుకోలేమనే విషయాన్ని విద్యాశాఖ మంత్రి అంగీకరించారు. దేశవ్యాప్తంగా ఉన్న పౌరులు వారాల తరబడి పోరాటం చేస్తే ఇది జరిగింది. శాంతియుతంగా నిరసన తెలిపే తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకున్నందుకు.. ఎంతో మంది విద్యార్థులు పోలీసుల క్రూరత్వానికి, బలప్రయోగానికి గురయ్యారు. కానీ విద్యాశాఖ మంత్రి రాజీనామాతో జవాబుదారీతనం ముగిసిపోదు. మనల్ని ఈ దుస్థితికి తీసుకువచ్చిన ప్రభుత్వ వైఫల్యాలను సరిచేయడానికి ప్రభుత్వం సంస్కరణలు చేపట్టాలి. మళ్లీ ఇటువంటి పరిస్థితి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి. ఈ నిరసనలు సంస్కరణలకు ఆరంభం మాత్రమే.. ముగింపు కాదు' **–కాంగ్రెస్ నేత శశి థరూర్**

– 'ఇది ప్రజాస్వామ్యానికి అతిపెద్ద విజయం. వ్యవస్థలో జరిగిన తప్పులకు వ్యతిరేకంగా పోరాడి..విజయం సాధించిన యువతకు అభినందనలు'
**–అరవింద్ కేజ్రీవాల్**

### విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషి

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తాజాగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దీనిని ఆమోదించారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రధానమంత్రి సూచన మేరకు రాష్ట్రపతి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.కర్ణాటకకు చెందిన ప్రహ్లాద్ జోషి .. ధార్వాడ లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ శాఖ మంత్రిగా ఉన్నారు. ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ అధ్యక్షుడిగానూ సేవలందిస్తున్నారు.

## 45 రోజులకోసారి మండల ప్రజాపరిషత్ సమావేశాలు..

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** ప్రతీ 45 రోజులకు ఒకసారి తప్పనిసరిగా మండల ప్రజాపరిషత్ సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల పంచాయతీరాజ్ శాఖపై సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపరిషత్ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించినట్టు సీఎస్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రజాపరిషత్ సమావేశాల్లో సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని స్పష్టం చేశారు. ఇందుకు మండల ప్రత్యేక అధికారులు చొరవ చూపాలన్నారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వ పథకాల అమలు, గ్రామపంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరగాలన్నారు. ఈ ఆదేశాలను తక్షణమే అమలు చేయాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌ను, జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది.

## పదవుల్లో ఉన్న వారికంటే ప్రజల బలమే గొప్పది

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** పదవుల్లో ఉన్న వారికంటే ప్రజల బలమే గొప్పదని, జెన్-జీకి సెల్యూట్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కేంద్రమంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన నేపథ్యంలో స్పందించిన కేటీఆర్.. ఎలాంటి రాజకీయ అండ లేకుండా, పార్టీలకు అతీతంగా తమకు జరిగిన అన్యాయాన్నే ఎజెండాగా చేసుకుని విద్యార్థులు సాగించిన ఉద్యమం ప్రజాస్వామ్య చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. యువత చూపిన తెగువ, ఐక్యత, పోరాట పటిమ దేశానికి స్ఫూర్తిగా నిలిచిందని కొనియాడారు. 'దేశ యువత లేవనెత్తిన ప్రశ్నలను పట్టించుకోకుండా ప్రభుత్వాలు రాజకీయాలకే పరిమితమైతే భవిష్యత్తులో ఇలాంటి ఉద్యమాలు మరింత ఉధృతమయ్యే అవకాశం ఉంది. విద్యార్థుల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించాల్సిన అవసరాన్ని ఈ ఉద్యమం స్పష్టంగా చాటిచెప్పింది. పదవుల్లో ఉన్నవారు తమ నిర్ణయాలు, తప్పులకు బాధ్యత వహించాల్సిన సమయం వచ్చింది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుణపాఠం నేర్చుకొని యువతకు అత్యంత కీలకమైన విద్య, ఉపాధిపైన దృష్టి సారించి వారి ఆకాంక్షల మేరకు పాలన సాగించాల్సిన అవసరాన్ని జెన్ జీ ఉద్యమం నిరూపించింది' అని కేటీఆర్ పేర్కొన్నారు.




# నాగార్జున పాఠశాలలో ఘనంగా వనమహోత్సవం

**విశ్వంభర, రామన్నపేట:** పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని నాగార్జున పాఠశాల ఆధ్వర్యంలో లచ్చిరెడ్డిగూడెంలో శనివారం వనమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది కలిసి పాఠశాల ఆవరణలో, పరిసర ప్రాంతాల్లో పలు రకాల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మొక్కల ప్రాముఖ్యత, పర్యావరణ సమతుల్యతలో వాటి పాత్ర, భవిష్యత్ తరాలకు పచ్చని ప్రకృతిని అందించాల్సిన బాధ్యతపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించి పెద్ద చెట్టుగా తీర్చిదిద్దాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా నాగార్జున స్కూల్ కరస్పాండెంట్ డా.ఎన్.నాగరాజు మాట్లాడుతూ, "చెట్లు భూమికి ఊపిరితిత్తులు అని, మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి పౌరుడి బాధ్యత అని, విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# కేపీహెచ్‌బీలో కుబేరా సిల్క్స్ ప్రారంభించిన లావణ్య త్రిపాఠి




**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణలో పట్టు చీరలు, బ్రైడల్ కలెక్షన్స్, డిజైనర్ చీరలు, సంప్రదాయ వస్త్రాలకు ప్రసిద్ధి చెందిన కుబేరా సిల్క్స్ తన 6వ బ్రాంచ్‌ను కెపిహెచ్బి లోని ధర్మారెడ్డి కాలనీ లో హీరోయిన్ లావణ్య త్రిపాఠి ప్రారంభించారు. లావణ్య త్రిపాఠి మాట్లాడుతూ కుబేర సిల్క్స్ లో కలెక్షన్స్ చాలా బాగున్నాయి, ఆడవారికి చీరలు ప్రతి అకేషన్ కి మొదటి ఛాయిస్ గా ఉంటుందని నా దగ్గర చాలా వెరైటీలు అన్ని కలర్స్ ఎప్పుడు రెడీగా ఉంచుకుంటాను, వారు మరిన్ని బ్రాంచీలతో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా కుబేరా సిల్క్స్ వ్యవస్థాపకులు ఎం. శ్యాంసుందర్, జి. శ్రీనివాస్, డా. జి. షాలిని మాట్లాడుతూ, నాణ్యత, విశ్వసనీయత, అందుబాటు ధరలతో వినియోగదారులకు ఉత్తమమైన షాపింగ్ అనుభవాన్ని అందించాలనే లక్ష్యంతో హైదరాబాద్‌లో విస్తరణ కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. కొత్త బ్రాంచ్‌లో పట్టు చీరలు, బ్రైడల్ కలెక్షన్స్, డిజైనర్ చీరలు, ఫ్యాన్సీ వేర్, సంప్రదాయ దుస్తులు విస్తృతంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు.

# నిరుద్యోగుల ధర్నా.. జేఏసీ నేతల అరెస్టు



**విశ్వంభర, చిక్కడపల్లి :** హైదరాబాదు చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీ వద్ద శనివారం రాత్రి నిరుద్యోగులు ధర్నా నిర్వహించారు. ఎన్నికల హామీ మేరకు రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల సంఖ్య పెంచడంతో పాటు వయోపరిమితిని సడలించాలని, గ్రూప్స్, జేఎల్ఎం, ఇంజినీరింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేయాలని కోరారు. ధర్నాను పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. అనంతరం నిరుద్యోగ జేఏసీ నాయకులు శంకర్ నాయక్, నరేష్, కిరణ్‌లను అరెస్టు చేసి చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సవాయి సింగ్, సురేష్, గణేష్, రవి నాయక్, ప్రవీణ్, కల్పన, సుప్రియ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


# ప్రజల ఆకాంక్షల మేరకు నడవడమే ప్రజాస్వామ్యం: బండి సంజయ్



**విశ్వంభర, హైదరాబాద్:** 'పదవులు తాత్కాలికం, ప్రజల విశ్వాసమే అంతిమం' అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు నడవడమే ప్రజాస్వామ్యమని చెప్పారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ఆయన స్పందించారు. తమకు పార్టీ కంటే.. దేశమే ప్రధానమన్నారు. " ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజాస్వామ్యం అంటే.. ప్రజల గొంతు వినడం, వారి మాటను గౌరవించడం, అవసరమైతే బాధ్యత తీసుకునే ధైర్యాన్ని కలిగి ఉండటం. భాజపా దాన్నే పాటిస్తుంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పార్టీ విలువలను ప్రతిబింబిస్తుంది. ఇన్నేళ్లపాటు దేశసేవలో భాగమైనందుకు ధర్మేంద్ర ప్రధాన్‌కు ధన్యవాదాలు" అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

# 27న హార్స్ రేస్ ప్రారంభం

**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్ రేస్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 27 న మలక్ పేట్ లో ఘనంగా హార్స్ రేస్ నిర్వహించనున్నట్లు చైర్మన్ సురేందర్ రెడ్డి, సెక్రటరీ కిరణ్ రెడ్డి లు మీడియా సమావేశంలో ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సీజన్ 2026-27 మాన్సూన్, వింటర్ సీజన్ లు ప్రారంభిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ హార్స్ రేస్ ను పెద్ద ఎత్తున ప్రజలు సందర్శించి విజయవంతం చేయాలనీ కోరారు.




# న్యాయవాదులు నిరంతరం నూతన చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

### ఫ్యాకల్టీ నల్సార్ లా యూనివర్సిటీ డా.డి.బాలకృష్ణ

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** నేటి సమాజంలో నేరాల స్వరూపం వేగంగా మారుతుందని,సాంప్రదాయ నేరాలతో పాటు సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలు,డిజిటల్ ఫ్రాడ్లు,కృత్రిమ మేధస్సు దుర్వినియోగం,డీప్‌ఫేక్‌లు, డేటా చోరీ,ఆన్‌లైన్ వేధింపులు,అంతర్జాతీయ నేరాల వంటి సవాళ్లు రోజురోజుకు పెరుగుతున్నాయని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా, హైదరాబాద్ ఫ్యాకల్టీ డా.డి.బాలకృష్ణ అన్నారు.ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ మరియు బార్ అసోసియేషన్ నల్లగొండ ఆధ్వర్యంలో సంయుక్తంగా శనివారం నల్లగొండ బార్ అసోసియేషన్ హాల్‌లో "ఆధునిక నేరాలు మరియు క్రిమినల్ న్యాయవ్యవస్థ,నూతన సవాళ్లు, న్యాయపరమైన స్పందనలు" అంశంపై నిర్వహించిన న్యాయవాదుల అవగాహన సదస్సుకు ఐఏఎల్ జిల్లా అధ్యక్షులు కట్టా అనంతరెడ్డి అధ్యక్షత వహించగా నల్సార్ లా యూనివర్సిటీ ఫాకల్టీ ప్డి బాలకృష్ణ ముఖ్య వక్తగా హాజరై మాట్లాడుతూ,నేరాల పరిణామానికి అనుగుణంగా క్రిమినల్ జస్టిస్ వ్యవస్థ కూడా ఆధునికీకరణ చెందాల్సిన అవసరం ఉందన్నారు. భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్), భారతీయ నాగరిక సురక్షా సంహిత (బి ఎన్ ఎస్ ఎస్), భారతీయ సాక్ష్య అధినియమం (బి ఎస్ ఏ) అమల్లోకి వచ్చిన నేపథ్యంలో న్యాయవాదులు వాటి నిబంధనలను లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు.డిజిటల్ సాక్ష్యాలు,ఎలక్ట్రానిక్ రికార్డులు,మొబైల్ ఫోరెన్సిక్ విశ్లేషణ, సీసీటీవీ ఫుటేజ్, సోషల్ మీడియా ఆధారాలు,కాల్ డేటా రికార్డులు



వంటి ఆధారాలు నేటి క్రిమినల్ ట్రయల్స్‌లో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.ఈ ఆధారాల సేకరణ, సంరక్షణ,న్యాయస్థానంలో వాటి ఆమోదయోగ్యతపై న్యాయవాదులకు సమగ్ర అవగాహన ఉండాలన్నారు.కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగం ఒకవైపు నేరాల దర్యాప్తుకు సహకరిస్తున్నప్పటికీ, మరోవైపు డీప్‌ఫేక్ వీడియోలు,డిజిటల్ మోసాలు, వ్యక్తిగత గోప్యత ఉల్లంఘనలు వంటి కొత్త సవాళ్లను సృష్టిస్తోందన్నారు. అందువల్ల చట్ట అమలు సంస్థలు,న్యాయవ్యవస్థ, న్యాయవాదులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నేరాల నియంత్రణలో కేవలం శిక్షలు విధించడం మాత్రమే కాకుండా, వేగవంతమైన దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణ, బాధితులకు న్యాయం, నిందితుల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ, పారదర్శక విచారణ వంటి అంశాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.రాజ్యాంగం కల్పించిన న్యాయమైన విచారణ,సహజ న్యాయ సూత్రాలు, మానవ హక్కుల పరిరక్షణ క్రిమినల్ జస్టిస్ వ్యవస్థకు మూలస్తంభాలని ఆయన పేర్కొన్నారు.సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు వ్యక్తిగత స్వేచ్ఛలను కూడా సమతుల్యంగా కాపాడటమే ఆధునిక న్యాయవ్యవస్థ లక్ష్యమని పేర్కొన్నారు.న్యాయవాదులు జీవితాంతం విద్యార్థులుగానే ఉంటారని,చట్టాల్లో వస్తున్న మార్పులు, సుప్రీంకోర్టు మరియు హైకోర్టుల తాజా తీర్పులు,సాంకేతిక పరిణామాలపై నిరంతరం అధ్యయనం చేయడం ద్వారా మాత్రమే సమర్థవంతమైన న్యాయ సేవలను అందించగలరని డా.డి.బాలకృష్ణ అన్నారు. న్యాయవాదులు కాలానుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటేనే ఆధునిక నేరాలను సమర్థంగా ఎదుర్కొని, సమాజానికి న్యాయం అందించడంలో కీలక పాత్ర పోషించగలరని ఆయన వారన్నారు.ఈ కార్యక్రమంలో ఐ ఏ ఎల్ రాష్ట్ర నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి, మునగాల నారాయణరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకవరపు సతీష్ కుమార్, కార్యదర్శి బి అశోక్ కుమార్,న్యాయవాదులు జీ.వెంకటేశ్వర్లు, జి.జవహర్ లాల్, భువనగిరి రవి, గుర్రం వెంకట్ రెడ్డి, నాంపల్లి నరసింహ, ఎన్ భీమార్జున్ రెడ్డి, నాగిరెడ్డి,పందుల సైదులు, నాంపల్లి భాగ్య,బి.వెంకటేశ్వర్లు, తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ పోరాటం.. దేశానికే గర్వకారణం

### టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి
### సంగారెడ్డిలో ఘనంగా రాహుల్ గాంధీ విక్టరీ ర్యాలీ
### హాజరైన ఏఐసీసీ కార్యదర్శి జెట్టి కుసుం కుమార్

**విశ్వంభర, సంగారెడ్డి:** "రాహుల్ గాంధీ కా లడాయి... దేశ్ కే లియే బడాయి" (రాహుల్ గాంధీ పోరాటం దేశ పురోగతి, ప్రజల శ్రేయస్సు కోసమే) అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. దేశంలో విద్యార్థుల సమస్యలపై రాహుల్ గాంధీ జరిపిన సుదీర్ఘ పోరాటానికి లభించిన విజయానికి గుర్తుగా సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఆధ్వర్యంలో "రాహుల్ గాంధీ విక్టరీ ర్యాలీ" అంగరంగ వైభవంగా జరిగింది.సంగారెడ్డి ఐబీ గెస్ట్ హౌస్ నుండి ప్రారంభమైన ఈ పాదయాత్ర పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. భారీ సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో జగ్గారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి జెట్టి కుసుం కుమార్ ప్రసంగించారు.జగ్గారెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీ నిరంతరం ప్రజల, విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతున్నారని, ఆయన పోరాటం వల్లే నేడు దేశంలోని విద్యార్థులకు, ప్రజలకు కొండంత కొండంత బలం చేకూరిందని



పేర్కొన్నారు.నీట్ పేపర్ లీక్ తప్పిదం వల్ల దేశంలో 14 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తిచేసుకున్నామని మిఠాయిలు పంచుకుంటోందే తప్ప, విద్యార్థుల అవస్థలను పట్టించుకోలేదని విమర్శించారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం వేలాది మంది జంతర్ మంతర్ వద్ద పోరాడారని, రాహుల్ గాంధీ స్వయంగా ప్రధాని మోదీ ఇంటి ముందు ధర్నా చేయడంతోనే ఉద్యమం తీవ్రరూపం దాల్చిందన్నారు.రాహుల్ గాంధీ తెచ్చిన తీవ్ర ఒత్తిడికి తలొగ్గి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని, ఇది బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠమని అన్నారు. ఈ తప్పిదానికి ప్రధాని మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**లక్ష్యం ఒక్కటే.. రాహుల్ ప్రధాని కావాలి**

"దేశంలో ప్రజలు సుఖశాంతులతో, భద్రతతో, క్షేమంగా ఉండాలంటే రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలి. రాహుల్ గాంధీ పిలుపునిస్తే సంగారెడ్డి ప్రజలు ఎప్పుడైనా ఆందోళనలకు సిద్ధంగా ఉంటారు. ఆయన రోడ్డు మీదకు వస్తే మనం రావాల్సిందే. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే వరకు మన పోరాటం, ఆరాటం ఆగేది లేదు" అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐసీసీ కార్యదర్శి జెట్టి కుసుం కుమార్ మాట్లాడుతూ... ఏఐసీసీ పిలుపునిచ్చిన కార్యక్రమాల కంటే ఒక అడుగు ముందే ఉండి జగ్గారెడ్డి క్షేత్రస్థాయిలో ఎన్నో గొప్ప కార్యక్రమాలు నిర్వహిస్తుంటారని కొనియాడారు.రాహుల్ గాంధీ కుటుంబం దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహోన్నతమైన కుటుంబమని గుర్తుచేశారు.గతంలో లాల్ బహదూర్ శాస్త్రి రైలు ప్రమాదం జరిగినప్పుడు ఎవరూ డిమాండ్ చేయకముందే నైతిక బాధ్యత వహిస్తూ రైల్వే మంత్రి పదవికి రాజీనామా చేశారని, అలాగే విమాన ప్రమాదం జరిగినప్పుడు మాధవరావు సింధియా పౌర విమానయాన శాఖ మంత్రి పదవిని వదులుకున్నారని తెలిపారు. ఆ రకమైన ఉన్నతమైన విలువలు, నైతికత ఒక్క కాంగ్రెస్ పార్టీ చరిత్రలోనే ఉన్నాయని ఆయన ఉద్ఘాటించారు.

# వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి మరో రూ.99.40 కోట్లు..

### నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన అధికారులు..
### గత 2023-24 బడ్జెట్లో 50 కోట్లు,2024-25 బడ్జెట్లో 100 కోట్లు నిధులు విడుదల
### సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**విశ్వంభర,వేముల వాడ:** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం సమగ్ర అభివృద్ధి, విస్తరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.99.40 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు సంబంధిత శాఖ అధికారులు శనివారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. తాజా నిధుల మంజూరుతో ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం విడుదల చేసిన మొత్తం నిధులు రూ.249.40 కోట్లకు చేరుకున్నాయి.రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే అత్యంత ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒకటిగా వెలుగొందుతున్న రాజన్న ఆలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వంలో దశలవారీగా భారీ నిధులు కేటాయిస్తోంది. ఇందులో భాగంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.50 కోట్లు, 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్లు విడుదల చేయగా, ఇప్పుడు మరో రూ.99.40 కోట్లు మంజూరు చేయడంతో అభివృద్ధి పనులకు మరింత వేగం చేకూరనుంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో చేపట్టిన ఆలయ అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఆలయానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఆలయ పరిసరాలను ఆధునికీకరించడం, యాత్రికులకు విశాలమైన వసతులు కల్పించడం వంటి లక్ష్యాలతో ఈ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే సుమారు 45 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు వెల్లడించారు.తాజాగా విడుదలైన నిధులతో మిగిలిన నిర్మాణాలు, మౌలిక వసతుల అభివృద్ధి, ఆలయ పరిసరాల సుందరీకరణ, భక్తుల కోసం అవసరమైన సౌకర్యాల కల్పన వంటి పనులను వేగవంతం చేయనున్నారు. దీంతో వేములవాడ ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య మరింత పెరిగే



అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.ఈ సందర్భంగా నిధుల మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, శ్రీధర్ బాబు,మంత్రి పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్లకు రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆలయ అభివృద్ధిని ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు..శృంగేరి పీఠాధిపతుల శ్రీశ్రీశ్రీ విధుశేకర భారతి స్వామి వారిని పలు మార్లు కలిసి రాజన్న ఆలయ అభివృద్ధి పై వారి సలహాలు సూచనలు తీసుకొని ముందుకు వెళ్లడం జరుగుతుంది. త్వరలోనే మరోసారి శృంగేరి వెళ్లి స్వామి వారిని కలిసి వారి సలహాలు సూచనలు తీసుకోవడం జరుగుతుందన్నారు.వేములవాడ రాజన్న ఆలయం తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవంగా నిలిచిందని, ఆలయ విస్తరణ పూర్తయితే ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా పర్యాటక రంగంలోనూ వేములవాడ మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుందని స్థానికులు, భక్తులు అభిప్రాయపడుతున్నారు. భారీ నిధుల విడుదలతో ఆలయ అభివృద్ధి పనులు మరింత వేగవంతమవుతాయని, త్వరలోనే భక్తులకు అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# ఢిల్లీలో విద్యార్థుల మహాధర్నాకు ఎమ్మెల్సీ కోదండరామ్ సంఘీభావం

**ఢిల్లీ:** విద్యార్థుల మహాధర్నాకు సంఘీభావం ప్రకటిస్తున్నట్టు తెలంగాణ జనసమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరామ్ తెలిపారు. ఢిల్లీలో సీజేపీ నేతలను కలిసి మద్దతు తెలిపిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "విద్యార్థులు న్యాయపరమైన డిమాండ్లు లేవనెత్తారు. పరీక్షలు సక్రమంగా జరిపి భవిష్యత్తు కాపాడాలని కోరుతున్నారు. పేపర్ లీకలతో పాటు పరీక్షలు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయి. సీబీఎస్ఈ, నీట్ సహా దాదాపు 150 రకాల పరీక్షలు గందరగోళంగా మారాయి. భవిష్యత్తు ఏమవుతుందనే అయోమయ స్థితిలో విద్యార్థులు ఉన్నారు. పరీక్షలు సరిగా నిర్వహించకపోవడం వల్లే ఆందోళనలు జరుగుతున్నాయి. విద్యార్థుల ఆందోళనకు ప్రజాస్వామ్యవాదులంతా మద్దతు ఇవ్వాలి. శాంతియుతంగా, చట్టబద్ధంగా విద్యార్థుల ఆందోళన జరుగుతోంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి, లాఠీఛార్జ్‌కు బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. పేపర్ లీకేజ్‌కు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలి" అని కోదండరామ్ డిమాండ్ చేశారు.

# ఉత్సాహంగా స్మార్ట్ నేషన్ ఫెయిర్ 2026



**విశ్వంభర, ఉప్పల్:** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఉప్పల్ నియోజక వర్గం ఒమేగా ఎలైట్ జూనియర్ కాలేజీ హబ్సిగూడ లో స్మార్ట్ నేషన్ ఫెయిర్ 2026 ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థుల సృజనాత్మకత, ఆవిష్కరణ , జ్ఞానాన్ని ప్రదర్శించే ఒక ఉత్సాహభరితమైన ప్రదర్శన జరిగింది ఇందులో భాగంగా తెలివైన,బలమైన దేశాన్ని నిర్మించాలనే దార్శనికతను ప్రతిబింబించే అర్థశాస్త్రం, వాణిజ్యం, పౌరశాస్త్రం, సామాజిక అభివృద్ధి మరియు ఫైనాన్స్ రంగాలకు సంబంధించిన స్ఫూర్తిదాయకమైన ప్రాజెక్టులు, వినూత్న ఆలోచనలు మరియు ప్రదర్శనలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కారెక్రమానికి ముఖ్య అతిధులుగా మేఘ ఖఅం ఒమేగా ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యుషన్స్ఫర్మన్ నాగమోహన్ రెడ్డి వైస్ చైర్మన్ మాలతీ రెడ్డి ప్రదర్శనను ప్రారంభించారు .ఈ సందర్బంగా విద్యార్థుల ప్రతిభానుచూసి మెచ్చుకున్నారు.తదనంతరం విద్యార్థులకు సర్టిఫికేషన్ ప్రదానం చేశారు. ఈ కారిక్రమం లో జోనల్ ఇంచార్జి లింగం గౌడ్ ప్రిన్సిపాల్ సౌజన్య గౌడ్ మరియు స్టాఫ్ ,విద్యార్థులు పాల్గొన్నారు


# 28న ఢిల్లీలో తెలుగు వెలుగు సంబరాలు



**విశ్వంభర, ఢిల్లీ :** తెలుగు భాష, సాహిత్య వైభవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పే లక్ష్యంతో జూలై 28న న్యూఢిల్లీలోని ఆంధ్ర అసోసియేషన్ హాల్లో 'తెలుగు వెలుగు సంబరాలతో పాటు జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి. నారాయణరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని జాతీయ తెలుగు సారస్వత పరిషత్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేశిరాజు రాంప్రసాద్ ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, కింజరాపు రామ్మోహన్ నాయుడు, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, బండి సంజయ్ కుమార్, భూపతి రాజు శ్రీనివాస్ వర్మ ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. రాజ్యసభ సభ్యులు కే. లక్ష్మణ్, బి. మస్తాన్ రావు, ఆర్. కృష్ణయ్యతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్లమెంట్ సభ్యులు హాజరవుతారు. కార్యక్రమంలో 70 మంది కళాకారులతో సాంస్కృతిక ప్రదర్శనలు, డాక్టర్ సి. నారాయణరెడ్డి స్మారక కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు కవులు పాల్గొంటారు.ఈ సందర్భంగా పీతాని సత్యనారాయణ, ఉద్దరాజు కాశీ విశ్వనాథ రాజు, చైతన్య రాజు, సీజే వేణుగోపాల్, ఆకెళ్ల విభీషణ శర్మ, ఎన్. బాలాచారి, తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి తదితరులకు జాతీయ వాగ్దేవి జీవిత సాఫల్య పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. విధంగా గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, కంతేటి వెంకట్ రాజు, ముత్యాల శ్రీనివాస్‌తో పాటు పలువురికి జాతీయ వాగ్దేవి విశేష ప్రతిభ పురస్కారాలు అందజేయనున్నారు. ఢిల్లీకి చెందిన మరో 30 మంది ప్రముఖులను కూడా ఈ సందర్భంగా సత్కరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# నీట్ బాధితులకు నివాళిగా నిరసన

**విశ్వంభర, తిమ్మాపూర్ :** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోరండ్ల గ్రామంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నీట్ పేపర్ లీకేజీ ఘటనలో మృతి చెందిన విద్యార్థులకు నివాళిగా శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీకి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా అందించాలని, పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రతను నిర్ధారిస్తూ పరీక్షా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుంకరి సంపత్, పార్నంది అనిల్ కుమార్, కొండ్ర సురేష్, కిన్నెర ఆంజనేయులు, తొండెగ కొమ్మురయ్య, పార్నంది తిరుపతి, శ్రీనివాస్, రమేష్, కొండ్ర రాజమల్లు, అసోద రవికృష్ణ, అసోద రాజు, అసోద శ్రీనివాస్, అసోద అనిల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా విశ్వంభర

# విద్యార్థులు తలుచుకుంటే ఏ ప్రభుత్వమైనా దిగిరావాల్సిందే..!



డా.కాచం సత్యనారాయణ

**నీట్ పేపర్ లీక్ వివాదం, దేశవ్యాప్తంగా ఉవ్వెత్తున ఎగిసిన విద్యార్థి ఆందోళనల నడుమ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం తన పదవికి అనూహ్యంగా రాజీనామా చేయడం రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించింది. సీజేపీ విధించిన 72 గంటల డెడ్‌లైన్, యువత నుంచి పెరుగుతున్న తీవ్ర వ్యతిరేకత.. మోడీ ప్రభుత్వాన్ని దిగొచ్చేలా చేసింది.నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వివాదంతో ప్రారంభమైన ఆందోళనలు, చివరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, కేంద్రం విద్యార్థుల అన్ని డిమాండ్లకు అంగీకరించడంతో ముగిశాయి. పరీక్షల పారదర్శకత, బాధ్యులపై చర్యలు, విద్యార్థులకు న్యాయం చేయాలనే డిమాండ్లతో ప్రారంభమైన ఈ ఉద్యమం దాదాపు మూడు నెలల పాటు దేశ రాజకీయాలను కుదిపేసింది. పలు రాజకీయ పార్టీలు పరీక్షల పారదర్శకత, బాధ్యులపై చర్యలు, విద్యా సంస్కరణలు కోరుతూ ఆందోళనలు చేపట్టాయి. దీనితో కేంద్ర ప్రభుత్వం దిగొచ్చింది. దీని వెనుక అసలు కథేంటో తెలుసుకుందాం..**



నీట్ పేపర్ లీకేజీ, విద్యా వ్యవస్థలోని అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఢిల్లీలోని జంతర్ మంతర్ లో కాక్రోచ్ జనతా పార్టీ భారీ నిరసన కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే. సీజేపీ నిరసనకు మద్దతుగా ప్రముఖ విద్యావేత్త, పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్ చుక్ ఆమరణ నిరహార దీక్ష చేపట్టారు. మరోవైపు.. ప్రధాన్ రాజీనామా చేయాలని కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు జులై 20న కాక్రోచ్ పార్టీ పార్లమెంట్ మార్చ్ (చలో సంసద్) కార్యక్రమం చేపట్టింది. ఈ చలో పార్లమెంట్ కార్యక్రమం తీవ్ర హింసాత్మకంగా మారింది. సీజేపీ నిరసనకారులపై పోలీసులు దమనకాండ కొనసాగించారు. విద్యార్థులపై విచక్షణరహితంగా లాఠీచార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్, పెల్లెట్ గన్స్ ప్రయోగించారు. పోలీసుల దాడిలో పదుల సంఖ్యలో నిరసనకారులుతీవ్రంగా గాయపడ్డారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. నిరసనకారులపై దాడికి నిరసనగా కాంగ్రెస్ తో పాటు ప్రతిపక్ష పార్టీలు రంగంలోకి దిగాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నాలుగు రోజులుగా పార్లమెంట్‌ను స్తంభింపజేశాయి ప్రతిపక్షాలు. ఓ వైపు సీజేపీ.. మరోవైపు ప్రతిపక్షాల నుంచి ప్రభుత్వం తీవ్ర ఒత్తడి నెలకొంది. శుక్రవారం కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లతో జరిగిన రెండో విడత చర్చలు ఎలాంటి ఒప్పందం లేకుండానే ముగిశాయి. అయితే, విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సిందేనని సీజేపీ తేల్చి చెప్పింది. ధర్మేంద్ర ప్రధాన్ పదవి నుంచి తప్పుకునేందుకు 72 గంటల గడువు ఇస్తున్నామని..లేనిపక్షంలో జూలై20నాటి తరహాలో మరోసారి పార్లమెంట్ ముట్టడికి దిగుతామంటూ సీజేపీ హెచ్చరించింది. నడ్డా, జితేంద్ర సింగ్ తాము నాయకత్వాన్ని సంప్రదించి ప్రభుత్వ నిర్ణయాన్ని తర్వాత తెలియజేస్తామని మాత్రమే బదులిచ్చారు. విఫలమైన చర్చల అనంతరం.. నడ్డా, జితేంద్ర సింగ్‌లు పరిణామాలపై హోంమంత్రి అమిత్ షాకు వివరించినట్లు వర్గాలు తెలిపాయి. తెరవెనుక చర్చలు జరుగుతుండగానే, నిరసనకారులకు గట్టి సంకేతం పంపే ప్రయత్నంగా విద్యాశాఖ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కి చెందిన 47 మంది అధికారులను తొలగించింది. ఎన్టీఏ ప్రక్షాళన లోభాగంగా సిబ్బందినినియమించే ప్రక్రియను కూడా ప్రారంభించారు. విద్యాశాఖ కార్యదర్శిని బదిలీ చేయడం, పేపర్ లీక్ కేసులను విచారించడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయడం సహా పరీక్షా విధానంలో సంస్కరణలను కూడా కేంద్రం ప్రకటించింది. అయినప్పటికీ ఈ చర్యలేవీ నిరసనకారులను సంతృప్తి పరచలేకపోయాయి. శనివారం మధ్యాహ్నం కేంద్రం సీజేపీతో చర్చల ముందు.. నడ్డా, జితేంద్ర సింగ్‌లు మళ్లీ అమిత్ షాను కలిశారు. అదే సమయంలో ప్రధాన్ తన రాజీనామాను ప్రధాని మోదీకి పంపారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వార్త ప్రసారం కావడం ప్రారంభమైన తర్వాతే నడ్డా, జితేంద్ర సింగ్.. సీజేపీ ప్రతినిధులను మళ్లీ కలిశారు. మూడో విడత చర్చలు పూర్తిగా భిన్నమైన వాతావరణంలో జరిగాయి. ఒక వైపు, పార్లమెంట్‌లో ప్రతిపక్షాల నిరసనలు, మరోవైపుదేశవ్యాప్తంగా బలపడుతున్న యువత ఉద్యమం కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టాయి. ఈ కేవలం రాజకీయ ఆందోళన కాకుండా భవిష్యత్ తరానికి సంబంధించిన యువ ఉద్యమం కావడంతో ప్రభుత్వం ఉక్కుపాదం మోపేందుకు కేంద్రం వెనుకాడింది. శనివారం ఉదయం ప్రధాని నరేంద్ర మోదీకి ధర్మేంద్ర ప్రధాన్ తన రాజీనామాను సమర్పించారు. ప్రధాన్ నిష్క్రమణతో సీజేపీ పట్టువీడింది. తన ఆందోళనను విరమించింది. ఆందోళనకారులపై ఎలాంటి ఎఫ్ఐఆర్ లు నమోదు చేయబోమని.. నీట్ పేపర్ లీక్ ఉదంతం తర్వాత ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నిబంధనల ప్రకారం పరిహారం అందిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. నరేంద్ర మోదీ హయాంలో ప్రజా వ్యతిరేకతతో ఒక సీనియర్ మంత్రి పదవి కోల్పోవడం అత్యంత అరుదైన పరిణామంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకుంటుందని ఊహించని చాలామందిని ఇది ఆశ్చర్యపరిచింది. శుక్రవారం వరకు తమ సీనియర్ మంత్రుల్లో ఒకరిని వదులుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందనే సంకేతాలు ఏమాత్రం లేవు. అయినప్పటికీ కేవలం 24 గంటల్లోపే ప్రధాన్ రాజీనామా చేశారు. ఆందోళనకారులతో ప్రభుత్వం మళ్లీ చర్చలు ప్రారంభించింది. చర్చలు సఫలం కావడంతో సీజేపీ తన నిరసనను ముగిస్తున్నట్లు ప్రకటించింది. తక్కువ సమయంలోనే నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి.

# విమర్శ-స్థాయి-అర్హత?

**ఏ స్థాయి?**
**ఎలాంటి స్థాయి?**
**ఆర్థిక స్థాయా?**
**సామాజిక స్థాయా?**
**ఆ వ్యక్తి కూర్చున్న అధికార పీఠం స్థాయా?**
**మరొకటా?**
**ఇద్దరూ సమస్థాయి వాళ్లు మాత్రమే విమర్శలు చేసుకోవాలా?**
**అసలు ఆ సమస్థాయి అర్థం ఏమిటి? అలా వారు వారికి సమస్థాయి అని వారే భావించుకునే వారే విమర్శించుకోవాలా?**
**స్థాయి ఏమిటి?**
**అర్హత ఏమిటి?**
**అనే ప్రశ్నలు వేస్తే? వేసుకుంటే?**
**అలాంటివి స్థాయిలు ఏమీ విమర్శలకు అక్కర్లేదు. విమర్శకు మాట్లాడే విషయంపై సమగ్ర అవగాహన కావాలి. ఒకరు చెప్పిన, మాట్లాడిన విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకోగలగాలి. దానిని నిష్పాక్షికంగా చూడ గలగాలి.**


అలాచూడగలిగేతే ఆయా విషయాలపై చర్చించడానికి అర్హతలు ఉన్నట్లే. ఈ పరిణతి ఉన్నట్లైతే ఎవరినైనా, విమర్శించడానికి, చర్చించడానికి ఈ స్థాయి,అర్హతలు చాలును. ఈ అర్హతలు ఉన్నవారు విమర్శలు చేయవచ్చును. అసలైన స్థాయి,అర్హతలు ఇవి మాత్రమే. అంతే తప్ప ఆ వ్యక్తి ఉన్నతమైన హోదాలో ఉన్నారు. అధికార పదవిలో ఉన్నారు. ఉచితాసనంపై కూర్చున్నారు. అలాంటి వారిపై విమర్శలు చేయడానికి అదే స్థాయిలో ఉన్నవారు మాత్రమే అర్హులు అనే ఒక వాదన,అభిప్రాయం ఒకటి బలంగా ఇక్కడ పాతుకుపోయిఉన్నది. గ్రామ పంచాయితీ వార్డు సభ్యుడిగా కూడా ఎన్నిక కాలేని వాడివి ప్రధాన మంత్రి,ముఖ్యమంత్రుల స్థానాల్లో కూర్చున్న వారిపై విమర్శలు చేస్తావా అని మన రాజకీయ వ్యవస్థలో విమర్శించే వారి అర్హతలను ప్రశ్నించే వాగ్వాదం తరచూ జరుగుతున్న తీరును మనం చూస్తున్నాం. ఇది ఎంతమాత్రం సరైన వాదన కాదు. ఎవరు ఏ స్థానంలో ఉన్నారనేది అప్రధానమైనది. ఆ వ్యక్తి ఆ అంశంపై మాట్లాడిన విషయం ఏమిటి దానిని విమర్శిస్తున్న వ్యక్తికి ఆ అంశంపై ఉన్న అవగాహన ఏమిటనేది మాత్రమే ప్రమాణం. అంతకు మించి ఏ ఇతర ప్రమాణం అక్కర్లేదు. ఏ ఇతర సామాజిక, ఆర్థిక స్థాయి ఆ విమర్శల అర్హతలను నిర్ణయించలేవు. కూర్చున్న స్థానం,అనుభవిస్తున్న హోదా, స్థాయిలను బట్టి వ్యక్తుల గౌరవాలు పెరిగిపోవు. ఆ కుర్చీ మాత్రమే వారికి గౌరవాలనివ్వదు. కూర్చున్న స్థానం యొక్క విలువ,గౌరవం, మర్యాద, ఔన్నత్యం,స్వభావాలను రక్షిస్తూ ఆ కుర్చీ ధర్మాన్ని సంపూర్ణంగా నిర్వర్తిస్తూ వాటి గౌరవాలను మెరుగు పరిస్తే ఆ వ్యక్తి గౌరవం మెరుగు పడుతుంది. అలాంటి వ్యక్తులపై విమర్శలు చేయలేరు. పెద్ద గద్దెలో కూర్చున్నారు కాబట్టి ఆ వ్యక్తి తీరు వ్యవహారం శైలిని ప్రశ్నించకూడదు, చర్చించ కూడదు,విమర్శించ కూడదనే వాదన ఇక్కడ కొనసాగుతున్నది. అది అర్థం లేని వాదన. పెద్ద గద్దెల్లో గార్ధభం,శునకం లాంటి అర్హత లేని ప్రవర్తన స్వభావం కలిగిన వ్యక్తులు కూర్చున్నంత మాత్రాన వారు విమర్శకు అతీతులైపోరు. కూర్చున్న స్థానం మర్యాద గౌరవం, విశిష్టతలను కాపాడగలిగారు అనే సంగతులు మాత్రమే విమర్శలకు అవకాశం కలిగిస్తాయి. ఆ ప్రమాణాలు మాత్రమే ఉన్నతాసనంపై కూర్చున్న వ్యక్తి స్థాయిని నిర్ణయిస్తాయి. అవే ఆయా వ్యక్తుల అసలైన స్థాయిలు అవుతాయి. వ్యక్తుల స్వభావం,ప్రవర్తనలు మాత్రమే స్థాయినినిర్ధారిస్తాయి. అంతే తప్ప ఆ వ్యక్తి కూర్చున్నది ఉన్నతాసనం కాబట్టి అతడు/ఆమెను గౌరవించి తీరవలసిందే అనేది అర్థం లేని మూర్ఖ వాదన మాత్రమే అవుతుంది. విమర్శ అంటే వ్యతిరేక వైఖరి,ప్రతికూల ధోరణి అనే అభిప్రాయంఒకటి ఇప్పుడు ఇక్కడ బాగా ప్రబలిపోయి ఉన్నది. విమర్శ అంటే మంచిని ప్రశంసించడం,చెడును ప్రశ్నించడం,ఆ అంశంపై సమగ్రం గా చర్చించడం. ఆ అంశాన్ని అడ్డుపెట్టు కొని ఆ వ్యక్తి వ్యక్తిత్వ హననానికి పాల్పడడం ఎంత విమర్శ కాబోదు. కానీ భారత రాజకీయ వ్యవస్థ తీరు అలా లేదు. ఒక వ్యక్తిని,అతడి ఆలోచనలు,అభిప్రాయాలను, వ్యతిరేకించడం మాత్రమే విమర్శ అనే అభిప్రాయంగా చలామణిఅవుతున్నది. వ్యక్తులైనా,విషయమైనా, సిద్ధాంతమైనా దానిలోని మంచి-చెడులను సంపూర్ణంగా అర్థం చేసుకొని,సమగ్రంగా బేరీజు వేసుకొని,దానిని నిష్పాక్షిక దృష్టితో చూడగలగడమే పరిణతి. విమర్శకు ఈ అర్హత చాలును. ఇంతకు మించి ఎలాంటి అర్హతలు అక్కర్లేదు. అదే విమర్శకు సరైన అసలైన అర్థం. నిజానికి అసలైనస్థాయి అనేది మానసికమైనది మాత్రమే.



గోవర్ధన్ గందె,
9347056621.

# రక్తసిక్త అధ్యాయాలకు ముందే విఫలమవుతున్న దౌత్యం

యుద్ధం సంభవించి, తీవ్ర ప్రాణనష్టం, ఆస్తినష్టం జరిగిన ప్రతిసారీ ప్రపంచ సమాజం ఒక్కసారిగా ఉలిక్కిపడుతుంది. అయ్యో! ఈ ఘోరకలిని, రక్తాన్ని అడ్డుకునే అవకాశం మనకు ముందుగానే ఉండింది కదా అని విచారించడం, పశ్చాత్తాపపడడం మానవాళికి పరిపాటిగా మారింది. ప్రపంచ చరిత్ర పుటలను నిశితంగా తిరగేస్తే, దాదాపు ప్రతీ ప్రధాన యుద్ధానికి ముందు ప్రపంచ శక్తుల మధ్య విస్తృత స్థాయి శాంతి చర్చలు, సుదీర్ఘ దౌత్య ప్రయత్నాలు, అంతర్జాతీయ మధ్యవర్తిత్వాలు పెద్ద ఎత్తున జరిగినట్లే కనిపిస్తాయి. అయినప్పటికీ, ఆ ప్రయత్నాలేవీ ఆశించిన స్థాయిలో ఫలించకపోవడం, ఆఖరి నిమిషంలో దౌత్య వేదికలు మూతపడి ఆయుధాలు మృదంగం వాయించడం ఘోరమైన వాస్తవం. మరి సమస్త మానవాళికి వినాశనాన్ని మిగిల్చే యుద్ధాలను నివారించే సువర్ణ అవకాశాలు పదే పదే మన చేతుల మీదుగానే ఎందుకు చేజారిపోతున్నాయి? ఈ ప్రశ్నకు సరైన సమాధానం కేవలం ఒక్క కారణంలోనే దొరకదు. రాజకీయ నాయకుల ఆత్మరక్షణ, అహంకారం, భౌగోళిక ఆర్థిక ప్రయో జనాలు, జాతీయవాద భావోద్వేగాలు, అధినేతల వ్యక్తిగత మొండితనం, అంతర్జాతీయ వ్యవస్థల తీవ్ర నిస్సహాయత వంటి అనేక సంక్లిష్ట అంశాలు కలగలిసి ఈ దౌత్య వైఫల్యాలకు దారితీస్తున్నాయి. యుద్ధ నివారణకు ఉద్దేశించిన ప్రతి చర్చకు పరస్పర నమ్మకం అత్యంత కీలకమైన పునాదిగా పనిచేస్తుంది. కానీ శత్రుత్వం ముదిరి పాకాన పడిన రెండు దేశాల మధ్య ఆ కనీస నమ్మకం అప్పటికే పూర్తిగా కరిగిపోతుంది. ఒక పక్షం ముందుకు తెచ్చే నిజాయితీ తో కూడిన శాంతి ప్రతిపాదనను కూడా రెండో పక్షం కేవలం తమ బలహీనత సంకేతంగానో లేదా యుద్ధానికి ఆయుధాలు సమకూర్చుకోవడానికి వేసే కాలయాపన ఎత్తుగడగానో తీవ్రంగా అనుమానిస్తుంది. ఫలితంగా చిత్తశుద్ధితో ప్రారంభమయ్యే ఉన్నత స్థాయి చర్చలు కూడా అనుమానపు నీడలోనే మొదలై, ఒప్పందాలు పూర్తయ్యేలోపే పూర్తిగా విచ్ఛిన్నమవుతాయి. అనుభవజ్ఞులైన దౌత్యవేత్తలు ఎంత నైపుణ్యంగా నిబంధనలను రూపొందించినా, వెనుక ఉన్న అపనమ్మకపు గోడలు ఆ ఒప్పందాలను కేవలం కాగితాలకే పరిమితం చేస్తాయి తప్ప ఆచరణలోకి తీసుకురాలేవు. ఆధునిక కాలంలో యుద్ధం గురించిన నిర్ణయాలు కేవలం మూసివున్న గదుల్లో ఉండే నాయకుల చేతుల్లో మాత్రమే ఉండడం లేదు. ప్రధాన మీడియా సంస్థలు, డిజిటల్ సామాజిక మాధ్యమాలు క్షణాల వ్యవధిలో ప్రజాభిప్రాయాన్ని అత్యంత వేగంగా రగిలిస్తున్నాయి. ఏదైనా ఒక దేశంపై శత్రు దేశం దాడి చేసినప్పుడు లేదా సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరిగినప్పుడు, ప్రజల్లో పెల్లుబికే తీవ్రమైన ఆగ్రహజ్వాలలు పాలకులపై తక్షణమే యుద్ధం ప్రకటించాలనే తీవ్రమైన ఒత్తిడిని తెస్తాయి. ఈ విషమ పరిస్థితుల్లో శాంతి స్థాపన కోసం రాజీపడే ఏ నాయకుడైనా తమ స్వదేశంలోనే దేశద్రోహి లేదా బలహీనుడు అనే ముద్రపడే ప్రమాదాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. దీనితో తమ రాజకీయ ఉనికిని, అధికారాన్ని కాపాడుకోవడం కోసం అధినేతలు అనివార్యంగా తీవ్రమైన, కఠినమైన వైఖరిని తీసుకోవాల్సి వస్తుంది. దీనివల్ల శాంతి చర్చల ద్వారాలు శాశ్వతంగా మూసుకుపోతాయి. జాతీయవాదం ఒక దశలో దేశ సమైక్యతకు తోడ్పడినప్పటికీ, మరో దశలో అదే యుద్ధోన్మాదానికి ఇంధనంగా మారి ఘోర వినాశనానికి బాటలు వేస్తుంది. ప్రతి యుద్ధం వెనుక ప్రపంచ వేదికపై ఒక నీతి కథనం లేదా ఆత్మరక్షణ వాదన ప్రచారంలోకి వచ్చినా, దాని వెనుక లోతుగా పరిశీలిస్తే విస్తృతమైన ఆర్థిక, భౌగోళిక-రాజకీయ ప్రయోజనాలు దాగి ఉంటాయి. చమురు నిల్వలు, అంతర్జాతీయ వాణిజ్య మార్గాలు, అరుదైన సహజ వనరులు, కీలకమైన సైనిక వ్యూహాత్మక భూభాగాలపై ఆధిపత్యం సాధించడం కోసం అనేక శక్తివంతమైన దేశాలు యుద్ధాన్ని ఒక బలమైన సాధనంగా చూస్తాయి. దీనికి తోడు



అంతర్జాతీయ ఆయుధ పరిశ్రమలకు యుద్ధ పరిస్థితులు అత్యధిక లాభాలను తెచ్చిపెట్టే వ్యాపా రంగా మారడం మరొక చేదు నిజం. ఇటువంటి స్వార్థపూరిత ప్రయోజనాలు బలంగా ఉన్నప్పుడు, శాంతి చర్చలు కేవలం ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని మభ్యపెట్టడానికి నటించే ఒక నాటకంగా మిగిలిపోతాయి. అసలు నిర్ణయాధికారులు అంతర్గతంగా ముందే యుద్ధాన్ని ఖరారు చేసుకుని, దౌత్యాన్ని కేవలం కాలయాపనకు వాడుకుంటారు. ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ వేదికలు ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలను నివారించడానికి, శాంతిని కాపాడటానికి ఏర్పాటైనప్పటికీ, ఆచరణలో వాటి అధికారాలు తీవ్రంగా పరిమితమై ఉంటాయి. ఐరాస భద్రతా మండలిలోని వీటో అధికారం కలిగిన ఐదు శాశ్వత సభ్య దేశాలు తమ స్వంత ప్రయోజనాలకు లేదా తమ మిత్రదేశాలకు వ్యతిరేకంగా వచ్చే ఎలాంటి శాంతి తీర్మానాలనైనా వీటో అధికారంతో సులువుగా అడ్డుకుంటాయి. దీనివల్ల అంతర్జాతీయ సమాజం ఒక సంక్షోభంపై ఏకగ్రీవంగా స్పందించలేని తీవ్రమైన పక్షవాత స్థితి ఏర్పడుతుంది. మధ్యవర్తిత్వం వహించాల్సిన బహుళ పక్ష శక్తులే స్వయంగా ఏదో ఒక పక్షం వైపు మొగ్గు చూపడం వల్ల, తటస్థ, న్యాయబద్ధమైన పరిష్కారానికి అవకాశమే మిగలకుండా పోతుంది. ఫలితంగా శాంతి ప్రతిపాదనలు కేవలం తీర్మానాల కాగితాల రూపంలోనే మిగిలిపోతాయి తప్ప, సరిహద్దుల్లో శాంతిని నెలకొల్పలేకపోతున్నాయి. ప్రపంచ చరిత్రలో సంభవించిన ఎన్నో ఘోరమైన యుద్ధాలు కేవలం ఒకరిద్దరు నాయకుల తీవ్రమైన వ్యక్తిగత మొండి వైఖరి, అహంకారం వల్లనే సంభవించాయి. ప్రత్యర్థి దేశం తమ బెదిరింపులకు భయపడి వెనక్కి తగ్గుతుంది అనే తప్పుడు అంచనా, తమ స్వంత సైనిక సామర్థ్యంపై ఉన్న అతిగా ఉన్న అంధ విశ్వాసం, ఒకవేళ వెనక్కి తగ్గితే తమ వ్యక్తిగత, జాతీయ ప్రతిష్ఠకు తీవ్ర భంగం కలుగుతుందనే భయం ఇవన్నీ కలగలిసి నాయకులను చివరి క్షణం వరకు నిర్మాణాత్మక చర్చలకు దూరంగా ఉంచుతాయి. కొన్నిసార్లు యుద్ధం అనివార్యమని ఇరుపక్షాల అధినేతలూ బలంగా నమ్మే స్థాయి, ఆ నమ్మకమే చివరకు యుద్ధాన్ని ప్రత్యక్షంగా నిజం చేస్తుంది. చర్చల బల్ల వద్ద కూర్చున్నప్పటికీ, మేము బలహీనుడిగా కనిపించకూడదు అనే మానసిక ఒత్తిడి ఆచరణాత్మకమైన రాజీ మార్గాలకు తీవ్ర విఘాతం కలిగిస్తుంది. శాంతి ప్రయత్నాలు తరచూ సరైన సమయంలో జరగకపోవడం కూడా మరొక ప్రధాన లోపం. దౌత్యపరమైన ఉద్రిక్తతలు ప్రారంభమైన తొలి దశలో శాంతి స్థాపనకు అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయి. కానీ ఆ ప్రాథమిక దశలో సమస్య యొక్క తీవ్రతను, రాబోయే విపత్తును సరిగ్గా అంచనా వేయకపోవడం వల్ల అంతర్జాతీయ సమాజం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుంది. సైన్యాలు సరిహద్దులకు తరలివెళ్లడం పూర్తయ్యాక, సరిహద్దుల్లో మొదటి విడత ఘర్షణలు ప్రారంభమయ్యాక చర్చలకు కూర్చుంటే, అప్పటికే జరిగిన ప్రాణనష్టం, ఆస్తినష్టం ఏ రకమైన రాజీనైనా అసాధ్యం చేస్తాయి. ఇరుపక్షాలూ మేము ఇంత పెద్ద ఎత్తున నష్టపోయిన తర్వాత ఖాళీ చేతులతో వెనక్కి వెళ్లలేం అనే తీవ్రమైన పట్టుదలకు వస్తాయి. ఆలస్యంగా ప్రారంభమయ్యే దౌత్యం, వ్యాధి ముదిరిన తర్వాత ఇచ్చే ఆలస్యమైన వైద్యంలాగే ప్రాణాలను, దేశాలను కాపాడటంలో ఘోరంగా విఫలమవుతుంది. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు ఐరోపా ఖండంలో ఏర్పడిన సైనిక కూటముల వల ఏదో ఒక చిన్న స్థానిక సంఘటన కూడా రాబోయే రోజుల్లో మహా యుద్ధంగా మారగలదు అనే ప్రమాదాన్ని తీవ్రంగా పెంచింది. అలాగే రెండో ప్రపంచ యుద్ధానికి ముందు నాటి బలహీనమైన లీగ్ ఆఫ్ నేషన్స్ ఆక్రమణదారుల అక్రమ దురాక్రమణలను ఏమాత్రం అడ్డుకోలేకపోయింది. ఈనాటికీ ప్రపంచవ్యాప్తంగా విభిన్న ప్రాంతాల్లో జరుగుతున్న రక్తం ఏరులై పారే ఘర్షణల్లో అవే పాత తప్పులు పునరావృతమవుతూనే ఉన్నాయి రాజకీయ నాయకుల అతి విశ్వాసం, సమయానికి జరగని స్పందన, ఆర్థిక ప్రయోజనాల ఘర్షణ, అంతర్జాతీయ సంస్థల నిస్సహాయత. చరిత్ర పదే పదే తీవ్రమైన హెచ్చరికలు చేస్తున్నప్పటికీ, ప్రపంచం ఆ పాఠాలను విస్మరిస్తూనే ఉంది. సరిహద్దుల్లో యుద్ధాన్ని నివారించే అవకాశాలు విఫలమవడం అనేది ఒక్క క్షణంలో సంభవించే సాధారణ పొరపాటు కానే కాదు. అది తీవ్రమైన నమ్మకలేమి, రాజకీయ ఒత్తిళ్లు, స్వార్థపూరిత ఆర్థిక ప్రయోజనాలు, వ్యవస్థాగత బలహీనతల యొక్క ప్రమాదకర సమాహారము. నిజమైన శాంతిని కాపాడాలంటే కేవలం చర్చల బల్లలు, ప్రసంగాలు మాత్రమే సరిపోవు, నిజాయితీతో కూడిన రాజకీయ సంకల్పం, సకాలంలో స్పందించే అంతర్జాతీయ చొరవ, ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలకు నిజమైన స్వతంత్ర అధికారాలు అత్యంత అత్యవసరం. అలా లేని పక్షంలో, ప్రతి రక్తసిక్త యుద్ధం ముగిసిన తర్వాత మానవాళి ఈ ఘోరం ఆగి ఉంటే ఎంత బాగుండేదో అని చెప్పుకుంటూనే, మరోవైపు తర్వాతి యుద్ధానికి వినాశకరమైన తలుపులు తెరుస్తూనే ఉంటుంది. మానవాళి తన గత తప్పుల నుంచి సరైన గుణపాఠాలను నేర్చుకోకపోతే, శాంతి అనేది ఎప్పటికీ కేవలం యుద్ధానంతర శోకంలో, పశ్చాత్తాపంలో మాత్రమే మిగిలిపోతుంది.



డా .సూర్యదేవర రామకృష్ణ
9490754169

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజాస్వామ్య విజయం: కాంగ్రెస్ పార్టీ నాయకులు



విశ్వంభర, పరిగి: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయడం విద్యార్థుల పోరాటానికి దక్కిన విజయమని, ప్రజాస్వామ్య స్ఫూర్తి నిలిచిందని పరిగి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగుల నమ్మకాన్ని పూర్తిగా కోల్పోయిందన్నారు. వరుసగా పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలతో లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడే ప్రభుత్వాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. గత 25 రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచిందని తెలిపారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు మద్దతు తెలుపుతూ వారి పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారని, కాంగ్రెస్ పార్టీ ఎంపీలతో కలిసి ప్రధాని నరేంద్ర మోదీ నివాసం ముందు నిరసన చేపట్టి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చారని పేర్కొన్నారు. విద్యార్థుల ఐక్య పోరాటం, దేశవ్యాప్తంగా ప్రజల మద్దతు, కాంగ్రెస్ పార్టీ నిరంతర ఉద్యమం ఫలితంగా నే కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గి విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని తెలిపారు. ఒక వ్యక్తి రాజీనామా మాత్రమే కాదువిద్యార్థుల స్వరం గెలిచిందని, ప్రజాస్వామ్యం నిలిచింద నే దానికి నిదర్శనం అని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు, నిరుద్యోగుల హక్కులను కాలరాసే ప్రయత్నం జరిగితే కాంగ్రెస్ పార్టీ మరింత తీవ్రంగా పోరాడుతుందని హెచ్చరించారు. విద్యార్థులు, యువత, నిరుద్యోగుల హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్ రాములు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, పరిగి మండల పిఏసిఎస్ వైస్ చైర్మన్ బద్రి గారి రాజ పుల్లారెడ్డి, కౌన్సిలర్లు బాదం అఖిల శ్రీనివాస్ గుప్తా, జాఫర్ పల్లి సర్పంచ్ మహేష్, కాంగ్రెస్ నాయకులు రాధాకృష్ణారెడ్డి, నాగవర్ధన్, రవికాంత్ రెడ్డి, జగన్ గుప్తా, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## వనదుర్గమ్మ సన్నిధిలో జిల్లా విద్యాధికారి



విశ్వంభర, పెద్ద శంకరంపేట: మెదక్ జిల్లా విద్యాశాఖ అధికారి రాజు శనివారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గ భవాని మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొట్టమొదటిసారిగా అమ్మవారిని దర్శించుకున్నారు, ఈ సందర్భంగా ఆలయ పండితులు శంకర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు, డిఇఓ రాజుకు వేద పండితులు ఏడుపాయల ఆలయ ప్రశస్తిని వివరించారు. ఆయన వెంట అక్షయ పాత్ర మెదక్ ప్లాంట్ మేనేజర్ త్రిపాఠి ,పవన్ కుమార్, రాకేష్ కుమార్ ,భట్టు నాగరాజు, వికాస్ రాజు, బత్తిని రాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పోటీపడి విద్య అందించే దిశగా చర్యలు

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్



విశ్వంభర, పెద్ద శంకరంపేట: విద్య ప్రాధాన్యత అంశంగా ప్రభుత్వ లక్ష్యం మేరకు, విద్యార్థులకు ప్రపంచంతో పోటీపడే విద్య అందే దిశగా పటిష్ట చర్యలు తీసుకుంటామని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. జిల్లాలోని రామాయంపేట పట్టణంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను అధికారులతో కలిసి కలెక్టర్ శనివారం పరిశీలించారు. ముందుగా కలెక్టర్ మ్యాప్ ను పరిశీలిస్తూ కన్స్ట్రక్షన్ విధి విధానాలు క్షుణ్ణంగా అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రామాయణపేట పట్టణంలో 200 కోట్ల రూపాయల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులు జరుగుతున్నాయని వేలాది మంది విద్యార్థులు విద్య అభ్యసించే విధంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల రూపుదిదుకుంటుందన్నారు. నిర్మాణ పనులలో నాణ్యతలో రాజీ లేకుండా ప్రస్తుతం ఉన్న వర్కర్ల కంటే అధికంగా వర్కర్లను ఎంగేజ్ చేసుకుని అత్యంత నాణ్యత ప్రమాణాలతో భవన నిర్మాణ పనులు వేగంగా జరిగేలా పటిష్ట ప్రణాళిక ద్వారా చర్యలు చేపట్టాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాజు, విద్య ,సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, రామాయంపేట తాసిల్దార్ రజని, సీఎం ఓ రాజు, గణాంక అధికారి నవీన్ మెగా ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆంజనేయులు, ఏ ఈ సఫి తదితరులు పాల్గొ న్నారు.

## భక్తి శ్రద్ధలతో ఘనంగా తొలి ఏకాదశి



విశ్వంభర, ఇనుగుర్తి: శ్రీమహావిష్ణువు అత్యంత ప్రీతికరమైన తొలి ఏకాదశి హిందూ సాంప్రదాయంలో ఎంతో పవిత్రమైన ఏకాదశిలలో ఒకటి కావడంతో శనివారం నెల్లికుదురు ఇనుగుర్తి మండల కేంద్రాలతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. నెల్లికుదురు లోని శ్రీ గోదా రంగనాయక స్వామి ఆలయాన్ని భక్తులు సందర్శించుకోవడంతో రద్దీగా మారింది. నెల్లికుదురు శ్రీ గోదా రంగనాయక స్వామి, ఇనుగుర్తి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై మూలవిరాట్ కు అభిషేకాలు,అర్చనలు,పూజలు చేశారు. చాలామంది భక్తులు ఇతర పవిత్ర విష్ణు ఆలయాలకు రామాలయాలకు తరలి వెళ్లారు. తొలి ఏకాదశి రోజు భక్తులు విష్ణు సహస్రనామం శ్రీమద్భగవద్గీత విష్ణు అష్టోత్తర శతనామావళి, ఓం నమో నారాయణ మంత్రం వంటివి పారాయణం చేశారు. విష్ణు కథలను చదివి భజనలు చేశారు. ఉపవాస దీక్షలు పాటించారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం

: మండల కాంగ్రెస్ అధ్యక్షులు వెంకట్ రాములు



విశ్వంభర, పరిగి: ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఐఆర్ ఓటర్ల ప్రక్రియ వేగవంతంగా 100శాతం పూర్తిచేయాలని పరిగి మండల పరిధిలోని చిగురల్పల్లి, గోవిందపూర్, లక్నపూర్, మిట్టకోడూరు, గ్రామాల్లో పరిగి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్ రాములు, పరిగి మండల పిఏసిఎస్ వైస్ చైర్మన్ బద్రి గారి రాజపుల్లారెడ్డి పర్యటించి ఎస్ ఐ ఆర్ పై సమీక్షా చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సర్పంచులకు బిఎల్ఓ లకు బిఎల్ఏ లకు వార్డు సభ్యులతో మాట్లాడి ఎస్ ఐ ఆర్ ప్రక్రియను 100 శాతం వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపినట్లు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైందని, అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రూట్ సూపర్వైజర్ శ్రీనివాస్ రెడ్డి,గోవిందపూర్ సర్పంచ్ హరిచందర్, సలీమ్, సందీప్, బిఎల్ఏ శ్రీనివాస్, అనంతయ్య, నాగరాజు, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లికుదురులో హౌసింగ్ చీఫ్ విజిట్



విశ్వంభర, నెల్లికుదురు: మండల కేంద్రం నెల్లికుదురు లోని పూరి గుడిసెలు రేకుల ఇండ్లను హౌసింగ్ చీఫ్ ఇంజనీర్ చైతన్య కుమార్ స్థానిక ఎంపీడీవో సింగారపు కుమార్ తో కలిసి శనివారం సందర్శించారు. గతంలో జరిగిన ప్రజా పాలన పురస్కరించుకొని నెల్లికుదురులో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి పూరి పూరి గుడిసెలు,రేకుల ఇండ్లను హౌసింగ్ ఇంజనీర్ ఇంటింటికి తిరిగి ఇండ్ల పరిస్థితిపై ఆయా కుటుంబాలతో మాట్లాడి, వివరాలు సేకరించి, పూర్తిస్థాయిలో ఆరా తీశారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంబంధ గుడిసెలు రేకుల ఇండ్లను గతంలో స్థానిక పంచాయతీ కార్యదర్శి, గ్రామైక్య సంఘాల వి ఓ లు, గెజిటెడ్ అధికారులు సందర్శించి పరిశీలించి నివేదికను అందజేయడంతో వీటిపై హౌసింగ్ చీఫ్ ఇంజనీరు విజిట్ చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ టివి అబ్దుల్ హకీం,ఎ ఈ అనిల్ పంచాయతీ కార్యదర్శి దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

# పరిగి శ్రీ సరస్వతి శిశు మందిర్ అభివృద్ధికి రూ. 5 లక్షలు

ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి




విశ్వంభర, పరిగి : శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించే ఉద్దేశంతో, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి తమ ఎంపీ నిధుల నుండి రూ. ఐదు లక్షల నిధులను అదనపు తరగతి గదుల నిర్మాణ నిమిత్తం మంజూరు చేశారు. విద్యారంగ అభివృద్ధికి, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ఎంపీ ప్రాధాన్యత అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాలకవర్గ సభ్యులు స్థానిక నాయకులు తెలిపారు. అదనపు గదుల నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు మరింత మెరుగైన విద్యా అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంత సంఘటన శ్రీనివాస్, పాఠశాల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి వెంకట్ రాములు, పాఠశాల ప్రధానాచార్య మల్లేష్ , బిజెపి రాష్ట్ర నాయకులు మిట్ట పరమేశ్వర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుల బాలకృష్ణారెడ్డి, జిల్లా నాయకులు పెంటయ్య గుప్తా, మల్లేష్, బందెయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అధ్యాపకుల సంఘం యాదాద్రి జిల్లా కార్యదర్శిగా డి.కిషన్



విశ్వంభర, రామన్నపేట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శిగా యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ డి.కిషన్ శనివారం రోజు జరిగిన జిల్లా కమిటీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరు గతంలో కూడా జిల్లా అధ్యక్షుడిగా, జిల్లా కార్యదర్శిగా పనిచేసి మూడవ పర్యాయం మళ్లీ జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం అభినందిస్తూ, నిరంతరం సభ్యుల సమస్యల పరిష్కారం చేయడంలో ముందుండాలని, ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి కోసం పాటుపడాలని కోరారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది కిషన్ ను అభినందించారు.

## ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడిగా నైషధం



విశ్వంభర, హైదరాబాదు : ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడిగా, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నైషధం సత్యనారాయణ మూర్తి నియమితులయ్యారు. శనివారం హైదరాబాదు లో జరిగిన ఫెడరేషన్ సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు రవికుమార్, తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ద్రోణంరాజు రవికుమార్ మాట్లాడుతూ, బ్రాహ్మణుల ఆర్థిక, సామాజిక, రాజకీయ భవిష్యత్తుకు భరోసా కల్పించేలా ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలోని బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధి కోసం బ్రాహ్మణ పరిషత్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. నూతన జాతీయ ఉపాధ్యక్షుడు నైషధం సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, బ్రాహ్మణుల అభ్యున్నతి, వారి సమస్యల పరిష్కారం కోసం ఫెడరేషన్ తరఫున నిరంతరం పోరాడుతామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు బ్రాహ్మణులకు తగిన రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని, ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో బ్రాహ్మణ సంక్షేమం కోసం నాలుగు ఎకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ కోశాధికారి నారాయణ శర్మ, కార్యదర్శులు వారణాసి వంశీ, ఒక్కలంక శ్రీనివాసరావు, అకెళ్ల సుబ్బలక్ష్మి, జయతులసి తదితరులు పాల్గొన్నారు.

# శివగంగ ఆలయం సమీపంలోని డంపింగ్ యార్డ్ తొలగించాలి



విశ్వంభర, మహేశ్వరం: మహేశ్వరం మండల కేంద్రంలోని మొదటి వార్డులో శివగంగ ఆలయం, స్థానిక కాలనీల మధ్య డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడంపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గద్దగూటి మహేందర్ ముదిరాజ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని, భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని డంపింగ్ యార్డ్‌ను వెంటనే అక్కడి నుంచి తొలగించాలని గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శివగంగ ఆలయం చుట్టుపక్కల ప్రజల నివాసాలు ఉండగా, మధ్యలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గ్రామపంచాయతీ సిబ్బందే అక్కడ చెత్తను డంప్ చేయడం వల్ల దుర్వాసన, దోమలు, ఈగల సమస్య రోజురోజుకూ పెరుగుతోందని తెలిపారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయే సమయంలో బయటకు రావాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. శివగంగ ఆలయానికి వచ్చే భక్తులు కూడా భరించలేని దుర్వాసన కారణంగా అసౌకర్యానికి గురవుతు న్నారని, అయినప్పటికీ సంబంధిత అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గం స్పందించ కపోవడం బాధాకరమన్నారు. ఆలయం ఒకవైపు, ప్రజల నివాసాలు మరోవైపు ఉండగా మధ్యలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం ఏ విధంగా సమంజసమో అర్థం కావడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో చెత్త పేరుకు పోయి దుర్వాసన మరింత పెరిగే ప్రమాదం ఉందని, దీంతో అంటువ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని మహేందర్ ముదిరాజ్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారిన ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని, డంపింగ్ యార్డ్‌ను అక్కడి నుంచి తరలించి పరిసరాలను పూర్తిగా పరిశుభ్రంగా ఉంచాలని డిమాండ్ చేశారు. ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాల్సిన గ్రామపంచాయతీ సిబ్బందే నివాస ప్రాంతంలో చెత్త వేయడం సరైన చర్య కాదని ఆయన విమర్శించారు. ప్రజల ఆరోగ్యానికి ఏదైనా హాని జరిగితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించిన ఆయన, గ్రామపంచాయతీ పాలకవర్గం తక్షణమే జోక్యం చేసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

## వైకుంఠ ఏకాదశి వేడుకల్లో భక్తుల సందడి

విశ్వంభర, యాదగిరిగుట్ట: వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే వేలాదిమంది భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి స్వామివారి దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందారు. పురాణాల ప్రకారం వైకుంఠ ఏకాదశి అత్యంత పవిత్రమైన రోజుగా భావిస్తారు. ఈ రోజున శ్రీమహావిష్ణువును భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే సకల శుభాలు కలుగుతాయని, వైకుంఠ ద్వార దర్శనం లభిస్తుందని భక్తుల విశ్వాసం. ఈ సందర్భంగా దేవాలయాల్లో ప్రత్యేక అలంకరణలు, అర్చనలు, అభిషేకాలు, తీర్థప్రసాదాల పంపిణీ నిర్వహించారు. యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామివారిని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రచార కార్యదర్శి జె. దశరథ్ వేకువజామున దర్శించుకుని ప్రత్యేక అభిషేక పూజల్లో పాల్గొన్నారు.

# పెండ్యాల గ్రామంలో పర్యటించిన కేఎల్ఆర్



విశ్వంభర, మహేశ్వరం : మహేశ్వరం మండలం పెండ్యాల, వివిధ గ్రామాలలో ఆగస్టు 3న సర్ ఓటర్ల సమగ్ర ప్రత్యేక సవరణ ముగుస్తున్నందున్న ప్రతీ గ్రామాన్ని జల్లెడప తున్నారు. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి,సార్ లో 100శాతం ఓటర్ల జాబిత అప్ డేట్ కావాలని బి ఎల్ఎలకు, పార్టీ నూతన అధ్యక్షులకు, సర్పంచ్ లకు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు కె.ఎల్. ఆర్ పలు సూచనలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన దొంగఓట్లను ఏరిపారేయాలని పిలుపునిచ్చారు, పట్టణం లేదా సొంతూరులో ఏదోఒక చోట మాత్రమే ఓటు ఉండాలని మరోసారి సూచించారు, చనిపోయిన వారి వివరాలను సైతం నమోదు చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ఓట్లు తొలగించేందుకు బీజేపీ కుట్రలు చేస్తున్నారని తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం, ప్రజాపాలన, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో సజావుగా కొనసాగుతుందని కిచ్చెన్న తెలియజేశారు. ఓట్లను అస్త్రంగా చేసుకుని హస్తం పార్టీ నేతలు, కార్యకర్తల ఓట్లను తొలగించేందుకు బీజేపీ నేతలు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. మరో పదేళ్ల పాటు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండాలంటే ఇప్పుడు జరుగుతున్న ఓటర్ల సమగ్ర ప్రత్యేక సవరణలో పాల్గొని బి ఎల్ ఓ లకు సహకరించాలని లక్ష్మారెడ్డి తెలియజేశారు.

## యువకులకు సమ్మి గౌడ్ ఫౌండేషన్ చేయూత



విశ్వంభర, కేసముద్రం : తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉప్పరపల్లి గ్రామంలోని శ్రీ బీరప్ప స్వామి దేవస్థానంలో బీరప్ప కురుమ సంఘం ఆధ్వర్యంలో బోనాల వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పరపల్లి బీరప్ప కురుమ సంఘం అధ్యక్షులు, కమిటీ సభ్యులు సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మయ్య గౌడ్ కలిసి సంఘ సభ్యులకు 70 టీ-షర్ట్స్ అందించాలని కోరగా, వెంటనే సానుకూలంగా స్పందించి 70 టీ-షర్ట్స్ అందజేశారు. ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ, గ్రామాల్లో జరిగే ఆధ్యాత్మిక, సాంప్రదాయ కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, సమాజ సేవే తన లక్ష్యమని అన్నారు. బీరప్ప కురుమ సంఘం అధ్యక్షులు, సభ్యులు మాట్లాడుతూ తమ విజ్ఞప్తిని ఆలకించి టీ-షర్ట్స్ అందించిన సమ్మయ్య గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రజా సేవ, సామాజిక కార్యక్రమాల్లో ఆయన అందిస్తున్న సహకారం ఆదర్శనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సమ్మి గౌడ్ ఫౌండేషన్ టీం సభ్యులు మరియు గ్రామ పలుస పద్మ వెంకన్న (8వ వార్డు), తండా సంపత్ (9వ వార్డు), పలుస రాకేష్, ఎసల్ల సత్యనారాయణ, కొమ్మనబోయిన రంజిత్, సీలోజు విజేందర్ అలాగే బీరప్ప కురుమ సంఘం సభ్యులు యారా ముత్తయ్య, కంచ కట్టయ్య, కంకల శ్రీనివాస్, కంకల బీరయ్య, కంకల సుమన్, కంచ కుమారస్వామి, కంకల ఐలయ్య, కుండే రతన్, కుండే మహేందర్, అల్లి అశోక్, కంచ ఐలయ్య, కంకల కుమారస్వామి, కంకల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయురాలిగా మారిన కలెక్టర్ ప్రతిమా సింగ్

విద్యార్థులకు పాఠాలు బోధించి సామర్థ్యాలు పరిశీలన.. కేజీబీవీ సౌకర్యాలపై ఆరా



విశ్వంభర, పెద్దశంకరంపేట: విద్యార్థి దశలోనే క్రమశిక్షణను అలవర్చుకుంటే భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. శనివారం చేగుంట మండల పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను సందర్శించిన కలెక్టర్, విద్యార్థులతో మమేకమై ఉపాధ్యాయురాలిగా మారి స్వయంగా పాఠాలు బోధించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి వారి ప్రతిభపై సంతృప్తి వ్యక్తం చేశారు. ముందుగా 6, 7వ తరగతి విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులు ఎనిమిది వరకు గుణకార పట్టికలు చెప్పడంతో అభినందించారు. అనంతరం పదో తరగతిలో నిర్వహిస్తున్న అన్ అకాడమీ తరగతులను పరిశీలించి, ఫాస్ట్ మ్యాథ్స్, గెట్ ఇట్ రైట్ పుస్తకాల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. పోటీ పరీక్షల్లో గణితం కీలకమని, ఫాస్ట్ మ్యాథ్స్ ద్వారా లెక్కలను సులభంగా సాధన చేయవచ్చని సూచించారు. యూట్యూబ్ వీడియోల కంటే అన్ అకాడమీ తరగతులు విద్యార్థులకు మరింత ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. పాఠశాలలోని కొన్ని కంప్యూటర్లు మరమ్మతులకు గురైనట్లు గుర్తించిన కలెక్టర్, వాటిని వెంటనే బాగు చేసి ప్రతి విద్యార్థికి డిజిటల్ బోధన అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కిచెన్‌ను సందర్శించి వంట సామగ్రి, సిద్ధం చేసిన భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన డైట్ చార్ట్ ప్రకారమే భోజనం తయారు చేస్తున్నారా, ఎంత మంది విద్యార్థులు వసతి గృహంలో ఉంటున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీ ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా ఉండాలని, ఎలాంటి చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అన్ని కేజీబీవీల్లో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా చదివితే తెలియని అంశాలపై కూడా పట్టు సాధించవచ్చని, ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా విద్యార్థులకు అన్ని అంశాలను బోధించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, బీడబ్ల్యూఓ హేమాభార్గవి, ఎంపీడీవో చెన్నారెడ్డి, గణాంక అధికారి నవీన్, కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పేదల ఇండ్లు కూల్చివేస్తే చూస్తూ ఊరుకోం

నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి



విశ్వంభర, పెద్ద శంకరంపేట: పేద ప్రజలకు అండగా టిఆర్ఎస్ పార్టీ నిలుస్తుందని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఎమ్మెల్యే అక్రమంగా పేదల ఇండ్లను కూల్చివేస్తే చూస్తూ ఊరుకోమని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి అన్నారు. మనూరు మండలంలోని బిల్లాపూర్ గ్రామంలో గత ప్రభుత్వం చట్టబద్ధంగా పట్టాలిచ్చిన ఇండ్లను కూల్చి వేస్తున్న విషయమై శనివారం మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బెల్లాపూర్ లో రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగామాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో పేదలు నివసించడానికి వారికి అర్హులని భావించి నిరుపేదలకు ఇంటి స్థలాలను కేటాయించి వాటికి సర్టిఫికెట్లు కేటాయించామని ఇప్పుడు ఈ దౌర్భాగ్యమైన ఈ ప్రభుత్వం. అన్యాయంగా వారి ఇండ్లపై బుల్డోజర్ తీసుకుపోయి వాటిని కులగొట్టి నిరుపేదలకు ఉండడానికి నీడ లేకుండా చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఇద్దరు పేద ప్రజల ఉసురు పోసుకుంటున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం దేవుడు ఎరుగు కానీ నిరుపేదలు నివసిస్తున్న గృహాలను నేలమట్టం చేయడం దురదృష్టకరమని తెలిపారు. ఈ చర్యలు మానుకోకపోతే ఈ ప్రభుత్వం పైన పేద ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని ఈ ముఖ్యమంత్రిని ఈ ఎమ్మెల్యేను గద్దెతించేవరకు ఊరుకోమని తెలిపారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం మేలుకొని కేటాయించిన వారికి ఇందిరమ్మ పథకం ద్వారా ఇండ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం బాధితుల తరపున మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి సబ్ కలెక్టర్ ఉమా హారతి కి వినతి పత్రాన్ని అందజేసి నిరుపేద ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధితులు వారికి మద్దతుగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యే లక్ష్యం

సూర్యాపేట జెడ్పీహెచ్ఎస్‌లో డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

పాఠశాల అభివృద్ధికి రూ.10 లక్షలు.. త్వరలోనే విద్యార్థులకు ఉచిత అల్పాహార పథకం




విశ్వంభర, సూర్యాపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఉన్నత స్థానాలకు చేరేలా కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శనివారం సూర్యాపేటలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక యుగానికి అనుగుణంగా విద్యార్థులకు డిజిటల్ విద్యను చేరువ చేయడం అత్యవసరమని అన్నారు. తాను ఏడో తరగతిలో ఉన్నప్పుడు తొలిసారి కంప్యూటర్ చూసానని, ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చిన్న వయసులోనే డిజిటల్ టెక్నాలజీతో పరిచయం అవుతున్నారని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, టీ-ఫైబర్, ఏఆర్/వీఆర్ ల్యాబ్‌ల ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గ్లోబల్ స్థాయి కోడింగ్ విద్య అందిస్తున్నామని, 6 నుంచి 9వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక డిజిటల్ లెర్నింగ్ పుస్తకాలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. సూర్యాపేట జెడ్పీహెచ్ఎస్‌లో గతేడాది పదో తరగతి ఫలితాలు మెరుగ్గా రావడంతో పాటు మౌలిక వసతులు అభివృద్ధి చెందడంతో ఈ విద్యా సంవత్సరంలో 121 మంది కొత్త విద్యార్థులు చేరారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఈ ఒక్క ఏడాదిలోనే 10,113 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా చేరడం ఆనందదాయకమన్నారు. పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములైన ప్రతి ఒక్కరినీ అభినందిస్తూ, మౌలిక వసతుల కల్పన కోసం వెంటనే రూ.10 లక్షల నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. స్వచ్ఛంద సంస్థలు, ఉపాధ్యాయులు, ప్రజల సహకారంతో ఈ పాఠశాలను జిల్లాలోనే ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇప్పటికే నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని, త్వరలోనే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి ఉదయం ఉచిత అల్పాహార పథకాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఆరోగ్యవంతమైన శరీరంతోనే విద్యార్థులు విద్యలో రాణించగలరని, పరిశుభ్రత పాటిస్తూ ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ, పేదరికాన్ని జయించి సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించాలంటే చదువే ఏకైక మార్గమని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేయడానికి జిల్లా కలెక్టర్ చేస్తున్న కృషి అభినందనీయమని ఆయన కొనియాడారు. చారిత్రక నేపథ్యం కలిగిన ఈ పాఠశాలను దత్తత తీసుకొని మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దుతానని ఇచ్చిన హామీ మేరకు పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. పాఠశాల విద్యార్థుల కోసం హెచ్‌డీఎఫ్‌సీ సహకారంతో డ్యూయల్ డెస్క్ బెంచీలు ఏర్పాటు చేయడంతో పాటు, వారం రోజుల్లో సొంత నిధులతో డిజిటల్ బోర్డులను అందుబాటులోకి తీసుకువస్తామని రమేష్ రెడ్డి హామీ ఇచ్చారు. అదేవిధంగా సైన్స్ ల్యాబ్, డైనింగ్ హాల్, పాఠశాల బెల్ తదితర సౌకర్యాలను కూడా త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు, స్కూల్ బ్యాగులు, యూనిఫాంలు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, ఏఎంసీ వైస్ చైర్మన్ జి. శ్రీనివాస్ రావు, మున్సిపల్ కౌన్సిలర్ వెంకన్న, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, మండల విద్యాశాఖ అధికారి శేషగాని శ్రీనివాస్ గౌడ్, ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టు శక్తులు ఐక్యం కావాలి: ఆర్. నారాయణమూర్తి




విశ్వంభర, బాగ్‌లింగంపల్లి : కష్టజీవుల అభ్యున్నతి కోసం జీవితాంతం పోరాడిన ప్రజా గాయకుడు అరుణోదయ నాగన్న స్ఫూర్తితో దేశంలోని కమ్యూనిస్టు శక్తులన్నీ ఐక్యంగా నిలబడి ప్రజా సమస్యలపై ఉద్యమాలను బలోపేతం చేయాలని, నాగన్న ఆశయాలను కార్యరూపంలో పెట్టడమే ఆయనకు నిజమైన నివాళి అని సినీ నటుడు ఆర్. నారాయణమూర్తి అన్నారు. శనివారం హైదరాబాదు బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పి. వేణు అధ్యక్షతన నిర్వహించిన నాగన్న సంతాప సభలో ఆయన మాట్లాడారు. ప్రముఖ సంపాదకుడు, కవి సతీష్ చందర్ మాట్లాడుతూ, "నాగన్న పాటలు ప్రజా ఉద్యమానికి దిక్సూచిగా నిలిచాయి. పీడిత ప్రజల కష్టాలను తన గానంతో ప్రతిబింబించిన నాగన్న గాయకుడిగానే కాక కమ్యూనిస్టుగా, ప్రజా సాంస్కృతిక ఉద్యమానికి జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి. ఆయన లేని లోటు ప్రజా ఉద్యమాలకు తీరనిది" అని అన్నారు. ఈ సందర్భంగా నాగన్నపై రచించిన పాటల సంకలనం, ఆయన జీవితం--ప్రస్థానాన్ని ప్రతిబింబించే గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఏఐకేఎంఎస్ అఖిల భారత అధ్యక్షుడు వేములపల్లి వెంకటరామయ్య, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చలపతిరావు, సాదినేని వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్ వినయ్ బాబు, లెల్లె సురేష్, పసునూరి రవీందర్, జిలకర శ్రీనివాస్, యోజన, యశ్‌పాల్, భూపతి వెంకటేశ్వర్లు, ఆవునూరి మధు, జి. ఝాన్సీ, నాగరాజు, పరకాల అజయ్, కె. గోవర్ధన్, విమలక్క, పల్లె నరసింహ, కోటి, పరకాల లక్ష్మి, తమ్మారెడ్డి భరద్వాజ, ప్రజాకవి జయరాజు, టి. వెంకన్న తదితరులు నాగన్న సేవలను స్మరించారు. కార్యక్రమానికి ముందు కళాకారులతో కలిసి సుందరయ్య పార్కు చుట్టూ ఆటపాటలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాగన్నపై రూపొందించిన డిజిటల్ కళారూపం, ఆయన జీవితాన్ని ప్రతిబింబించే ఒగ్గుకథ, న్యూడెమోక్రసీ ఛానల్ రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బతుకుల రాజన్న, మంచిర్యాల మల్లన్న, ఇడంపాక శ్రీశైలం, కోల స్వప్న, బొగ్గారపు వెంకన్న, సహాయ కార్యదర్శులు ఎనగంటి చిరంజీవి, కచనపల్లి సైదులు, కోశాధికారి ఇట్టబోయిన రవి, కార్యవర్గ సభ్యులు సమ్మన్న కిషన్, కొండల్, గుర్రం అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# కాక్రోచ్ జనతా పార్టీకి తొలి విజయం : దిడ్డి సుధాకర్



విశ్వంభర, బషీర్ బాగ్: ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కాక్రోచ్ జనతా పార్టీ సాధించిన తొలి విజయమే తప్ప, ఉద్యమం ముగిసిందని భావించరాదనీ ఆమ్ ఆద్మీ పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. దేశంలో విద్య, ఉపాధి, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ప్రారంభమైన విస్తృత ప్రజా ఉద్యమానికి నాంది మాత్రమనీ అన్నారు. కాక్రోచ్ జనతా పార్టీ కేవలం నీట్ పరీక్షలలో జరిగిన అవకతవకలు లేదా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోసం మాత్రమే ఏర్పడలేదనీ, దేశ అత్యున్నత న్యాయస్థానం చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో, కోట్లాది మంది విద్యార్థులు, నిరుద్యోగ యువత మనోభావాలు దెబ్బతినడంతో, అభిషేక్, దీపిక ఇచ్చిన చిన్న పిలుపుకు దేశవ్యాప్తంగా అపూర్వ స్పందన లభించిందన్నారు. ఆ స్పందనే ఉద్యమంగా రూపుదిద్దుకుని, కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భావానికి కారణమైం దన్నారు. దేశంలో విద్య, శాస్త్రీయ దృక్పథం, రాజ్యాంగ విలువలకు ప్రాధాన్యం తగ్గి, విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలు పెరుగుతున్నాయనే ఆందోళనతో వేలాది మంది యువకులు ఈ ఉద్యమంలో భాగస్వాములయ్యారనీ పేర్కొన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్, నీట్ పరీక్షలపై పోరాటం ఈ ఉద్యమానికి ఒక ప్రారంభ పరీక్ష మాత్రమే అన్నారు. ఉద్యమంలో పాల్గొన్న వేలాది మంది విద్యార్థులు లాఠీచార్జీలను, నిర్బంధాలను ఎదుర్కొన్నప్పటికీ వెనక్కి తగ్గలేదనీ, దేశవ్యాప్తంగా, విదేశాల్లో ఉన్న భారతీయుల నుంచి కూడా విశేష మద్దతు లభించిందనీ, ప్రధాన మీడియా తగిన ప్రాధాన్యం ఇవ్వకపోయినా, సోషల్ మీడియా ద్వారా ఈ ఉద్యమం ప్రజల్లోకి విస్తృతంగా చేరింది. సామాజిక కార్యకర్త సోనం వాంగ్చుక్ మద్దతు ఉద్యమానికి మరింత బలాన్ని చేకూర్చిందన్నారు. ఈ సందర్భంగా ఉద్యమానికి నాయకత్వం వహించిన కాక్రోచ్ జనతా పార్టీ నాయకులకు, ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు తెలిపిన విద్యార్థులకు, యువతకు, మేధావులకు, ప్రజాస్వామ్య వాదులకు, సోషల్ మీడియా కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.

## శ్రీ సంతోషి మాత ఆలయంలో ఘనంగా తొలి ఏకాదశి పూజలు



విశ్వంభర, సూర్యాపేట: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషిమాత ఆలయంలో శనివారం తొలి ఏకాదశి పర్వదినంతోపాటు, శ్రీ వారాహి నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు బట్టారం వంశీకృష్ణశర్మ శ్రీ సత్య సాంబశివ స్వామి వారికి ప్రత్యేక అభిషేకములు నిర్వహించారు. శ్రీ వారాహి మాత అమ్మవారికి సామూహికంగా మహిళల తో ఒడిబియ్యం పోయించారు. శ్రీ వారాహి మాత అమ్మవారి బీజాక్షరాలతో హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. తొలి ఏకాదశి, వారాహి నవరాత్రులు ముగింపు పురస్కరించుకొని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీ సత్య సాంబశివ స్వామి వారికి అభిషేకం తో పాటు, శ్రీవారాహి మాత అమ్మవారికి చీరలు రవిక ముడుపులు, గాజులు, సమర్పించి చల్లంగా చూడాలంటూ వేడుకున్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సంతోషిమాత దేవాలయ గౌరవాధ్యక్షులు నూకా వెంకటేష్ గుప్తా, అధ్యక్షులు బ్రాహ్మణపల్లి మురళీధర్ ప్రధాన కార్యదర్శి పబ్బ ప్రకాశరావు కోశాధికారి కొత్త మల్లికార్జున్ ఆలయ కమిటీ బెలిదే అశోక్, సోమ శ్రీశైలం, దేవరశెట్టి సోమయ్య, యమ వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి రామయ్య, తల్లాడ వెంకటేశ్వర్లు, నూక రవి శంకర్ ,బ్రాహ్మణపల్లి శివప్రసాద్, వందనపు వెంకటేశ్వర్లు, త్రిశక్తి వనిత గ్రూప్ పసుపర్తి జ్యోతి, కృష్ణమూర్తి, ముత్యాలమ్మ, నాగమణి, పద్మ, లీల, సంధ్య, నీరజ, భవాని రాణి, శివపార్వతి, కనక రత్నం, దేవాలయం మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థి ఉద్యమ విజయమే

హుస్నాబాద్ బిఆర్ఎస్ నేతలు



విశ్వంభర, హుస్నాబాద్: నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం దేశవ్యాప్తంగా విద్యార్థులు సాగించిన ఉద్యమ విజయమని హుస్నాబాద్ బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దాదాపు 20 రోజుల పాటు విద్యార్థులు ఎలాంటి రాజకీయ పార్టీ జెండా, ఏ నాయకుడి అండ లేకుండానే పోరాటం సాగించారని తెలిపారు. విద్యార్థుల ఐక్యత, పట్టుదల ముందు కేంద్ర ప్రభుత్వం తలొగ్గాల్సి వచ్చిందన్నారు. నీట్ పేపర్ లీక్ కారణంగా సుమారు 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, పలువురు తీవ్ర మానసిక వేదనకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల జీవితాలతో ఏ ప్రభుత్వం కూడా చెలగాటం ఆడకూడదని, పరీక్షల పేపర్ల లీకేజీలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఢిల్లీలో ఆందోళన చేసిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ ప్రకటనలో బీఆర్ఎస్ నాయకులు సూద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జున్ రెడ్డి, ఇంద్రాల సారయ్య, యాస శ్రీనివాస్, మేకల వికాస్ యాదవ్, గుగులోతు తిరుపతి నాయక్ పాల్గొన్నారు.

# నీట్ వ్యవహారంపై కేంద్రంపై ఏఐవైఎఫ్ నిరసన




విశ్వంభర, హిమాయత్‌నగర్ : నీట్ పేపర్ లీకేజీలు, విద్యార్థుల మరణాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాదు హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్ నుంచి వై జంక్షన్ కూడలి వరకు ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ శవయాత్ర ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన దహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీలు, విద్యార్థుల మరణాలు, నిరుద్యోగ సమస్యలు వంటి కీలక అంశాలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ రాజకీయ ప్రచార వీడియోలకే ప్రాధాన్యం ఇవ్వడం బాధాకరమని విమర్శించారు. లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక వేదనలో ఉన్నారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలు, ఖాళీ ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ సమస్యలు, విద్యా వ్యవస్థలో పెరుగుతున్న అవినీతిపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పష్టమైన చర్యలు ప్రకటించాల ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. సత్య ప్రసాద్ శ్రీమాన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్. బాలకృష్ణ సల్మాన్ బేగ్ మధు వెంకటేష్ మధుకర్ అలీ రాహుల్ కిరణ్ ప్రదీప్ రమేష్ సాయి భరత్ ధీరజ్ పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



విశ్వంభర, బర్కత్ పుర : విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుండే డిమాండ్ చేశారు. హైదరాబాదు బర్కత్ పురలోని అవంతి కళాశాల వద్ద బీజేపీ హైదరాబాదు సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన "ఫీజుల బకాయి--బీజేపీ లడాయి" సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడకుండా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. లంకల దీపక్ రెడ్డి మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి విద్యార్థులు బకాయిల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని, ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో: రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడెల్లి అజయ్ కుమార్, చిట్టి శ్రీధర్, కన్నె రమేష్ యాదవ్, మోత్కుల శ్యామ్ రాజ్, గంగరాజు, ఎక్కల కన్నా, భుజేందర్, ఉమారాణి, అమృత, వనం రమేష్, అడపా చంద్రమౌళి, జ్యోతి, నాగమణి, నీరజ, నితిన్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికల భద్రతకు 'పోలీస్ అక్క' అండ

**ఎలాంటి సమస్య వచ్చినా నిర్భయంగా సంప్రదించాలి: మెదక్ ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**





విశ్వంభర, పెద్దశంకరంపేట: బాలికల భద్రతకు పోలీస్ శాఖ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, ప్రతి విద్యార్థినికి 'పోలీస్ అక్క' అండగా నిలుస్తుందని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అన్నారు. పెద్దశంకరంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం నిర్వహించిన 'పోలీస్ అక్క' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, విద్యార్థినులు ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా 'పోలీస్ అక్క'ను సంప్రదించాలని సూచించారు. మహిళలు, బాలికల భద్రత కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, విద్యార్థినుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి 'పోలీస్ అక్క'లు కృషి చేస్తారని తెలిపారు. మహిళల భద్రత, సైబర్ నేరాలు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, బాల్య వివాహాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, మహిళా రక్షణ చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. పెద్దశంకరంపేట పోలీస్‌స్టేషన్ పరిధికి కానిస్టేబుల్ గౌతమిని 'పోలీస్ అక్క'గా నియమించినట్లు ప్రకటించి, ఆమె ఫోన్ నంబర్‌ను విద్యార్థినులకు అందజేశారు. విద్యార్థినులు ఎదుర్కొనే సమస్యలను గోప్యంగా తెలుసుకుని, అవసరమైన సహాయం అందించడంతో పాటు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ భరోసా ఇచ్చారు. సమస్యలను దాచిపెట్టకుండా నేరుగా 'పోలీస్ అక్క'ను కలిసి లేదా ఫోన్ ద్వారా తెలియజేయాలని సూచించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు, బ్యాంకు సమాచారం పంచుకోవద్దని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్--112, షీ టీమ్స్ సేవలను వినియోగించాలని, సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. 'పోలీస్ అక్క' కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తూ వారితో స్నేహపూర్వకంగా మమేకమవుతారని, వారి సమస్యలు, భవిష్యత్తు లక్ష్యాలను తెలుసుకుని అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తారని ఎస్పీ తెలిపారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, ఎలాంటి సమస్య ఎదురైనా దాచిపెట్టకుండా 'పోలీస్ అక్క'కు తెలియజేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు. విద్యార్థినుల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు రేణుక, సందీప్‌రెడ్డి, ఎస్ఐలు శంకర్, ప్రవీణ్‌రెడ్డి, పోచయ్య, 'పోలీస్ అక్క' గౌతమి, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

# సాంఘిక సంక్షేమ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ స్నేహ శబరిష్

**ఆగస్టు 3లోగా ఫారాలు పూర్తి చేయాలి..**

**విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం అందించాలి**



విశ్వంభర, మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ శనివారం మరిపెడ మండల కేంద్రంలో ఆకస్మికంగా పర్యటించి ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) డిజిటలైజేషన్ ప్రక్రియతో పాటు నరసింహులపేట సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాల, వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ముందుగా ఎస్ఐఆర్ సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, తిరిగి అందని ఫారాల వివరాలను బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటిని సందర్శించి ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించి డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్‌వోలు, సూపర్వైజర్లు, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి ఆగస్టు 3వ తేదీలోగా ఫారాల సమర్పణ పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం నరసింహులపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల పాఠశాల, వసతి గృహాన్ని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థినులతో ఆత్మీయంగా మాట్లాడారు. తరగతి గదులు, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు అందు తున్న విద్యా సౌకర్యాలు, ఆహార నాణ్యతపై ఆరా తీశారు. ప్రభుత్వం నిర్దేశించిన డైట్ మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని, ప్రతి విద్యార్థికి అన్ని సబ్జెక్టులపై పూర్తి అవగాహన కల్పించేలా బోధన సాగించాలని సూచించారు. ఇంగ్లీష్ పరిజ్ఞానాన్ని కూడా మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయుల హాజరు శాతం కచ్చితంగా ఉండేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యం, పరిశుభ్రత, పోషకాహారం అంశాలపై అవగాహన కల్పించాలని, విద్యార్థులతో పాటు భోజనం తయారు చేసే సిబ్బందికి కూడా నిర్ణీత షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా బాలికల ఆరోగ్యం, మానసిక స్థితిగతులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఉపాధ్యాయులు, అధికారులను కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశించారు.

# సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వనమహోత్సవం

**ఏకకాలంలో 1500 మొక్కలు నాటిన పోలీసులు**

**కార్యక్రమాన్ని ప్రారంభించి మొక్కలు నాటిన జిల్లా కలక్టర్ తేజస్ నంద లాల్ పవార్, జిల్లా ఎస్పి నరసింహ**



విశ్వంభర, సూర్యాపేట: పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతలో భాగంగా సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి ఏకకాలంలో జిల్లా పోలీసు సిబ్బంది 1500 మొక్కలు నాటారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై, మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో కార్యాలయ ప్రాంగణంలో ఏకకాలంలో సామూహికంగా 1500 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ.. చెట్లు, అడవులు పెంచడం వల్ల పర్యావరణ రక్షణకు, సమృద్ధిగా వర్షాలు కురవడానికి ఎంతగానో దోహదపడుతాయని పేర్కొన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి, నాటిన ప్రతి ఒక్క మొక్కను మహా వృక్షంలా ఎదిగేలా బాధ్యతగా సంరక్షించాలని పిలుపునిచ్చారు. పోలీసులు అత్యంత ప్రాదాన్యమైన శాంతిభద్రతల విధులతో పాటు సామాజిక బాధ్యతగా ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీ యమన్నారు. ప్రస్తుతం ఎల్–నినో ప్రభావం వల్ల వర్షపాతం తక్కువగా నమోదు అవుతుందని నీటి ఎద్దడిని తట్టుకొని పండే పంటలవైపు రైతులు ఆలోచన చేయాలని అన్నారు. జిల్లా యంత్రాంగంలో పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత కలిగిన శాఖ అని పోలీస్ శాఖ ఇతర శాఖల సమన్వయంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా పనిచేస్తుంది అని తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సామాజిక అంశాలపై అనేక ప్రజా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి శాంతి భద్రతల రక్షణలో నిరంతరంగా కృషి చేస్తున్నారు అన్నారు. జిల్లా పోలీస్ సిబ్బంది సంక్షేమానికి జిల్లా ఎస్పీ కృషి చేస్తున్నారని జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో పోలీస్ క్యాంటీన్, పరేడ్ గ్రౌండ్, జిమ్ లాంటి వసతులు ఏర్పాటు చేశారని, ఆహ్లాదకరమైన వాతావరణ కల్పన కోసం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం జరిగింది అని తెలిపారు. జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఒకేసారి పెద్ద సంఖ్యలో మొక్కలు నాటడం జరిగిందని వివరించారు. జిల్లా పోలీసు శాఖ అధ్వర్యంలో అన్ని పోలీస్ స్టేషన్ ల పరిధిలో పోలీస్ వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటుతున్నారు అన్నారు. శాంతి భద్రతల పరరక్షణలో నిరంతరం కృషి చేస్తున్నాము అని తెలిపినారు. చెట్లు పెంచడం అడవులు పెంచడం వల్ల వాతావరణ పరిస్థితులు అనుకూలించి మంచి వర్షపాతం నమోదవుతుందని తెలిపారు. ఎల్ నినో ప్రభావం వల్ల తక్కువగా వర్షపాతం నమోదవుతుందని దీనికి అనుగుణంగా తక్కువ నీటితో పండే పంటలు రైతులు పండించాలని దీనిపై పోలీస్ శాఖ రైతులకు అవగాహన కల్పిస్తుంది తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి మంజు భార్గవి, డీఎస్పీలు ప్రసన్న కుమార్, రవి, నరసింహ చారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, డసఆర్బి ఇన్స్పెక్టర్ మగ్దూం అలీ, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, జానయ్య, సిఐ లు రాజశేఖర్, వెంకటయ్య ఆర్ఎస్ఐలు సురేష్, ఎమ్. అశోక్, సాయిరాం, రాజశేఖర్, కె. అశోక్, అన్వర్, అఖిల్, ఎస్ఐ లు యాదవేందర్, మహేష్, మౌనిక, మరియు పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు.

# గ్రామకంఠ భూ పోరాటానికి కదలిన "దండు"



విశ్వంభర, ఇబ్రహీంపట్నం: రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం , దండుమైలారం గ్రామంలో గ్రామకంఠం భూమి సాధన కోసం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కి విజ్ఞప్తి చేస్తూ శనివారం రిలే నిరాహార దీక్షలు గ్రామ సర్పంచ్ ఈదులకంటి నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షులు, బిసి, ఎస్సి, ఎస్టి జేఏసీ అధ్యక్షులు విశారదన్ మహారాజ్ హాజరై మాట్లాడుతూ... దండు మైలారం గ్రామానికి మంచి చరిత్ర ఉంది శతాబ్దాల కాలం నుండి గ్రామ ప్రజలు సొంత ఇండ్లు లేక, స్థలాలు లేక ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో 10 ఎకరాల భూమి కొందరు పెత్తందారులు రామకంట భూమిని కబ్జా చేసుకున్నారు. ఒకరి కోసం ఊరందరూ బలి కావడం సరైన విధానం కాదని, సూర్య కిరణాలపై, గాలిపై, ఈ పంచభూతాలపై రాజ్యాంగ ప్రకారం అందరికీ సమాన హక్కు ఉంటుంది. ఈ గ్రామంలో దొరల నుండి ఒక్క ఎకరా భూమి కూడా పేదలకు చెందలేదని, తాదూరి జనార్దన్ రెడ్డి, సందనమోని నారాయణరావు, తిరుమల్ రావు, స్వామి రావు, మల్లేశ్వరరావు, శ్రీనివాసరావుల ఆధీనంలో ఉన్న భూమిని గ్రామ ప్రజలకు పంచితే దాదాపు 700 మందికి 60 గజాల ఇళ్ల స్థలాలు, 500 మందికి పంచితే 100 గజాల ఇళ్ల స్థలాలు వస్తాయి. కాబట్టి ఈ భూమిని భూస్వాముల వద్ద నుండి మన బిడ్డలకు ఇచ్చేవరకు పోరాటం సాగించాలని, జిల్లా కలెక్టర్ గ్రామ కంట భూమిని పేదలకు ఇచ్చే కాగితం మన చేతిలోకి వచ్చేవరకు పోరాటం ఆగకూడదని అన్నారు. తాదూరి జనార్ధన్ రెడ్డికి ఈ సభ ద్వారా విన్నపిస్తున్న గ్రామ ప్రజల కోసం తమ వద్ద ఉన్న భూమిని ఇచ్చి చరిత్రలో నిలువుస్తావో, చరిత్రహీనుడు అవుతావో తెలుసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమానికి బీసీ, ఎస్సీ, జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తోట్ల రాఘవేందర్ ముదిరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడపాక రాజ్ కమల్, రాష్ట్ర కమిటీ సభ్యులు తులసిగారి రవీందర్, ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుంట్లవెల్లి రాకేష్, పిఏసిఎస్ చైర్మన్ మంచాల అంజమ్మ, ముకునూర్ సర్పంచ్ సన్నాయిల శిల్పప్రేమకర్, వివిధ పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు హాజరయ్యారు.

## ఉపాధి హామీ పథకం పై మంత్రి సమావేశం



విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదికలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క శనివారం రోజు జరిపిన రాష్ట్ర వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో రామన్నపేట మండల ఎంపీడిఓ రాములు, ఎంపీఓ, ఏఈ (పంచాయత్ రాజ్), ఏఈ (ఆర్.డబ్లు.ఎస్) సెర్ప్ ఏపిఎం, సిసి విబి–జి రాంజి సిబ్బంది, మండలంలోని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క తెలంగాణ జలసిరి పనులను చేయించాలని అధికారులను ఆదేశించారు.

## భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



విశ్వంభర, పెద్ద శంకరంపేట: ఏకాదశి ఉత్సవాలను పెద్ద శంకరంపేట మండలంలో ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని విట్టలేశ్వర దేవాలయం వేణుగోపాలస్వామి దేవాలయం వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వేద బ్రాహ్మణోత్ములు బ్రహ్మ ముహూర్తంలోని మూలవిరాట్లకు అభిషేకాలను నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు పెద్ద ఎత్తున ఆలయాల చేరుకొని మూలవిరాట్లకు అభిషేకాలు నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు . తొలి ఏకాదశి హిందూ సాంప్రదాయంలో ఎంతో పవిత్రమైన ఏకాదశిలలో ఒకటి కావడంతో భక్తులు వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. శనివారం మండల కేంద్రం తో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఆలయాన్ని భక్తులు సందర్శించుకోవడంతో రద్దీగా మారింది. నెల్లికుదురు శ్రీ గోదా రంగనాయక స్వామి, ఇనుగుర్తి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై మూలవిరాట్ కు అభిషేకాలు,అర్చనలు,పూజలు నిర్వహించారు. భక్తులు .తొలి ఏకాదశి సందర్భంగా విష్ణు సహస్రనామం శ్రీమద్భగవద్గీత విష్ణు అష్టోత్తర శతనామావళి, ఓం నమో నారాయణ మంత్రం వంటివి పారాయణం చేశారు. సాయంకాలం విఠలేశ్వర స్వామి ఆలయం నుండి పల్లకిలో విఠలేశ్వర స్వామి అమ్మవారి విగ్రహాలను తీసుకొని భజనలు చేస్తూపల్లకి సేవ నిర్వహించారు భక్తులు. ఉపవాస దీక్షలు పాటించారు.

## లోన్లు ఇప్పిస్తానని మోసగించిన వ్యక్తి అరెస్ట్

**: మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రఘుపతి రెడ్డి**




విశ్వంభర, మహబూబాబాద్ : నీతి అయోగ్ డైరెక్టర్ అని చెప్పుకుని ఎస్టి కార్పొరేషన్ ద్వారా లోన్లు ఇప్పిస్తానని నమ్మించి పలువురి వద్ద నుండి సుమారు 1,85,000 రూపాయలు వసూలు చేసి మోసానికి పాల్పడిన వ్యక్తిని మహబూబాబాద్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు టౌన్ ఇన్స్పెక్టర్ రఘుపతి రెడ్డి తెలిపారు. కేసు వివరాల ప్రకారం అరెస్టు చేయబడిన నిందితుడు బోడ మహేష్, గా/శీ ఓబుల్, 36 సం,, =/శీ చెర్ల తండ, గూడూరు మండలం అనే నిందితుడు తాను నీతి అయోగ్ డైరెక్టర్ అని ప్రభుత్వ పథకాల పేరుతో, ముఖ్యంగా ఎస్టి కార్పొరేషన్ ద్వారా లోన్లు మంజూరు చేయిస్తానని నమ్మబలికి బాధితుల నుండి నగదు వసూలు చేసి మోసానికి పాల్పడినట్లు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా టౌన్ ఇన్స్పెక్టర్ రఘుపతి రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ లోన్లు, సబ్సిడీలు, ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు అడిగే వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని, ప్రభుత్వ పథకాల కోసం సంబంధిత ప్రభుత్వ కార్యాలయాలను మాత్రమే సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ఎవరైనా ఇలాంటి మోసాలకు పాల్పడితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

## ప్రగతిశీల శక్తులకు అండగా నిలుద్దాం: డీఎస్ఓ




విశ్వంభర, హైదరాబాదు : ప్రజా ఉద్యమాలకు, ప్రగతిశీల శక్తులకు భవిష్యత్తులో అండగా నిలవాలని డీఎస్ఓ పూర్వ విప్లవ విద్యార్థులు పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాదు బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన డీఎస్ఓ పూర్వ విప్లవ విద్యార్థుల ఆత్మీయ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. సమావేశానికి మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు అధ్యక్షతన ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్ఓ వ్యవస్థాపక సభ్యుడు గుండా సత్యనారాయణ మాట్లాడుతూ, 1973లో శాస్త్రీయ, స్వతంత్ర, ప్రజాతంత్ర విద్యావిధానం కోసం, విద్యా వ్యాపారీకరణకు వ్యతిరేకంగా డీఎస్ఓ ఏర్పాటై, ఐదు దశాబ్దాలుగా విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటాలు సాగించిందన్నారు. 1982లో సంస్థ రెండు వర్గాలుగా విడిపోయినప్పటికీ, రెండు వర్గాలకు చెందిన పూర్వ నాయకులు ఈ సమావేశంలో పాల్గొని ఐక్యత అవసరాన్ని నొక్కిచెప్పారు. గత ఉద్యమాలను స్మరించుకుంటూ భవిష్యత్తులో ప్రజా ఉద్యమాలకు తోడ్పాటునందించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో జెరిపోతుల ఉపేందర్, కర్రె సత్యనారాయణ, గునుగుంట్ల శ్రీనివాసరావు, శీలం స్వామి, టీవీ నరసింహరావు, సత్యనారాయణ, గంగ భవాని, సదానందం, సామ శ్రీనివాస్, యడ్ల భాస్కర్, సునీల్, చంద్ పాషా, రాములు, అజయ్, శశాంకర్, సుదీప్, గోలి కృష్ణ, శ్రీను, సంపత్ కుమార్, రమేష్, సుధాకర్, యాదిరెడ్డి, శ్యాం, గోపి, రహమత్ పాషా, సంతోష్ రెడ్డి, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు

**: ఎమ్మెల్యే బాలు నాయక్**



విశ్వంభర, చింతపల్లి: ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. శనివారం చింతపల్లి మండలం తీదేడు గ్రామంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పరిశీలించి బీఎల్ఓలు, బీఎల్ఏలు, కాంగ్రెస్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ఒక్క ఓటరి పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా అధికారులు, బీఎల్ఓలు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి అవసరమైన పత్రాలను సకాలంలో సమర్పించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతి బూత్‌లో వంద శాతం ప్రత్యేక సవరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ విజయలక్ష్మి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వంభర V3 NEWS

# పంట మార్పిడి విధానాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

తక్కువ వర్షాల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు సూచనలు



విశ్వంభర, మహబూబాబాద్: సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సూచించారు. శనివారం మరిపెడ మండలంలోని ఎడ్జెర్ల గ్రామంలో గిరిజన రైతు బాదావత్ వీరన్న--బుజ్జి పొలంలో పెసర విత్తనాలు విత్తి పంట మార్పిడి కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకో వచ్చున్నారు. వ్యవసాయ శాఖ సూచనల మేరకు పంట మార్పిడి విధానాన్ని పాటిస్తే భూసారం మెరుగుపడటంతో పాటు దిగుబడులు కూడా పెరిగే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేశారు. పంట మార్పిడి విధానం వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, రైతులకు అందుబాటులో ఉన్న వివిధ పథకాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని రైతులకు సూచించారు.

# ఫీజు రీ యింబర్సుమెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి: ఎంపీ వద్దిరాజు




విశ్వంభర, మహబూబాబాద్ : విద్యార్థులకు బకాయిపడిన 11వేల కోట్ల రూపాయల ఫీజులను వెంటనే చెల్లించాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నింటినీ భర్తీ చేయాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులు,యువత ఆగ్రహావేశాలకు గురి కాకముందే వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడిన 11వేల కోట్ల ఫీజు రియంబర్స్ మెంట్,స్కాలర్ షిప్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ తెలంగాణ గ్రాడ్యుయేట్స్ ఫోరం శనివారం కొత్తగూడెం కమ్మ సంఘం భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసింది.బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎంపీ రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు,ఆ తర్వాత విలేకరులతో మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యార్థి,యువజన వ్యతిరేక విధానాలను ఎండగట్టారు.నీట్ ప్రశ్నాపత్రం లీక్ ను నిరసిస్తూ విద్యార్థులు, యువత దేశవ్యాప్తంగా పలుచోట్ల ఆందోళనకు దిగడంతో బెంబేలెత్తిన ప్రధాని నరేంద్రమోడీ మధ్య రాత్రి కూడా స్పందించారని, మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలన చేతకావడం లేదని, విద్యార్థులు, నిరుద్యోగ యువత,ఉద్యోగులు, కార్మికులు, రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఎంపీ రవిచంద్ర చెప్పారు.ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించని కారణంగా కాలేజీలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, ఓవర్సీస్ స్కాలర్ షిప్స్ బకాయిలు కూడా పెరిగిపోతున్నాయని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలంటూ యువత పోరుబాట పట్టారన్నారు.గోదావరి నీళ్లను సద్వినియోగంలోకి తేకుండా వృధాగా సముద్రం పాలవుతుంటే రేవంత్ రెడ్డి నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఎంపీ రవిచంద్ర మండిపడ్డారు.రేవంత్ రెడ్డి ఎన్నికలకు 432 హామీలిచ్చి,6 గ్యారంటీలు ప్రకటించి భద్రాచలం రాముల వారితో సహా కనబడ్డ ప్రతి దేవుని మీద ఒట్లేసి, అబద్ధాలు చెప్పి, మోసం చేసి అధికారంలోకి వచ్చారని ఎంపీ వద్దిరాజు విమర్శించారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు 56వేల కోట్ల రాష్ట్ర బడ్జెట్ ను 3కోట్ల దాక తీసుకుపోయి అన్ని విధాలా అభివృద్ధి చేస్తే, కాంగ్రెస్ పాలకులు ఆగం పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఫీజుల బకాయిలను విడతల వారీగా చెల్లించాలని, లేనట్టయితే బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక చెల్లిస్తుందని ఎంపీ వద్దిరాజు హామీనిచ్చారు.ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ దిండిగల రాజేందర్, మునిసిపల్ మాజీ ఛైర్ పర్సన్ కాపు సీతామహాలక్ష్మీ,మాజీ వైస్ ఛైర్మన్ వేల్పుల దామోదర్, మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, నాయకులు దళ్ సింగ్ నాయక్,లక్కినేని సురేందర్,రంగనాథ్,తొగరు రాజశేఖర్, మల్హోత్రా సాగర్,లావుడ్య సత్యనారాయణ, రాజు గౌడ్, అనుదీప్, నవతన్, వగ్గెల పూజ, కిరణ్, రమాకాంత్, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రూ.20 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జాపై హైడ్రాకు ఫిర్యాదు

బంగారు మైసమ్మ దేవాలయ ఛైర్మన్ బోబ్బల లక్ష్మారెడ్డిపై కాంగ్రెస్ నాయకుల ఆరోపణలు



విశ్వంభర, బోడుప్పల్: మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్‌లో సర్వే నంబర్ 262లో ఉన్న సుమారు రూ.20 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమించారని ఆరోపిస్తూ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోగుల వీరారెడ్డి, పులకండ్ల బాల్‌రెడ్డి హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, బంగారు మైసమ్మ దేవాలయ చైర్మన్ బోబ్బల లక్ష్మారెడ్డి ప్రభుత్వ భూమిని ఆక్రమించి షెడ్లు నిర్మించి, గత పదేళ్లుగా అద్దెలు వసూలు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై సంబంధిత ప్రభుత్వ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, దీంతో చివరి ప్రయత్నంగా హైడ్రా కమిషనర్‌ను ఆశ్రయించినట్లు తెలిపారు. ఈ మేరకు పోగుల వీరారెడ్డి, పులకండ్ల బాల్‌రెడ్డి సంయుక్తంగా హైడ్రా అధికారులకు వినతిపత్రం సమర్పించారు. తమ ఫిర్యాదులో సర్వే నంబర్ 262లోని ప్రభుత్వ భూమిని బోబ్బల లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులు అక్రమంగా ఆక్రమించి తమ ఆధీనంలో ఉంచుకొని వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న భూమిని ఆక్రమించడం వల్ల ప్రభుత్వానికి భారీగా నష్టం జరుగుతోందని, సర్వే నంబర్ 262కు సంబంధించిన రెవెన్యూ రికార్డులు, ఇతర అధికారిక పత్రాలను పరిశీలిస్తే ఆక్రమణల వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వారు తెలిపారు.

ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని, అక్రమంగా నిర్మించిన షెడ్లను తొలగించాలని, ప్రభుత్వ భూమిని ఆక్రమించి అద్దెలు వసూలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్‌ను కోరినట్లు వెల్లడించారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడి ప్రజా అవసరాలకు వినియోగించేలా తగిన చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

# ఎన్నికల హామీ మేరకు 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలి: ఎంపీ ఆర్. కృష్ణయ్య

నిరుద్యోగులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయొద్దని డిమాండ్




విశ్వంభర, చైతన్యపురి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ మేరకు రాష్ట్రంలో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను నిర్లక్ష్యం చేసినందువల్లే ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొని అధికారాన్ని కోల్పోయిందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఉద్యోగాల భర్తీపై హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చినప్పటికీ, ఇప్పటివంకు కేవలం 69 వేల ఉద్యోగాలనే భర్తీ చేసిందని విమర్శించారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో భారీ సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడం లేదన్నారు. రిటైర్‌మెంట్, పదోన్నతుల వల్ల ఏర్పడిన ఖాళీలతో పాటు కొత్త జిల్లాలు, మండలాలు, కార్యాలయాల్లో అవసరమైన అదనపు పోస్టులను కూడా సృష్టించడం లేదని ఆరోపించారు. విద్యాశాఖలో ప్రభుత్వ పాఠశాలలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాలు, ఆదర్శ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, ఎయిడెడ్ పాఠశాలల్లో కలిపి సుమారు 34 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అలాగే పోలీస్ శాఖలో 18 వేల కానిస్టేబుల్, ఎస్సై తదితర పోస్టులు ఖాళీగా ఉండగా, కేవలం 7 వేల పోస్టులకే నోటిఫికేషన్ జారీ చేశారని పేర్కొన్నారు. గ్రూప్-1లో 1,600, గ్రూప్-2లో 3,000, గ్రూప్-3, గ్రూప్-4 విభాగాల్లో సుమారు 20 వేల పోస్టులను తక్షణమే భర్తీ చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు.

# ఎస్ఐఆర్ లో అందరూ భాగస్వాములు కావాలి

: నవీన్ నాయక్




విశ్వంభర, బాగ్ లింగంపల్లి: ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరే వెన్నెముక, ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రతి అర్హుడైన పౌరుడు తప్పనిసరిగా భాగస్వామి కావాలని హైదరాబాదు బాగ్ లింగంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నవీన్ నాయక్ పిలుపునిచ్చారు. హైదరాబాదు ముషీరాబాద్ నియోజకవర్గం బాగ్ లింగంపల్లిలో ఆయన మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ కేవలం ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమం మాత్రమే కాదని, ప్రతి పౌరుడి రాజ్యాంగ బద్ధమైన బాధ్యత అని అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవడంతో పాటు, వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సరిచేయించుకోవాలని సూచించారు. ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి బలమైన పునాదిగా నిలుస్తుందని పేర్కొన్న ఆయన, యువత, మహిళలు, ఉద్యోగులు, వృద్ధులు సహా ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు, సవరణ, మార్పులు, తొలగింపుల ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని కోరారు. ఈ ప్రక్రియను ఎవరూ నిర్లక్ష్యం చేయరాదన్నారు. ప్రజల హక్కులను కాపాడే అత్యంత శక్తివంతమైన ఆయుధం ఓటేనని నవీన్ నాయక్ అన్నారు. ఓటు హక్కును పరిరక్షించుకోవాలంటే ఓటరు జాబితాలో సరైన వివరాలు నమోదు కావడం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలోని అర్హులందరూ తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో పరిశీలించి, అవసరమైతే సంబంధిత అధికారులను సంప్రదించి సవరణలు చేయించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలంటే ప్రతి పౌరుడు బాధ్యతతో వ్యవహరించాలని, ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని కోల్పోకుండా ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కాంగ్రెస్ పార్టీ తరపున ఆయన పిలుపునిచ్చారు.

# సీఎం వ్యాఖ్యలు ఎన్నికల నిబంధనలకు విరుద్ధం



విశ్వంభర, హైదరాబాదు : ఓటరు నమోదును ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ముడిపెట్టి ప్రజలను ప్రభావితం చేసేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసింది. ఎన్నికల సంఘ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ మర్రి శశిధర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ వేముల, కమిటీ సభ్యుడు ఏడెల్లి అజయ్ కుమార్ సమర్పించిన వినతిపత్రంలో, గ్రామంలో ఓటరుగా నమోదు కాకపోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవని చెప్పడం ఎన్నికల చట్టానికి, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ఓటరు గుర్తింపు కార్డు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు తప్పనిసరి కాదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వెంటనే ప్రజలకు స్పష్టత ఇవ్వాలని, ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్ నోటీసు జారీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ కోరింది.

# స్నేహితుడికి మిత్రుల చేయూత



విశ్వంభర, నెల్లికుదురు: నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి గ్రామానికి చెందిన ముంజంపల్లి సంజయ్ మాతృమూర్తి యాకమ్మ ఇటీవల అనారోగ్యంతో కన్ను మూసింది. సమాచారం తెలుసుకున్న ఆయన బాల్య స్నేహితులు నక్క హరీష్, కాటం రాజశేఖర్,రాజు తదితరుల తో పాటు గ్రామానికి చెందిన కూరపాటి ఈశ్వర ప్రసాద్, వార్డు సభ్యులు కాటమల వెంకటేష్ శనివారం బాధిత కుటుంబాన్ని సందర్శించి స్వర్గీయ యాకమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మిత్రుడు సంజయ్ తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. చిన్న వయసులోనే జన్మనిచ్చిన తల్లిని కోల్పోవడం బాదా కరమని విచారం వ్యక్తం చేశారు. ఆపదలోనూ మనోధైర్యాన్ని కోల్పోవద్దని స్నేహితునికి ధైర్య వచనాలు చెప్పారు. మిత్రులు రూ.15,000, గ్రామవాసి ఈశ్వర ప్రసాద్ రు.5,000, వార్డు సభ్యులు వెంకటేష్ 25 కిలోల బియ్యం అందజేసి అండగా ఉంటామని చేయూతనిచ్చారు.

# రామన్నపేట నూతన సిఐ మొలుగూరి రవికి సన్మానం




విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ (సిఐ)గా బాధ్యతలు స్వీకరించిన మొలుగూరి రవికి మండల పాత్రికేయులు, మండల పరిధిలోని లక్ష్మాపురం (కొత్తగూడెం) గ్రామ వాస్తవ్యులు దేవిరెడ్డి సత్తిరెడ్డి, మండల కేంద్రానికి చెందిన పాత్రికేయులు కైరంకొండ సంతోష్ కుమార్, వెల్లంకి గ్రామ వాస్తవ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలు వెంకట్ రెడ్డి శాలువాతో సన్మానం చేసి నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఉమ్రా యాత్ర పూర్తి చేసుకున్న టీఎన్జీవోస్ నేత ముజీబ్‌కు సన్మానం




విశ్వంభర, బషీర్ బాగ్ : పవిత్ర ఉమ్రా యాత్రను విజయవంతంగా పూర్తి చేసి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆశీర్వాదాలతో తిరిగి వచ్చిన టీఎన్జీవోస్ యూనియన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి డా. ఎస్.ఎం. హుస్సైనీ ముజీబ్, టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, హైదరాబాద్ జిల్లా నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు, స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ అధ్యక్షులు కె.ఆర్. రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం. భాస్కర్, ఉపాధ్యక్షులు రుగేష్ తో పాటు కార్యవర్గ సభ్యులు శాలువా కప్పి, భారీ పూలమాలతో డా. ముజీబ్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు విక్రమ్ కుమార్, కార్యదర్శి కురడి శ్రీనివాస్, ఖజాంచి జె. బాలరాజ్, ఉపాధ్యక్షుల ఖాలేద్ అహ్మద్, బొలిగిడ్డ శంకర్, ప్రజా కార్యదర్శి వైదిక్ శాస్త్ర, ఈసీ సభ్యుల ముకీద్ ఖురేషీ, మాజీ కార్యదర్శి ప్రభాకర్, టీఎన్జీఓస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ తెలంగాణ ఫోరం సంయుక్త కార్యదర్శి రమేష్, ఈసీ సభ్యుడు ముజ్జెద్, ప్రియా, మొయిన్ సుమన్, జె. శ్రీనివాస్, పెంటేష్, సునీత, జగదీష్, శ్రీమతి సుజాత, అనిల్, సాగర్, బాబురావు, కళ్యాణ్, మురళి, రామ్‌చంద్ర రెడ్డి, మధుకర్, సతీష్, కృష్ణ, వెంకటేష్, పరమేష్, సామియుల్లా, శ్రీష, మధు, రవి, దామోదర్ తదితరులు, పాల్గొన్నారు.

# అంబులెన్స్ ప్రారంభించిన హుస్సేన్ నాయక్




విశ్వంభర, మహబూబాబాద్: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ చేతుల మీదుగా ఈసీఐ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల సహకారంతో మహబూబాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి అధునాతన సౌకర్యాలతో కూడిన ఐసీయూ అంబులెన్స్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జాటోతు హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ, అత్యవసర వైద్య సేవలను ప్రజలకు మరింత వేగంగా, నాణ్యంగా అందించడంలో ఈ అంబులెన్స్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ముఖ్యంగా గిరిజనులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో మెరుగైన వైద్య సేవలు పొందేందుకు ఈ అంబులెన్స్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# విద్యార్థులకు న్యాయవిజ్ఞాన అవగాహన సదస్సు



విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని ఎన్నారం, మునిపంపుల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు న్యాయవిజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి శిరీష, అదనపు జూనియర్ సివిల్ జడ్జి రత్నకుమారి పాల్గొని విద్యార్థులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు విద్యతో పాటు విద్యా హక్కు చట్టం, బాల్యవివాహాల నిరోధక చట్టం, పోక్సో చట్టం, బాలకార్మిక నిరోధక చట్టం, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పాఠశాలలో లేదా బయట ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే ఉపాధ్యాయులు, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి, పోలీసులకు లేదా న్యాయ సేవా సంస్థలకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, లీగల్ సర్వీసెస్ టీమ్ సభ్యులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కళాశాల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే

విశ్వంభర, పెద్దశంకరంపేట: కంగ్టి ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి హామీ ఇచ్చారు.శనివారం కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే తరగతి గదులు, వసతి సౌకర్యాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్య, భోజనం, మౌలిక వసతులపై వివరాలు తెలుసుకుని అధ్యాపకులతో సమస్యలపై చర్చించారు. ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కళాశాల ప్రిన్సిపాల్, పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి శంకుస్థాపన



విశ్వంభర, పెద్దశంకరంపేట: ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. కంగ్టి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.28.50 లక్షలతో చేపట్టనున్న సివిల్, ఎలక్ట్రికల్, తాగునీరు, పారిశుద్ధ్య మరమ్మతుల పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భవనాలు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు మెరుగుపడితే విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ వేదికపై హైదరాబాద్‌కు గర్వకారణంగా నిలిచిన ఫెర్టీ9 ఎల్‌బీ నగర్ ఫెర్టిలిటీ సెంటర్



విశ్వంభర, ఎల్బీనగర్ :ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని, హైదరాబాద్‌లో ప్రముఖ ఫెర్టిలిటీ కేర్ నెట్‌వర్క్‌గా పేరుగాంచిన ఫెర్టీ9కు ఈ ఏడాది అంతర్జాతీయ స్థాయిలో విశిష్ట గుర్తింపు లభించింది అని డా. మౌనిక సోరకాయలపేట , డా. శృతి మంత్రీ, మనోజ్ఞ ఫెర్టీ9 తెలిపారు. వారు మాట్లాడుతూ "సంతాన సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి నిపుణులను సంప్రదించడం ఎంతో ముఖ్యం. మారుతున్న జీవనశైలి, ఉద్యోగ ఒత్తిడి, ఆలస్య వివాహాలు వంటి కారణాల వల్ల ఫెర్టిలిటీ సమస్యలు పెరుగుతున్నప్పటికీ, ఆధునిక వైద్య సాంకేతికత, సరైన సమయంలో చికిత్స ప్రారంభించడం ద్వారా విజయవంతమైన గర్భధారణ అవకాశాలను గణనీయంగా పెంచవచ్చు. ఫెర్టీ9 ఎల్‌బీ నగర్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఫెర్టిలిటీ చికిత్సలు, అత్యాధునిక సాంకేతికత, అనుభవజ్ఞులైన వైద్య బృందంతో ప్రతి దంపతికి వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా ఉత్తమ వైద్య సేవలను అందించేందుకు మేము కట్టుబడి ఉన్నాము" అని తెలిపారు.

# చర్చలు సఫలం.. ఆందోళన విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటన



**విశ్వంభర, ఢిల్లీ:** నీట్ లీకేజీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్ నెరవేరడంతోపాటు, మిగతా వాటినీ నెరవేర్చేందుకు కేంద్రం అంగీకరించిన నేపథ్యంలో నిరసనలు విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటించింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన అనంతరం కేంద్రంతో సీజేపీ నేతలు మరోసారి చర్చలు జరిపారు. అనంతరం కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌తో కలిసి సీజేపీ ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. నిరసనకారులపై నమోదైన కేసులను కొట్టివేయాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. కేవలం దిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా నమోదైన కేసులను కొట్టివేయాలని కోరినట్లు చెప్పారు. " నాలుగు రోజుల్లో కేసులు విత్‌డ్రా చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. భవిష్యత్‌లోనూ కేసులతో వేధించబోమని స్పష్టత ఇచ్చింది. నీట్ లీక్ వల్ల ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు పరిహారం ఇచ్చేందుకు, విద్యావ్యవస్థలో సమూల మార్పులకు కేంద్రం అంగీకరించింది"అని తెలిపారు.

**కేసులు ఎత్తేస్తాం: జేపీ నడ్డా**

నిరసనకారులపై పెట్టిన కేసులు ఎత్తివేసేందుకు అంగీకరించినట్లు కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు. దిల్లీ, భాజపా పాలిత రాష్ట్రాల్లో పెట్టిన కేసులను ఎత్తివేస్తామన్నారు. " విద్యావ్యవస్థ, పరీక్షల్లో సమూల మార్పులు చేస్తామని ఇప్పటికే చెప్పాం. భవిష్యత్‌లో ఎవరినీ కేసులతో వేధించబోము. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు అండగా ఉంటాం" అని జేపీ నడ్డా మీడియా ఎదుట హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆందోళన విరమిస్తున్నట్లు సీజేపీ ప్రతినిధులు ప్రకటించారు. ఆందోళనకారులు క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని కోరారు.

# సారనాథ్‌కు యునెస్కో గుర్తింపు.. ప్రధాని మోడీ




**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** ఉత్తరప్రదేశ్‌లోని పురాతన బౌద్ధ క్షేత్రం బుద్ధ భగవానుడు తొలిసారిగా సందేశాన్ని వెలువరించిన సారనాథ్‌కు యునెస్కోప్రపంచ వారసత్వ జాబితాలో చోటు లభించింది. దక్షిణ కొరియాలోని బుసాన్‌లో జరుగుతున్న యునెస్కో 48వ వరల్డ్ హెరిటేజ్ కమిటీ సమావేశంలో చారిత్రక క్షేత్రాన్ని ఈ జాబితాలో చేర్చారు. ఈ విషయాన్ని యునెస్కో 'ఎక్స్' వేదికగా ప్రకటించింది. ఇప్పటివరకు మన దేశంలో 44 నిర్మాణాలకు యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్‌లుగా గుర్తింపు ఉండగా, తాజాగా సారనాథ్ ఆ జాబితాలో చేరడంతో ఆ సంఖ్య 45కి పెరగడం విశేషం.

**భారతీయులంతా గర్వించదగిన క్షణమిది: ప్రధాని**

సారనాథ్‌కు యునెస్కో గుర్తింపు లభించడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇది భారతీయులందరూ గర్వించాల్సిన క్షణమన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. జ్ఞానం, కరుణ, సామరస్యాలకు సంబంధించిన కాలాతీత సందేశంతో ప్రపంచానికి స్ఫూర్తినిచ్చే గౌతమ బుద్ధుడితో సారనాథ్‌కు ఎంతో గాఢమైన బంధం ఉందన్నారు. అలాంటి క్షేత్రానికి అంతర్జాతీయ గుర్తింపు రావడం మన దేశంలో అపారమైన నాగరికత, ఆధ్యాత్మిక వారసత్వాన్ని చాటిచెబుతోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు సారనాథ్‌ను సందర్శించి బుద్ధుడి ఆదర్శాలతో మమేకమయ్యేలా ఇది ప్రేరేపిస్తుందని పేర్కొన్నారు.

# హెచ్-1బీ వీసాలు.. మూడేళ్ల పాటు ఉండవా?





**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** హెచ్-1బీ వీసాలపై ట్రంప్ యంత్రాంగం విధిస్తోన్న ఆంక్షలతో సతమతమవుతున్న భారతీయులను.. ఇప్పుడు మరో బిల్లు ఆందోళనకు గురిచేస్తోంది. రిపబ్లికన్ పార్టీ సభ్యుడు టిమ్ షీహీ సెనెట్‌లో ప్రవేశపెట్టిన బిల్లులో.. కొత్త హెచ్-1బీ వీసాల జారీని మూడు సంవత్సరాల పాటు నిలిపివేయాలని ప్రతిపాదించారు. అలాగే ట్రంప్ యంత్రాంగం విధించిన లక్ష డాలర్ల ఫీజును చట్టబద్ధం చేయాలని పేర్కొన్నారు. అమెరికన్ కార్మికుల హక్కులకు భంగం కలిగించేలా ఉన్న వీసాలను జారీ చేయకూడదని కోరారు. 'ఎండ్ హెచ్-1బీ వీసా యాక్ట్' పేరిట ప్రవేశపెట్టిన బిల్లులో ఈ ప్రతిపాదనలు చేశారు."కొన్ని ప్రత్యేక పోస్టులను నిపుణులైన విదేశీయులతో భర్తీ చేసేందుకు ఈ హెచ్-1బీ ప్రోగ్రామ్‌ను తీసుకువచ్చారు. అంతే గానీ అర్హత ఉండి కష్టపడి పనిచేసే అమెరికన్ల స్థానంలో తక్కువ వేతనాలకు లభ్యమయ్యే విదేశీ శ్రామికులతో భర్తీ చేయడానికి కాదు. నేను తీసుకువచ్చిన బిల్లు హెచ్-1బీ ప్రోగ్రామ్ అసలు ఉద్దేశాన్ని నెరవేర్చేందుకు ఉపయోగపడుతుంది. అందులోని లొసుగుల్ని ఉపయోగించుకోకుండా నివారిస్తుంది" అని పేర్కొన్నారు. అందుకోసం మూడేళ్ల పాటు వీసా జారీని నిలిపివేసి, కఠిన నిబంధనలతో మళ్లీ కొత్తగా ఈ ప్రోగ్రామ్‌ను తీసుకురావాలని కోరారు. కొన్ని నెలల క్రితం రిపబ్లికన్ కాంగ్రెస్ సభ్యుడు ఎలీ క్రేన్ ప్రతినిధుల సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఏటా ఇస్తున్న 85,000 వీసాలను తగ్గించాలని.. లాటరీ విధానం కాకుండా అత్యధిక జీతం ఇచ్చే వారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని.. హెచ్-1బీ వీసాదారులు భార్యాపిల్లలను అమెరికాకు తీసుకురావడంపై నిషేధం విధించాలనే ప్రతిపాదనలు ఈ బిల్లులో ఉన్నాయి.

# హెచ్-1బీ వీసాకు లక్ష డాలర్ల ఫీజు.. ట్రంప్‌నకు మళ్లీ ఎదురుదెబ్బ




**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** విదేశీ వృత్తి నిపుణుల హెచ్1బీ వీసాలకు లక్ష డాలర్ల ఫీజు విధింపు విషయంలో ట్రంప్ నకు మళ్లీ ఎదురు దెబ్బ తగిలింది. ఈ ఫీజులు చట్టబద్ధం కాదంటూ ఇటీవల దిగువ న్యాయస్థానం తీర్పుపై స్టే ఇచ్చేందుకు అప్పీల్స్ కోర్టు నిరాకరించింది. దీనిపై స్టే ఇవ్వకపోవడం వల్ల దేశానికి వచ్చే నష్టం ఏంటో తెలియజేయడంలో ట్రంప్ యంత్రాంగం విఫలమయ్యిందని పేర్కొంది. అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు దీనిపై నిర్ణయం తీసుకోలేరని పేర్కొంది.విదేశాల్లో ఉండి అమెరికా తాత్కాలిక వలస వీసా అయిన హెచ్1బీకి ఎంపికైన వారు లక్ష డాలర్ల ఫీజును చెల్లించాలని గత సెప్టెంబరులో ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించింది. దీనిని సవాలు చేస్తూ 20 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ బోస్టన్ కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వాటిని విచారించిన యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి లియో సొరొకిన్.. లక్ష డాలర్ల ఫీజు చట్ట విరుద్ధమని ప్రకటించారు. అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకపోవడంతో దానిని చట్ట విరుద్ధ పన్నుగా పరిగణిస్తున్నామని తీర్పు చెప్పారు. దీంతో ట్రంప్ యంత్రాంగం అప్పీల్స్ కోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. సాధారణంగా వీసాల కోసం అయ్యే ఖర్చును కంపెనీలు భరిస్తాయి. గతంలో ఇందుకోసం 2 వేల నుంచి 5 వేల డాలర్ల వరకూ ఖర్చు కాగా.. గతేడాది సెప్టెంబరులో ఈ వీసా ఫీజును ట్రంప్ సర్కార్ ఏకంగా లక్ష డాలర్లకు పెంచేసింది. విదేశీ ఉద్యోగులపై ఆధారపడకుండా కంపెనీలు అమెరికన్లను నియమించుకోవాలనే ఉద్దేశంతో ఈ ఫీజును పెంచారు. దీంతో భారతీయులపై పెను ప్రభావమే పడింది.

## ఇది విద్యార్థుల విజయం: రాహుల్ గాంధీ



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయమని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. మన దేశ విద్యా వ్యవస్థ ఎంతో గొప్పదని ప్రపంచమంతా పేరుందని.. కానీ, క్రమంగా ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. నిరుద్యోగం పెరగడంతో యువత ఆగ్రహంతో ఉన్నారన్నారు. విద్యా వ్యవస్థను మార్చాలని యువత కోరుకుంటున్నారన్నారు. శనివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మన విద్యా వ్యవస్థను ఆరెస్సెస్ దొడ్డిదారిన చొరబడి నాశనం చేసిందని ఆరోపించారు. దిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై హింసకు, పెల్లెట్ గన్‌ల ప్రయోగం వంటి ఘటనలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షానే బాధ్యులని ఆరోపించారు. విద్యార్థులపై అణిచివేతను పార్లమెంటులో ప్రశ్నిస్తామని, అమిత్ షా వైఖరిని పార్లమెంటులో ప్రశ్నిస్తామని తెలిపారు. భారతీయ విద్యా వ్యవస్థను మెరుగుపరిచేందుకు ఇకనైనా నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని రాహుల్ కోరారు. దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో ఉందన్న రాహుల్.. దేశాన్ని, వ్యవస్థలను నడిపే తీరు ఇది కాదన్నారు. విద్యార్థుల ఆందోళనలు దేశంలో ఉన్న తీవ్ర సంక్షోభానికి నిదర్శనమన్నారు. మోదీ సర్కార్‌కు ఈ ఉద్యమం ఓ మేలుకొలుపు అన్నారు.

# ఢిల్లీలో విద్యార్థుల ఆందోళనలు.. స్పందించిన ఐక్యరాజ్యసమితి



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** నీట్ పేపర్ లీక్ వ్యవహారం, విద్యా వ్యవస్థలో సంస్కరణలను కోరుతూ దిల్లీలో జంతర్‌మంతర్ వద్ద కొనసాగుతున్న ఆందోళనలపై ఐక్యరాజ్యసమితి స్పందించింది. శాంతియుత నిరసనల్లో పాల్గొనే వారికి అరెస్టు లేదా గాయాలు, వేధింపుల భయం లేకుండా చూడాలని సూచించింది. దిల్లీలో విద్యార్థులు చేపట్టిన ఆందోళనలపై మీడియా అడిగిన ప్రశ్నకు ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ అధికార ప్రతినిధి స్టెఫాన్ డెజారిక్ స్పందిస్తూ.. అక్కడ జరుగుతున్న పరిణామాలపై అవగాహన ఉందన్నారు. అయితే, శాంతియుతంగా నిరసన తెలియజేయాలనుకునే వారి హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత భద్రతా దళాలకు ఉందని అభిప్రాయపడ్డారు. కొన్నిరోజులుగా జంతర్‌మంతర్‌లో కొనసాగిన ఆందోళనల్లో భారీ సంఖ్యలో విద్యార్థులు, ఉద్యమకారులు పాల్గొన్న విషయం తెలిసిందే. పోలీసు వర్గాల ప్రకారం.. అన్ని వేళలా అక్కడ సరాసరి 10వేల మంది నిరసనకారులు ఉన్నట్లు అంచనా. దీంతో అక్కడ శాంతి భద్రతలను అదుపులో ఉంచేందుకు దాదాపు 3 వేల మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. అయితే, జులై 20న 'సంసద్ చలో' పేరుతో చేపట్టిన కార్యక్రమంలో వేలాది మంది విద్యార్థులు పాల్గొనడం, వారిని భద్రతా దళాలు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో అనేక మంది గాయపడ్డారు.



## ప్రేమ.. జైలు.. ఏడడుగులు!..
## నిందితుడితో బాధితురాలి పెళ్లి


**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** ఛత్తీస్‌గఢ్‌లోని జగ్‌దల్‌పుర్‌లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. అత్యాచారం కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని బాధితురాలు వివాహం చేసుకుంది. జగదల్‌పుర్ సెంట్రల్ జైలులోనే ఈ పెళ్లి జరగడం గమనార్హం. న్యాయస్థానం అనుమతితోనే ఈ పెళ్లి జరిగినట్లు అధికారులు వెల్లడించారు. రాజ్‌పుర్ గ్రామానికి చెందిన సురేష్ సేథియా, మన్మతి కశ్యప్‌లు స్థానికంగా ఉన్న ఓ పెట్రోల్ బంకులో పనిచేసేవారు. అనంతరం వారి పరిచయం ప్రేమగా మారింది. పెళ్లిచేసుకుంటానని సురేష్ హామీ ఇవ్వడంతో ఆమె మరింత దగ్గరైంది. అయితే, ఇద్దరు వేర్వేరు వర్గాలకు చెందినవారు కావడంతో వీరి పెళ్లికి అబ్బాయి కుటుంబీకులు అంగీకరించలేదు. దీంతో మనస్తాపానికి గురైన మన్మతి.. పెళ్లి చేసుకుంటానని సురేష్ మోసం చేశాడని ఆరోపిస్తూ తల్లిదండ్రుల సాయంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేయగా.. ఏడు నెలలుగా అతడు జైల్లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో మనసు మార్చుకున్న అతడు.. బాధితురాలిని పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. రాజీపడిన ఇద్దరు, పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని అధికారుల సాయంతో కోర్టు దృష్టికి తీసుకెళ్లగా.. న్యాయస్థానం కూడా ఇందుకు అంగీకరించింది. దీంతో జైలు నిబంధనల ప్రకారం అధికారులు, కుటుంబీకులు, సాక్షుల సమక్షంలో జగదల్‌పుర్ జైల్లోనే వారి వివాహం జరిపించారు. అయితే, పెళ్లైనప్పటికీ, అతడిపై నమోదైన కేసుపై విచారణ కొనసాగుతుందని, న్యాయస్థానం తీర్పు ప్రకారం నడుచుకోవాల్సి ఉంటుందని అధికారులు వెల్లడించారు.

## భర్తను మోస్తూ.. 180 కిమీ ప్రయాణం!



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** భార్యభర్తల అప్యాయత, నమ్మకం, బాధ్యతకు నిదర్శనంగా.. నిస్వార్థమైన ప్రేమకు చిరునామాగా నిలిచింది ఉత్తర్‌ప్రదేశ్ జంట. భర్త కోరికను బాధ్యతగా భావించి, దివ్యాంగుడైన అతడిని ఏకంగా 180 కిలో మీటర్లు మోసుకొని కాలినడకన ప్రయాణించింది భార్య. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మోదీనగర్‌కు చెందిన ఆశా, సచిన్ భార్యభర్తలు. వారికి ఇద్దరు పిల్లలు. 12 ఏళ్ల క్రితం ఓ ప్రమాదంలో సచిన్‌కు వెన్నెముకకు గాయమైంది. చికిత్స చేసినా ఫలితం లేకుండా పోయింది. నడవలేని స్థితికి చేరాడు. అయినా, భార్య అధైర్యపడకుండా.. భర్తకు అండగా నిలుస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. భర్త శివభక్తుడు. హరిద్వార్‌లోని శివాలయాన్ని దర్శించాలని ఆయన కోరిక. భర్త ఆశను బాధ్యతగా భావించి అతన్ని మోసుకొని 180 కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించింది. గతేడాదిలోనూ ఆమె హరిద్వార్‌లోని కన్వర్ యాత్రకు సచిన్‌ను భుజాన తీసుకెళ్లడం విశేషం.

## వివాదాస్పద మ్యాప్‌తోనే నేపాల్ రూపాయి నాణెం!



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** వివాదాస్పద ప్రాంతాలతో కూడిన నాణేన్ని ముద్రించేందుకు నేపాల్ సిద్ధమైంది. లింపియాధుర, లిపులేఖ్, కాలాపానీలను నేపాల్‌లో భాగాలుగా చూపే మ్యాప్‌ను కొత్తగా రూపొందించిన రూపాయి నాణెంపై ముద్రించనున్నట్లు ఆ దేశ జాతీయ బ్యాంకు వెల్లడించింది. ఈ ప్రాంతాలు తమవేనని నేపాల్ వాదిస్తుండగా.. ఇవి ఉత్తరాఖండ్‌లో భాగమని భారత్ చెబుతోంది. ఈ సమస్యను ద్వైపాక్షిక చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచిస్తోంది. 2020 మేలో కె.పి.ఓలీ నేతృత్వంలోని నేపాల్ ప్రభుత్వం ఈ ప్రాంతాలను తన అధికారిక మ్యాప్‌లో చేర్చుకుంది. ప్రధానమంత్రి బాలెన్ షా నేతృత్వంలోని ప్రస్తుత ప్రభుత్వం ఈ మ్యాప్‌ను తొలగించి, దాని స్థానంలో ఒక మఠం చిత్రాన్ని ముద్రించాలని ఇటీవల నిర్ణయించింది. అయితే, దీనిపై అక్కడి విపక్షాల నుంచి వ్యతిరేకత రావడంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. దీంతో కొత్తగా రూపొందించిన రూపాయి నాణెంపై వివాదాస్పద మ్యాప్‌ను అలాగే ఉంచాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ విషయాన్ని నేపాల్ జాతీయ బ్యాంక్ అధికార ప్రతినిధి గురు ప్రసాద్ పౌడెల్ ప్రకటించారు.

## స్పెయిన్, ఫ్రాన్స్ సరిహద్దుల్లో కార్చిచ్చు..
## 2లక్షల మందికి పైగా తరలింపు

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** ఫ్రాన్స్, స్పెయిన్ సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో కార్చిచ్చు సంభవించింది. శుక్రవారం సాయంత్రం ప్రారంభమైన ఈ కార్చిచ్చు వేగంగా వ్యాపిస్తోంది. ఈ క్రమంలో గాలి నాణ్యత క్షీణిస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. భారీగా మంటలు ఎగసిపడుతుండటంతో చుట్టుపక్కల దట్టమైన పొగ వ్యాపించింది. ఇప్పటి వరకు దాదాపు 2లక్షల మంది స్థానిక ప్రజలను ఇళ్లు ఖాళీ చేయించి.. సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు ఇరుదేశాల అధికారులు వెల్లడించారు. మంటలు ఆర్పడానికి వందల సంఖ్యలో అగ్నిమాపక బృందాలు కృషి చేస్తున్నాయి. రంగంలోకి దిగిన ఫ్రాన్స్ సైన్యం హెలికాప్టర్‌ల నుంచి కొన్ని వేల లీటర్ల నీటిని గుమ్మరిస్తూ.. మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తోంది.కార్చిచ్చును నియంత్రించేందుకు సాయం చేయాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ యూరోపియన్ యూనియన్‌ను కోరారు. స్పెయిన్ రాజధాని మాడ్రిడ్ సమీపంలో మంటలు తీవ్రంగా ఎగసిపడుతుండడంతో వాటిని అదుపు చేయడం సాధ్యం కావట్లేదని.. వాతావరణ పరిస్థితుల కారణంగా అడ్డంకులు తప్పట్లేదని అధికారులు పేర్కొన్నారు. ఓ ట్రాక్టర్ డ్రైవర్ శుక్రవారం అటవీ ప్రాంతానికి సమీపంలో అంటించిన మంట కార్చిచ్చుగా మారిందని స్పానిష్ పోలీసులు పేర్కొన్నారు.



## ఇరాన్ సీరియస్‌గా ఆలోచిస్తోంది..
## పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ట్రంప్

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాల్చడంతో పశ్చిమాసియా రణరంగంగా మారింది. ఇలాంటి సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రోజుకో కొత్త ప్రకటన చేస్తున్నారు. చర్చల అంశాన్ని ఇరాన్ తీవ్రంగా పరిగణిస్తోందని తాజాగా పేర్కొన్నారు. అందుకే ఆ దేశంపై భీకర దాడులు చేయాలా.. వద్దా.. అనే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. భీకర దాడుల అంశంపై ఉన్నతస్థాయి అధికారులతో ట్రంప్ చర్చలు జరుపుతున్నారని వార్తలు వస్తోన్న నేపథ్యంలో ఈ స్పందన వచ్చింది."ప్రస్తుతం మేం వారితో చర్చలు జరుపుతున్నాం. చర్చలను వారు సీరియస్‌గా తీసుకుంటున్నారు. అందుకు కారణం ఉండొచ్చు. వారు లొంగిపోవచ్చు.. లేదా ఏదైనా గుహలోకి వెళ్లి దాక్కోవచ్చు. మా వైపు నుంచి క్షిపణులు లోడ్ చేసే ఉన్నాయి. యుద్ధం ముగించడానికి రెండు అవకాశాలు ఉన్నాయి. ఇప్పుడు చేస్తోన్న దాడుల తీవ్రత పెంచి, వాళ్ల దగ్గర ఉన్నదంతా నాశనం చేయొచ్చు. లేకపోతే ఒప్పందం చేసుకోవచ్చు. డీల్ చేసుకోవడమనేది తెలివైన వ్యూహం. చర్చల విషయంలో వారు సీరియస్‌గా ఉన్నంతమాత్రాన ఒప్పందం కుదురుతుందని చెప్పలేం. చివరకు ఏం జరుగుతుందో వేచి చూడాలి" అని పేర్కొన్నారు. ఇరాన్‌పై భీకరదాడుల్ని పరిశీలిస్తున్నామని, దానిపై నిర్ణయం తీసుకుంటామని ముందు రోజు ట్రంప్ హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. వాటికి ఇరాన్ నుంచి కౌంటర్ వచ్చింది. అమెరికా బెదిరింపులకు తలొగ్గబోమని.. బలప్రయోగం, ఒత్తిడికి ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించబోమని ఇరాన్ స్పష్టం చేసింది. మరోవైపు ఇరాన్‌కు ఆయుధాలు అమ్మవద్దని చైనా, రష్యాకు ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు.

## నా కొడుకును చూసి గర్వపడుతున్నా: అభిజిత్ దీప్కే తల్లి



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** కాక్రోచ్ జనతా పార్టీ చీఫ్ అభిజిత్ దీప్కే తల్లి అనితా దీప్కే తన కుమారుడిని చూసి గర్వపడుతున్నానని అన్నారు. ఈ రోజు చాలా ఆనందంగా ఉందని, ఇది తమ జీవితంలో అద్భుతమైన రోజు అని వ్యాఖ్యానించారు. తన క ఉమారుడు నిజాయితీతో చేసిన కృషికి చివరకు ఫలితం దక్కిందని చెప్పారు. అభిజిత్ పెట్టిన డిమాండ్ నెరవేర్చాల్సిందేనని అతడు గట్టిగా నిర్ణయించుకున్నాడని, అదే పట్టుదలతో చివరి వరకు పోరాడాడని చెప్పారు. మొదట్లో తాము చాలా భయపడ్డామని, జైపూర్ లో అతనని చెంపదెబ్బ కొట్టినప్పుడు తమకు బాధ కలిసిందని అన్నారు. ఆ రాత్రంతా తాము నిద్రపోలేకపోయామని కన్నీళ్లు పెట్టుకున్నారు. అభిజిత్ ఇంటికి తిగిరి వచ్చిన తరవాత అందరం కలిసి స్వీట్లు పంచుకుని ఘనంగా సంబరాలు జరుపుకోవాలని అనుకుంటున్నట్టు తెలిపారు. ఇదిలా ఉంటే నీన్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్రమంత్రి ధర్మంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ ముందు నుండి డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. ప్రతిపక్ష పార్టీలను మించి కాక్రోచ్ పార్టీ చేసిన పోరాటానికి దేశవ్యాప్తంగా మద్దతు లభించింది. దాదాపు 20 రోజులకు పైగా నిరసనలో పాల్గొని చివరికి అనుకున్నది సాధించింది.

## అరుణాచలంలో విషాదం..
## మోక్షమార్గంలో చిక్కుకుని ఆంధ్రా భక్తుడి మృతి




**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** అరుణాచలంలో గిరి ప్రదక్షిణ చేయాలంటే ఎన్నో జన్మల పుణ్యం చేసుకుని ఉండాలన్నది భక్తుల నమ్మకం. కొన్నేళ్లుగా అరుణాచలం గిరిప్రదక్షిణ వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రతిరోజూ వేలాదిమంది భక్తులు 14 కిలోమీటర్ల గిరిప్రదక్షిణ చేసి, అగ్నిలింగేశ్వరుడిని దర్శించుకుంటుంటారు. పౌర్ణమి రోజుల్లో, ప్రత్యేకంగా గురుపౌర్ణమిరోజున ఈ భక్తుల సంఖ్య లక్షల్లోనే ఉంటుందంటే అతిశయోక్తి కాదు. అంతటి పవిత్రక్షేత్రంలో విషాద ఘటన జరిగింది. తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయ గిరి ప్రదక్షిణ మార్గంలో ఉన్న పిళ్లైయార్ గుహ.. దానినే మోక్షమార్గంగా కూడా చెప్తారు. ఆ గుహ గుండా ఎంతటి లావుగా ఉన్నవారైనా ఈజీగా బయటకు వచ్చేస్తారని నమ్మకం. అమ్మ గర్భంలోనుంచి బయటకు వచ్చేందుకు ఎన్ని ఇబ్బందులు పడ్డామో.. ఈ గుహ కూడా అలానే ఉంటుందని చెప్తుంటారు. ఈ మోక్షమార్గంలో చిక్కుకుని ఆంధ్రాకు చెందిన ఓ భక్తుడు మరణించాడు.స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన మణికుమార్ (36) తన కుటుంబ సభ్యులతో అరుణాచలేశ్వరాలయానికి వెళ్లారు. స్వామివారిని దర్శించుకుని గిరి ప్రదక్షిణ మొదలు పెట్టారు. దారిలో ఇదుక్కి పిళ్లైయార్ (మోక్షమార్గం) వద్ద భక్తులు చిన్న గుహలో దూరి బయటకు వస్తుంటారు. కష్టాలు తీరుతాయని నమ్ముతారు. మణికుమార్ కూడా ఆ గుహలో నుంచి బయటికి వచ్చేందుకు ప్రయత్నించగా లోపలే చిక్కుకున్నారు. ఊబకాయం కారణంగా ఊపిరాడక స్పృహ కోల్పోయారు. వెంటనే తోటి భక్తులు అతికష్టంమీద బయటకు తీయగా.. అంబులెన్సులో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కానీ.. అప్పటికే మణికుమార్ చనిపోయాడని వైద్యులు తెలిపారు. దీంతో దైవదర్శనానికి వచ్చి తమ కొడుకుని కోల్పోయామని తల్లిదండ్రులు రోదించారు. ఘటనపై తిరువణ్ణామలై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ఖరీఫ్ సీజన్ పెండింగ్ బీమా బకాయిల విడుదలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

**విశ్వంభర, ఢిల్లీ:** కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో చర్చలు ఫలించినట్లు ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. 2024 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పంటల బీమా పెండింగ్ బకాయిల విడుదలకు మార్గం సుగమమైందన్నారు. గత ప్రభుత్వం హయాంలో పెండింగ్‌లో ఉన్న 2024-ఖరీఫ్ పంటల బీమా బకాయిలు విడుదల చేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ వైఫల్యాలతో వ్యవసాయ శాఖలో పేరుకుపోయిన సమస్యలకు కూటమి ప్రభుత్వం పరిష్కారం చూపుతోందని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. రైతులకు అందాల్సిన ప్రయోజనాలు సకాలంలో అందేలా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. రైతుల పక్షాన స్పందించి బీమా బకాయిల విడుదలకు సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## అలాంటి ప్రయత్నాలను వైసీపీ నేతలు మానుకోవాలి: మంత్రి మండిపల్లి



**విశ్వంభర, అమరావతి:** వైసీపీ నేతలకు ఆరోపణలు చేయడం తప్ప ఆధారాలు చూపించే అలవాటు లేదని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఎద్దేవా చేశారు. మంత్రి నారా లోకేశ్‌పై ఆ పార్టీ నేతలు చేసిన ఆరోపణలపై మంత్రి తీవ్రంగా స్పందించారు. డీఎస్సీపై సవాల్ విసిరితే మాజీ సీఎం జగన్ ఎందుకు ముందుకు రాలేదని ప్రశ్నించారు. డీఎస్సీపై ఎలాంటి అనుమానాలున్నా చట్టబద్ధంగా విచారణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారాలతో యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను వైసీపీ మానుకోవాలని హితవు పలికారు. నిరాధార ఆరోపణలతో ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయడమే వైకాపా నేతలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు కనిపిస్తోందని మండిపడ్డారు. తప్పుడు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు వైకాపా ప్రయత్నిస్తోందని.. రాష్ట్ర ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.

## ఆగస్టు 17 నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టులో వాణిజ్య కార్యకలాపాలు



**విశ్వంభర, విశాఖపట్నం (వన్‌టౌన్):** భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి వాణిజ్య కార్యకలాపాలు ఆగస్టు 17 నుంచి ప్రారంభమయ్యే అవకాశముందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. శనివారం విశాఖ పట్నం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎయిర్‌పోర్టు ప్రారంభించడానికి ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆగస్టు 1న రానున్నారని, ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికి, భారీ సభ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సభకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి సుమారు 2 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉందని చెప్పారు.

## సాంకేతికత ఆధారిత పరిశుభ్రత వ్యవస్థే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి నారాయణ



**విశ్వంభర, ఏపీ బ్యూరో:** మాన్యువల్ స్కావెంజింగ్ పూర్తిగా అంతమై సాంకేతికత ఆధారిత పరిశుభ్రత వ్యవస్థను అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నారాయణ అన్నారు. నెల్లూరులో జాతీయ సఫాయి కర్మచారి అభివృద్ధి కార్పొరేషన్ రుణాలతో కొనుగోలు చేసిన 6 వాహనాలను మంత్రి ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం 50శాతం సబ్సిడీతో అందించిన వాహనాలను 22 మంది సఫాయి కార్మికులకు అందజేశారు. అనంతరం నగరంలో జరుగుతున్న కాలువల నిర్మాణ పనులను పరిశీలించారు. కాలువలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పూడికతీత పనులు మాన్యువల్‌గా కాకుండా యంత్రాల ద్వారా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

## ఒకే కుటుంబంలో ఐదుగురికి తల్లికి వందనం



**విశ్వంభర, నెల్లూరు ప్రతినిధి:** కోవూరు నియోజకవర్గం బుచ్చిరెడ్డి పాలెంకి చెందిన సర్ఫున్నిసాకు అయిదుగురు పిల్లలు. వారందరూ బుచ్చిరెడ్డి పాలెంలోని ఉర్దూ స్కూల్‌లో చదువుతున్నారు. ఆ ఐదుగురు పిల్లలకు సంబంధించి తల్లికి వందనం పథకం ద్వారా ఒక్కొక్కరికి రూ.13 వేలు చొప్పున ఐదుగురికి కలిపి రూ.65 వేలు వారి తల్లి సర్ఫున్నిసా ఖాతాలో డబ్బులు పడ్డాయి. ఈ సందర్భంగా సర్ఫున్నిసా నెల్లూరులోని విపిఆర్ కార్యాలయంకు తమ పిల్లలతో వెళ్లి కోవూరు శాసనసభ్యురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్కి ధన్యవాదాలు తెలిపారు.

# 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యంలో అలసత్వం వద్దు

### పచ్చదనం తగ్గిన చోట పునరుద్ధరణ చర్యలు: పవన్



**విశ్వంభర, ఏపీ బ్యూరో:** రాష్ట్రవ్యాప్తంగా సీడ్ బాల్స్ పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. సీడ్ బాల్స్ పంపిణీ, వెదజల్లే కార్యక్రమం, డ్రోన్ సాంకేతికత వినియోగంపై అటవీశాఖ ఉన్నతాధికారులతో మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పవన్ సమీక్షించారు. అడవులు క్షీణించిన ప్రాంతాల్లో సీడ్ బాల్స్ జారవిడిచే కార్యక్రమాన్ని వేగవంతం చేసేందుకు మరిన్ని డ్రోన్ల సహాయం తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో అటవీ పునరుద్ధరణ, 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యాల్లో సీడ్ బాల్స్ పంపిణీ కార్యక్రమం అత్యంత కీలక ప్రక్రియ అని తెలిపారు. ఎల్?నినో వల్ల ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు సీడ్ బాల్స్ వెదజల్లే ప్రక్రియకు ఆటంకం ఉంటుందని పవన్ కల్యాణ్ తెలిపారు. వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో మాత్రం జాప్యానికి తావు లేకుండా సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని కొనసాగించాలి. అవసరం అయితే డ్రోన్ల సంఖ్య పెంచాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో పచ్చదనం తగ్గిన చోట కచ్చితంగా అడవి పునరుద్ధరణ మొదలవ్వాలని స్పష్టం చేశారు. సీడ్ బాల్స్ వెదజల్లిన ప్రాంతాల్లో మొలకలు వస్తే, వాటిని సంరక్షించడం కోసం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. 50 శాతం గ్రీన్ కవర్ సాధించాలన్న కూటమి ప్రభుత్వ లక్ష్య సాధనలో ఎవరూ అలక్ష్యంగా ఉండవద్దని స్పష్టం చేశారు. 3 కోట్లకు పైగా సీడ్ బాల్స్ సిద్ధం చేయగా, 63 లక్షలకు పైగా సీడ్ బాల్స్ దాదాపు 6,500 హెక్టార్ల విస్తీర్ణంలో వెదజల్లినట్లు అధికారులు తెలిపారు. 6 వేల హెక్టార్ల పరిధిలో 59 లక్షల సీడ్ బాల్స్ వెదజల్లినట్టు, సుమారు వెయ్యి ఎకరాల్లో డ్రోన్స్ ద్వారా సీడ్ బాల్స్ జార విడిచినట్లు తెలిపారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల ఆధారంగా చింతూరు, పీటీ ఆత్మకూరు, గిద్దలూరు, మార్కాపురం, వైఎస్సార్ కడప డివిజన్లలో డ్రోన్ల ద్వారా సీడ్ బాల్స్ జారవిడిచే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్టు వివరించారు. మానవ వనరులు చేరుకోవడం కష్టంగా ఉండే అటవీ ప్రాంతాలను డ్రోన్ ద్వారా చేరుకోవడం సులభం అవుతుందని చెప్పారు. మరోవైపు రాష్ట్రంలో ఎర్రచందనం అక్రమ రవాణాను నిర్మూలించే లక్ష్యంతో అటవీశాఖ పని చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారుల్ని ఆదేశించారు. డ్రోన్ పరిజ్ఞానం, అత్యాధునిక సాంకేతికత వినియోగించుకుంటూ నిఘా పటిష్ఠం చేయాలని సూచించారు. గత రెండేళ్లలో ఎర్రచందనం అక్రమ రవాణాపై 506 కేసులు నమోదు చేసి.1239 మందిని అరెస్ట్ చేశామని అధికారులు వివరించారు. నిందితుల నుంచి 372 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 12 మంది ప్రధాన స్మగ్లర్లపై పీడీ చట్టం కింద చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. గుజరాత్, ఢిల్లీ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో అక్రమంగా నిల్వ చేసిన ఎర్రచందనాన్ని గుర్తించి ఆయా రాష్ట్రాల పోలీసు, అటవీ శాఖల సమన్వయంతో ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించమన్నారు. 35.6 మెట్రిక్ టన్నుల ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వివరించారు. గతంలో ఇటువంటి అంతర్రాష్ట్ర ఆపరేషన్లు నిర్వహించలేదన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో 3 శాతం లోపే శిక్షలు పడేవని ఇప్పుడు 95 శాతం కేసుల్లో నిందితులకు కోర్టులు శిక్షలు విధిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్?కు మాత్రమే ప్రత్యేకమైన ఎర్రచందనం కాపాడుకోవడం మనందరి బాధ్యతని పవన్ పేర్కొన్నారు. స్మగ్లింగ్ ముఠాల వెనుక ఉన్న కీలక వ్యక్తులు, ఫైనాన్షియర్స్ పైనా దృష్టి సారించాలన్నారు. దేశంలో ఎక్కడ ఎర్రచందనం అక్రమ నిల్వలు ఉన్నా ఆయా రాష్ట్రాల అధికారులతో సమన్వయం చేసుకుని వాటిని స్వాధీనం చేసుకోవాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.

# వెనుకబడిన ప్రాంతానికి ఎవరూ రారు అనుకున్నారా?

### ఎందుకు ఇలా ఉన్నారు..అధికారులపై సీఎం ఆగ్రహం



**విశ్వంభర, ఏపీ బ్యూరో:** కర్నూలు జిల్లా ఆస్పరి సభలో ఆయా శాఖల పరిధిలో పనితీరు సరిగా లేని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు చురకలు అంటించారు. సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా బహిరంగ సభలో సీఎం మాట్లాడిన తర్వాత కర్నూలు జిల్లా అధికారులతో శాఖల వారీగా వేదికపైకి పిలిచి వారి పనితీరుపై అక్కడికక్కడే నిలదీశారు. ఆలూరు నియోజకవర్గం అధికారుల పనితీరు 90 శాతం సరిగాలేదని మండిపడిన సీఎం చంద్రబాబు, వెనకబడిన ప్రాంతానికి ఎవరూ రారు అనుకున్నారా? ఎందుకు ఇలా ఉన్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోకపోతే, మార్చాల్సి వస్తుందని అధికారులకు హెచ్చరించారు. ఆలూరులో అన్నా క్యాంటీన్ బాగాలేదని సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. చప్పట్లు కొట్టి అన్న క్యాంటీన్ బాగాలేదని సీఎంకు ప్రజలు సభలోనే ఫిర్యాదు చేశారు. ఆలూరు నియోజకవర్గంలో తాగునీళ్లు సరిగా ఇవ్వడం లేదని అధికారులు ప్రశ్నించిన సీఎం చంద్రబాబు, దీనిపై పెద్ద ఎత్తున ప్రజలు చప్పట్లు కొట్టి నీళ్లు రావడం లేదని స్పందించడంతో శాశ్వత పరిష్కారం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆర్ఓఆర్, భూముల రీసెర్వే పనులు ఎందుకు సక్రమంగా చేయడం లేదని డీఆర్ఓ నారాయణమ్మను మందలించిన సీఎం, గంజాయి, మహిళలపై దాడుల పై తీవ్రంగా స్పందించాలని ఎస్పీకి సూచించారు.ఫైర్ డిపార్టుమెంటు 79 శాతం మైనస్లో ఉందని సీఎం తీవ్రంగా హెచ్చరించారు. ఆలూరుకు బస్సులు సక్రమంగా రావడం లేదని పెద్ద ఎత్తున సీఎంకి సభలో ప్రజలు పిర్యాదు చేయగా, నెల రోజు లోపల మెరుగు పడకపోతే చర్యలు తప్పవని ఆర్టీసీ అధికారులను హెచ్చరించారు. విద్యుత్తు, చేనేత రంగం బాగా పనిచేస్తుందని అభినందించిన ముఖ్యమంత్రి, ఇప్పటివరకు 50 నియోజక వర్గాల్లో అధికారులు, నాయకులతో వేరువేరుగా సమీక్షలు నిర్వహించి పాలన సమీక్షిస్తున్నానని చెప్పారు. అయినా కొందరు అధికారులు తీరులో మార్పు రావడం లేదన్న సీఎం, టెక్నాలజీ ఉపయోగించి ఎప్పటికప్పుడు ఆయా శాఖల పనితీరును సమీక్షిస్తున్నమనీ వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న వేళ ఈ ఏడాది రైతులెవరూ వరి పంట వేయవద్దని సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఆరుతడి పంటల సాగుతో ఉన్న నీటిని చాలా జాగ్రత్తగా వాడుకుందామని పిలుపునిచ్చారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం, సీమ సాగునీటి ప్రాజెక్టులకు కేవలం రూ.2వేల కోట్లే ఖర్చు చేస్తే 2 ఏళ్లలోనే కూటమి రూ.12వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. కడప జిల్లాలోని రాయలసీమ ఉక్కు పరిశ్రమను 2028 మార్చిలోగా ప్రారంభిస్తామని సీఎం మరోసారి స్పష్టం చేశారు. లక్ష కోట్లతో ఆగస్టులో శ్రీకారం చుట్టే ఉద్యాన హబ్ పథకం సీమ ముఖచిత్రాన్నే మారుస్తుందని చెప్పారు. సీమ సాగునీటి ప్రాజెక్టులకు వైఎస్సార్సీపీ చేసింది శూన్యమని విమర్శించారు. వేదవతి ప్రాజెక్టు పూర్తిచేసి హంద్రీనీవా నీళ్లు ఆలూరు ప్రజలకు అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. విధ్వంస రాజకీయాల పట్ల అప్రమత్తంగా ఉంటూ మంచి చేసే పార్టీ ఏదో గమనించాలని ప్రజలకు సూచించారు.

# ఎల్‌నినో క్లిష్ట సమయం.. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలి: నిమ్మల



**విశ్వంభర, అమరావతి:** రైతుల ప్రయోజనాలను రక్షించేందుకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పని చేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సూచించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా సీలేరు జలాలను గోదావరి డెల్టాలో ఖరీఫ్ అవసరాల కోసం వినియోగిస్తున్నామని తెలిపారు. పుష్కర కాలువ, ఏలేరు వ్యవస్థ ద్వారా వచ్చే నీటిని తాగునీటి అవసరాలకు, ఆరుతడి పంటలకే వినియోగించాలని సూచించారు. పుష్కర కాలువ, ఏలేరు ద్వారా తూర్పుగోదావరి, కాకినాడ, విశాఖ జిల్లాల్లో సుమారు 55 లక్షలు మంది ప్రజలకు తాగునీరు అందించాల్సి ఉందని వివరించారు. గోదావరి, కృష్ణా డెల్టాల ఇరిగేషన్ సీఈ, ఎస్ఈలతో మంత్రి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. గోదావరి డెల్టా ఆయకట్టు రైతులు సాగు కొనసాగించేందుకు, అన్ని చర్యలూ తీసుకోవాలని చంద్రబాబు సూచించారన్నారు. డెల్టాలో మెరక ప్రాంత రైతులు ఆరుతుడి పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా, శాస్త్రీయ పద్ధతిలో వినియోగించి ప్రతి నీటి బొట్టునూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గోదావరి సెంట్రల్, ఈస్టర్న్, వెస్టర్న్ డెల్టాల ప్రాధాన కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా వీడ్ తొలగించాలన్నారు. ఖరీఫ్ సాగు పూర్తయ్యే వరకు ఓఅండ్ఎం పనులు కొనసాగిస్తూ, రైతులు, సాగునీటి సంఘాల సహకారంతో ఆయకట్టుకు సాగునీటిని అందించాలని సూచించారు. పోలవరం కుడి ప్రధాన కాలువ ద్వారా వచ్చే నీరు దుర్వినియోగం కాకుండా, కృష్ణా డెల్టాకు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గోదావరి, కృష్ణా డెల్టాల్లోని 10 జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డ్ మీటింగ్‌లు నిర్వహించి ప్రస్తుత పరిస్దితులపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎల్‌నినో క్లిష్ట సమయంలో ఇరిగేషన్ శాఖలో అన్ని స్థాయిల అధికారులు అందుబాటులో ఉండేలా సెలవులు రద్దు చేస్తున్నామన్నారు. కృష్ణా డెల్టా పరిధిలో నాగార్జున సాగర్ రిజర్వాయర్ నిండకుండా వరిసాగు చేస్తే భవిష్యత్ లో పంట మొత్తం నష్టపోతుందన్నారు. పట్టిసీమ నుంచి వచ్చే నీటిని కేవలం తాగు నీటి అవసరాలకు, ఆరుతడి పంటలకు మాత్రమే వినియోగించాలన్నారు. నాగార్జున సాగర్‌కు ఈ సీజన్‌లో నీళ్లు రాకపోతే 2027 జూన్ వరకు పులిచింతల, పట్టిసీమ నీటిని తాగు నీటికే భద్రపరచుకోవాలని మంత్రి ఆదేశించారు.

# రాష్ట్రంలో మరో 10 కరోనా కేసులు.. మొత్తం 49కు చేరిక

**విశ్వంభర, ఏపీ బ్యూరో:** రాష్ట్రంలో శనివారం మరో 10 కొత్త కరోనా కేసులు నమోదయ్యాయి. వీటితో రాష్ట్రంలో మొత్తం కోవిడ్ కేసుల సంఖ్య 49కు చేరింది. గుంటూరు జిల్లాలో మూడు, ఎన్టీఆర్ జిల్లాలో రెండు, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణా, తిరుపతి, విశాఖపట్నం జిల్లాల్లో ఒక్కో కేసు నమోదైనట్లు వైద్యారోగ్య శాఖ వెల్లడించింది. ఇప్పటివరకు రాష్ట్రంలో 302 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా, నమోదైన మొత్తం కేసుల్లో తూర్పుగోదావరి జిల్లాలో అత్యధికంగా 11 కేసులు ఉన్నాయి. గుంటూరులో 9, వైఎస్సార్ కడపలో 8, విశాఖపట్నంలో 5, ఎన్టీఆర్ జిల్లాలో 3 కేసులు నమోదయ్యాయి. కాకినాడ, ఏలూరు, బాపట్ల జిల్లాల్లో రెండేసి కేసులు నమోదుకాగా, మరికొన్ని జిల్లాల్లో ఒక్కో కేసు చొప్పున గుర్తించారు. ప్రస్తుతం కరోనా బాధితుల్లో 24 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా, 16 మంది ఇంటి వద్దే వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఇప్పటివరకు ఐదుగురు కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. వీరిలో వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన ముగ్గురు, గుంటూరు, ఏలూరు జిల్లాలకు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు నలుగురు మృతి చెందగా, వారిలో ముగ్గురు వైఎస్సార్ కడప జిల్లాకు, ఒకరు కాకినాడ జిల్లాకు చెందినవారు. కొత్త కేసులు నమోదవుతున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా వ్యాధి నిఘాను వైద్యారోగ్య శాఖ మరింత పటిష్ఠం చేసింది. పాజిటివ్‌గా తేలిన వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడంతో పాటు, వారి సన్నిహితులను గుర్తించి పరీక్షలు నిర్వహించే చర్యలను జిల్లా సత్వర స్పందన బృందాలు చేపట్టాయి. అనుమానితులకు ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన కిట్లు అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. అలాగే ద్వితీయ, తృతీయ స్థాయి ప్రభుత్వ ఆసుపత్రుల్లో కరోనా బాధితుల కోసం ప్రత్యేక పడకలు, మందులు, రక్షణ పరికరాలు, పరీక్ష కిట్లు సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు. ఈ నెల 10న అన్ని జిల్లాలను అప్రమత్తం చేసిన వైద్యారోగ్య శాఖ, 18న జిల్లా వ్యాధి నిఘా బృందాలతో సమీక్ష నిర్వహించి కేసుల గుర్తింపు, పరీక్షలు, బాధితుల పర్యవేక్షణ, చికిత్స ఏర్పాట్లపై నిరంతర నిఘా కొనసాగించాలని అధికారులను ఆదేశించింది.



## విజయనగరం నుంచి భోగాపురం వరకు కార్ల ర్యాలీ

**విశ్వంభర, భోగాపురం:** విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి మద్దతుగా విజయనగరం పట్టణం నుంచి భోగాపురం వరకు కార్లతో ర్యాలీ నిర్వహించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు కళావెంకటరావు, లోకం మాధవి, పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భోగాపురం విమానాశ్రయ ప్రాంగణంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఈ విమానాశ్రయం ఎంతో దోహదపడుతుందని విజయనగరం జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి అన్నారు. ఈ ప్రాంతంలో అనేక పరిశ్రమలు నెలకొల్పేందుకు ఎంతో మంది పారిశ్రామిక వేత్తలు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమలు, కంపెనీలు ఈ ప్రాంతంలో ఏర్పాటవుతాయన్నారు. ఆగస్టు 1న ప్రధాని నరేంద్ర మోదీ భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రారంభించనున్న సంగతి తెలిసిందే. 17 నుంచి ప్రయాణికులు రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆ తర్వాత క్రమంగా ఇతర సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.

## అందుకే.. జపాలి వద్ద కుళాయిల్లో తెల్లని నీరు: టీటీడీ వివరణ



**విశ్వంభర, తిరుమల:** తిరుమల-పాపవినాశనం రోడ్డులోని జపాలి తీర్థం శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న తాగునీటి కుళాయిల్లో తెల్లటి నీరు వస్తోందంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో తితిదే వివరణ ఇచ్చింది. వీడియోలో కనిపించినట్లుగా కుళాయిలో నుంచి వచ్చిన నీరు కొన్ని సెకన్లలోనే సహజ స్థితికి చేరుకుని పారదర్శకంగా మారుతోందని తెలిపింది. అధిక ఒత్తిడి కారణంగా నీటిలో గాలి బుడగలు ఏర్పడటంతో నీరు తాత్కాలికంగా తెల్లగా కనిపిస్తోందని వెల్లడించింది. ఈ నీటిని తిరుమలలోని తితిదే ఫుడ్ అండ్ వాటర్ అనాలసిస్ ల్యాబ్‌లో పరీక్షించగా, నీరు పూర్తిగా స్వచ్ఛమైనదేనని నిర్ధరణ అయినట్లు తెలిపింది. నీటిలో ఎలాంటి దుర్వాసన, అడుగున అవశేషాలు (సెడిమెంట్) లేదా ఇతర మలినాలు లేవని నిపుణులు వెల్లడించారని స్పష్టం చేసింది. సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్న అసత్య సమాచారాన్ని నమ్మవద్దని భక్తులకు విజ్ఞప్తి చేసింది.

## ఎల్‌నినో ఎఫెక్ట్.. 71శాతం తక్కువ వర్షపాతం: ఈఎన్‌సీ నరసింహమూర్తి



**విశ్వంభర, రాజమహేంద్రవరం:** ఎల్‌నినో ప్రభావంతో గోదావరి జిల్లాల్లో 71శాతం తక్కువ వర్షపాతం నమోదైందని ఇరిగేషన్ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి అన్నారు. గత 70 ఏళ్లలో గోదావరి పరివాహక ప్రాంతంలో లేని నీటి కొరత ఇప్పుడు ఏర్పడిందన్నారు. " గోదావరి డెల్టాకు ఇప్పటి వరకు 50 టీఎంసీల నీటిని అందించాం. ప్రస్తుతం 14,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నాం. ఖరీఫ్ పంటకు మరో 80 టీఎంసీల నీరు అవసరం. కానీ, వర్షాభావ పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయి. గోదావరిలో ఇన్‌ఫ్లో బాగా తగ్గిపోయింది. తాగునీటి అవసరాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాం. రైతులు సహకరించాలి. ఆరుతడి పంటలు వేసుకోవాలి. పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి కృష్ణా డెల్టాకు 70 వేల క్యూసెక్కులు పంపింగ్ చేస్తున్నాం. కృష్ణా డెల్టాకు నీటి కొరతపై ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు కార్యాచరణ చేపడుతున్నాం" అని నరసింహమూర్తి తెలిపారు.

## ఎర్రచందనం స్మగ్లింగ్‌కు సహకరిస్తే ఉపేక్షించం: పవన్

**విశ్వంభర, అమరావతి:** ఎర్రచందనం అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తే ఎవరినైనా ఉపేక్షించేది లేదని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరించారు. స్మగ్లింగ్‌ను అడ్డుకునేందుకు కఠినమైన ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. సీడ్‌బాల్స్ పంపిణీపై అటవీశాఖ అధికారులతో శనివారం పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. వెయ్యి ఎకరాల్లో డ్రోన్ల సాయంతో సీడ్ బాల్స్ విసురుతామన్నారు. అటవీ విస్తీర్ణం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎర్ర చందనం అక్రమ రవాణాను ఏ విధంగా అరికడుతున్నదీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తానని తెలిపారు. కడప జిల్లాలో రూ.1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న ఘటనపై అధికారులతో మాట్లాడారు. ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లతోపాటు వారికి సహకరిస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌ను అరెస్టు చేసినట్లు అధికారులు పవన్‌కు తెలియజేశారు.

## స్మార్ట్‌ఫోన్లు మరింత భారం..
## ప్రాసెసర్ ధరలు పెంచనున్న క్వాల్‌కామ్!

**విశ్వంభర, స్పోర్ట్స్:** ప్రముఖ కంపెనీలు ఏఐపై భారీగా పెట్టుబడులు పెడుతుండటంతో సెమికండక్టర్ విభాగానికి డిమాండ్ పెరుగుతోంది. అదే స్థాయిలో మెమొరీ చిప్‌ల కొరత, విడిభాగాల తయారీ ఖర్చు తడిసి మోపెడవుతోంది. దీంతో ప్రపంచ టెక్ కంపెనీలు తీవ్ర ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నాయి. యాపిల్, శాంసంగ్ వంటి పలు కంపెనీలు ఇప్పటికే స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్ ధరలను పెంచేశాయి. ప్రపంచంలోనే నంబర్‌వన్ చిప్ తయారీ సంస్థ తైవాన్ సెమీకండక్టర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ (టీఎస్ఎంసీ) కూడా చిప్ ధరలను పెంచేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. దీనికి ప్రధాన కస్టమర్‌గా ఉన్న శాన్‌డియోగో కంపెనీ క్వాల్‌కామ్ కూడా తన ప్రాసెసర్ ధరలను రెండంకెల శాతానికి పెంచుతుండటం గమనార్హం ! దీంతో స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ల ధరలు మరింత ప్రియమయ్యే అవకాశం ఉంది.వ్యయ ధరల పెరుగుదల కారణంగా క్వాల్‌కామ్ తన ప్రాసెసర్ ధరలను పెంచనున్నట్లు కొన్ని అంతర్జాతీయ నివేదికలు పేర్కొన్నాయి. సెప్టెంబర్ 1 నుంచి ఈ పెంపు అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. ఖర్చుల భారాన్ని ఇకపై మోయలేమని కంపెనీ పేర్కొన్నట్లు సమాచారం. ప్రత్యామ్నాయ మార్గాలను కూడా అన్వేషిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై క్వాల్‌కామ్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఇప్పటికే స్మార్ట్‌ఫోన్ ధరలు మండిపోతున్నాయి. క్రమంగా టీఎస్ఎంసీ, క్వాల్‌కామ్ కూడా తమ ఉత్పత్తుల ధరలను పెంచితే ఫోన్లు, ల్యాప్‌టాప్ ధరలు మరింత భారంగా మారనున్నాయి. కాగా, శాంసంగ్, షావోమి, వన్‌ప్లస్, మోటోరోలా వంటి పలు కంపెనీలకు క్వాల్‌కామ్ తన ఉత్పత్తులను సరఫరా చేస్తోంది.

## దేశం గర్వించేలా ఝుండూ కుమార్ విజయం: ప్రధాని మోడీ



**విశ్వంభర, స్పోర్ట్స్:** కామన్వెల్త్ గేమ్స్-2026 లో భారత్‌కు తొలి పతకం అందించిన పారా అథ్లెట్ ఝుండూ కుమార్‌ను ప్రధాని మోడీ ప్రశంసించారు. హెవీవెయిట్ పారా పవర్‌లిఫ్టింగ్‌లో కాంస్య పతకం గెలిచి యావత్ దేశం గర్వించేలా నిలిచాడని కొనియాడారు. అతడి విజయం అపారమైన శక్తికి, సంకల్పానికి నిదర్శనమన్నారు. ఎన్నో ఏళ్ల కఠిన సాధనకు ఫలితమని.. ప్రతి సవాల్‌ను అధిగమించి అంతర్జాతీయ వేదికపై రాణించాడని అభినందించారు. ఝుండూ కుమార్ విజయం ఎంతోమంది భారతీయులకు స్ఫూర్తిగా నిలుస్తోందని ప్రధాని మోడీ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. గ్లాస్గోలో జరిగిన హెవీవెయిట్ పారా పవర్?లిఫ్టింగ్ ఫైనల్లో భారత పారా అథ్లెట్ ఝుండూ కుమార్ 190 కిలోల బరువును ఎత్తి మూడో స్థానంలో నిలిచాడు. దీంతో కామన్వెల్త్ గేమ్స్ పతకాల పట్టికలో భారత్ బోణీ కొట్టింది.

## కామన్వెల్త్ చరిత్రలో కొత్త రికార్డు.. ఏకంగా 19 పతకాలు!



**విశ్వంభర, స్పోర్ట్స్:** దక్షిణాఫ్రికా స్టార్ ఈతగాడు చాడ్ లె క్లోస్ కామన్వెల్త్ గేమ్స్ చరిత్రలో కొత్త రికార్డు సృష్టించాడు. పురుషుల 4ఐ100 మీటర్ల ఫ్రీస్టైల్ రిలేలో కాంస్య పతకం గెలిచి.. ఈ గేమ్స్‌లో అత్యధిక మెడల్స్ సాధించిన పురుష అథ్లెట్‌గా నిలిచాడు. ఈ కాంస్యంతో అతడి ఖాతాలో మొత్తం 19 కామన్వెల్త్ పతకాలు చేరాయి. దీంతో 18 పతకాలతో అగ్రస్థానంలో ఉన్న ఆస్ట్రేలియా షూటర్ ఫిల్ ఆడమ్స్, ఇంగ్లాండ్ షూటర్ మిక్ గాల్ట్‌ల రికార్డును అధిగమించాడు. ఇప్పటి వరకు లె క్లోస్ ఏడు స్వర్ణాలు, నాలుగు రజతాలు, ఎనిమిది కాంస్యాలతో మొత్తం 19 పతకాలు సాధించాడు. ఈ విజయంపై 34 ఏళ్ల లె క్లోస్ స్పందిస్తూ "కాంస్యం వచ్చిందని బాధపడను. స్వర్ణం రాలేదని నిరాశగా ఉంది. ఈ రికార్డు నాకు చాలా విలువైనది" అని చెప్పాడు. క్లోస్ పతకాల వేట ఇంకా ముగియలేదు. అతడు 50 మీటర్లు, 100 మీటర్ల బటర్‌ఫ్లై విభాగాల్లో కూడా పోటీపడనున్నాడు. దీంతో పతకాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఒలింపిక్స్, ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో కూడా లె క్లోస్ అద్భుత విజయాలు సాధించాడు. ఇప్పటివరకు ఒలింపిక్స్‌లో ఒక స్వర్ణం సహా నాలుగు పతకాలు గెలిచాడు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో 16 టైటిళ్లు సొంతం చేసుకున్నాడు.

## పాక్‌ను చిత్తు చేసిన భారత్

**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఒమాన్‌లోని మస్కట్ వేదికగా జరుగుతున్న ఎఫ్ఐహెచ్ యూత్ హాకీ ఆసియా ఛాంపియన్ షిప్‌లో భారత సబ్ జూనియర్ పురుషుల జట్టు అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో భారత్ 7 -3 తేడాతో ఘన విజయం సాధించి టోర్నీలో తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. మ్యాచ్ ప్రారంభం నుంచే పూర్తి దూకుడు ప్రదర్శించిన భారత కుర్రాళ్లు, ప్రథమార్ధంలోనే పాకిస్థాన్‌పై పూర్తి నియంత్రణ సాధించారు. రోమిత్ పాల్ (8వ నిమిషం), కరణ్ గౌతమ్ (10వ నిమిషం), కెప్టెన్ కేతన్ కుష్వాహా (10వ నిమిషం) సాధించిన గోల్స్ తో ఫస్ట్ హాఫ్ ముగిసేసరికి భారత్ 3- 0తో స్పష్టమైన ఆధిక్యంలో నిలిచింది. ద్వితీయార్థం ప్రారంభంలోనే ప్రహ్లాద్ రాజ్‌భర్ (12వ నిమిషం) మరో గోల్ కొట్టడంతో భారత ఆధిక్యం 4- 0కి పెరిగింది. ఆ తర్వాత పాకిస్థాన్ ఆటగాళ్లు ముహమ్మద్ ఉస్మాన్, కెప్టెన్ అదీల్ గోల్స్ చేసి పుంజుకునేందుకు ప్రయత్నించినప్పటికీ భారత అటాకింగ్‌ను అడ్డుకోలేకపోయారు. షారూఖ్ అలీ (16వ నిమిషం), రాహుల్ యాదవ్ (18వ నిమిషం)లతో పాటు చివరి నిమిషంలో కెప్టెన్ కేతన్ కుష్వాహా (20వ నిమిషం) మరో గోల్ సాధించి 7- 3తో భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. ఇదే రోజు జరిగిన మరొక మ్యాచ్‌లో ఆతిథ్య ఒమాన్ జట్టును 10-1 తేడాతో ఊచకోత కోసిన భారత పురుషుల జట్టు, వరుస విజయాలతో ఆసియా ఛాంపియన్‌షిప్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

# వైభవ్ సూర్యవంశీ ఇక బౌలర్‌గా కూడా..!



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని భవిష్యత్తులో బౌలర్‌గా కూడా తీర్చిదిద్దే ఆలోచనలో టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ ఉన్నట్లు తెలుస్తోంది. జింబాబ్వేతో రెండో టీ20కి ముందు మీడియాతో మాట్లాడిన బౌలింగ్ కోచ్ సునీల్ జోషి ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం వైభవ్ బ్యాటింగ్‌పైనే పూర్తి దృష్టి పెట్టామని, అతడు అసాధారణ ప్రతిభ కనబరుస్తున్నాడని కొనియాడారు. తొలి టీ20లో 18 బంతుల్లో 50 పరుగులు చేసి అంతర్జాతీయ క్రికెట్‌లో ఈ ఘనత సాధించిన అత్యంత పిన్న వయస్కుడిగా నిలిచాడని పేర్కొన్నారు. వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్‌తో పాటు అతని బౌలింగ్ నైపుణ్యాలపైనా ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు జోషి వెల్లడించారు. బౌలింగ్‌కు అవకాశం దొరికినప్పుడల్లా బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో అతనితో కలిసి పని చేస్తానన్నారు. బౌలింగ్‌లో మంచి పురోగతి కనిపిస్తే.. వెంటనే దానిపై దృష్టి పెడతామని తెలిపారు.మరోవైపు.. సూర్యాంశ్ షెడ్గేను హార్దిక్ పాండ్యా , శివమ్ దుబెతో పోల్చడం సరికాదన్నారు. హార్దిక్, శివమ్ ఇప్పటికే జట్టులో తమ స్థానాలను స్థిరపరుచుకున్నారని, సూర్యాంశ్ ఇప్పుడే ఎదుగుతున్న యువ ఆల్‌రౌండర్ అని పేర్కొన్నారు. టీ20 ఫార్మాట్‌కు అనుగుణంగా సూర్యాంశ్‌ను తీర్చిదిద్దేందుకు జట్టు పూర్తి మద్దతు ఇస్తుందని వెల్లడించారు. అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హర్ష్ దుబె వంటి ఆటగాళు కూడా బౌలింగ్ చేయగల సామర్థ్యం కలిగిన వారేనని, టీ20 క్రికెట్‌లో అదనపు బౌలింగ్ ఆప్షన్లు ఉండటం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని జోషి అభిప్రాయపడ్డారు.

# కామన్వెల్త్‌లో భారత్‌కు తొలి పతకం

## పుట్టుకతోనే వైకల్యం కాటేసినా.. దాన్ని ఎదిరించి దేశానికి పతకం అందించిన ఝుండూ కుమార్



**విశ్వంభర, స్పోర్ట్స్:** ఈ ఏడాది కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ పతకాల ఖాతా తెరిచింది. గ్లాస్గోలో జరిగిన హెవీవెయిట్ పారా పవర్?లిఫ్టింగ్ ఫైనల్లో భారత పారా అథ్లెట్ ఝుండూ కుమార్ కాంస్య పతకం సాధించి దేశానికి తొలి పతకాన్ని అందించాడు. 190 కిలోల బరువును ఎత్తిన ఝుండూ 130.9 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. దీంతో కామన్వెల్త్ గేమ్స్ పతకాల పట్టికలో భారత్ బోణీ కొట్టింది.ఫైనల్లో తొలి ప్రయత్నంలో 181 కిలోల బరువును సునాయాసంగా ఎత్తిన ఝుండూ కుమార్, రెండో ప్రయత్నంలో 190 కిలోలను లిఫ్ట్ చేశాడు. ఈ ప్రదర్శనతో కొంతసేపు పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకంపై ఆశలు రేకెత్తించాడు. కానీ, చివరి ప్రయత్నంలో 196 కిలోల బరువును ఎత్తేందుకు ప్రయత్నించి విఫలమవడంతో కాంస్యంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే, అంతర్జాతీయ క్రీడోత్సవంలో పోడియంపైకి చేరి భారత జెండాను రెపరెపలాడించిన ఝుండూ ప్రయాణం.. నల్లేరుపై నడకేం కాదు. పుట్టుకతోనే వైకల్యం కాటేసినా.. దాన్ని ఎదిరించి ఇప్పుడు దేశానికి పతకం అందించాడు.

**ఎవరీ ఝుండూ కుమార్.?**

29 ఏళ్ల ఝుండూ.. బిహార్‌లోని నలంద జిల్లా హర్నౌత్ గ్రామంలో ఓ పేద కుటుంబంలో జన్మించాడు. తండ్రి కూరగాయలమ్ముతూ కుటుంబాన్ని పోషించేవారు. చిన్నతనంలోనే పోలియో బారిన పడిన ఝుండూ.. ఏనాడూ దాన్ని తన ఎదుగుదలకు అడ్డంకిగా చూడలేదు. క్రీడల మీద ఆసక్తితో షాట్‌పుట్, డిస్కస్‌త్రో వంటి ఆటలపై దృష్టిపెట్టాడు. అందులో రాష్ట్ర స్థాయి పతకాలు సాధించాడు. ఈ క్రీడలకు సన్నద్ధమవడం కోసం జిమ్‌లో ట్రైనింగ్ తీసుకున్నాడు. ఆ సమయంలోనే పవర్‌లిఫ్టింగ్‌పై అతడికి ఆసక్తి పెరిగింది. దీంతో పారా పవర్‌లిఫ్టింగ్ కోసం శిక్షణ ప్రారంభించాడు.

**రిక్షా తొక్కి..**

ఆటల పోటీల్లో పాల్గొనడం అంటే చిన్న విషయం కాదు. శిక్షణ ఎంత అవసరమో పోషకాహారం కూడా అంతే ముఖ్యం. అయితే, ఝుండూ ఆర్థిక పరిస్థితి కారణంగా న్యూట్రిషన్ ఫుడ్ తీసుకోవడం సాధ్యపడేది కాదు. దీంతో స్థానిక మార్కెట్లలో కూరగాయాలు విక్రయించేవాడు. ఆ సమయంలో వీల్‌ఛెయిర్ లేకపోవడంతో 20 కిలోమీటర్లు కష్టంగా ప్రయాణించాల్సి వచ్చేది. కొంతకాలానికి ఆ పనిమానేసి తెలిసిన మిత్రుల వద్ద అప్పు చేసి ఈ-రిక్షా కొనుక్కున్నాడు. దాన్ని నడపగా వచ్చిన డబ్బును తన శిక్షణ కోసం వెచ్చించేవాడు.

**205 కిలోలు ఎత్తి..**

ఝుండూ పాల్గొన్న తొలి జాతీయ ఛాంపియన్‌షిప్‌లో విజయం సాధించలేకపోయాడు. అయితేనేం.. పారాలింపిక్ కాంస్య పతక విజేత రాజిందర్ సింగ్ దృష్టిలో పడ్డాడు. అతడి ప్రతిభను గుర్తించిన రాజిందర్.. ఝుండూను గాంధీనగర్‌లోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు తీసుకెళ్లాడు. దీంతో అతడి దశ మారింది. 2025లో జరిగిన జాతీయ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఏకంగా 205 కిలోల బరువులెత్తి.. ఝుండూ సరికొత్త జాతీయ రికార్డ్ సాధించాడు. ఆ తర్వాత కొద్ది నెలలకే ఖేలో ఇండియా పారాగేమ్స్‌లో 206 కిలోలు ఎత్తి మరో రికార్డు సృష్టించాడు. కామన్వెల్త్ గేమ్స్‌కు ముందు గతేడాది జరిగిన బీజింగ్ వరల్డ్ కప్, ఈ ఏడాది ఆరంభంలో జరిగిన ఏషియాన్, ఓషియానా ఛాంపియన్‌షిప్‌ల్లో కాంస్యం సాధించాడు.

# రెండో టీ20లో జింబాబ్వే చిత్తు..

## టీ20 సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత్



**హరారె:** జింబాబ్వేతో మూడు టీ20ల సిరీస్‌ను టీమ్‌ఇండియా 2-0తో కైవసం చేసుకుంది. శనివారం ఏకపక్షంగా సాగిన రెండో టీ20లో భారత్ 90 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు 5 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో జింబాబ్వే 17.5 ఓవర్లలో 129 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ బ్రయాన్ బెనెట్ (32) టాప్ స్కోరర్. మరుమాని (24), ర్యాన్ బర్ల్ (20), బ్రాడ్ ఎవాన్స్ (19), డియోన్ మైయర్స్ (12) పరుగులు చేశారు. భారత బౌలర్లలో అభిషేక్ శర్మ 3, ప్రిన్స్ యాదవ్ 2, యశ్ ఠాకూర్ 2, రవి బిష్ణోయ్, శివమ్ దూబె, తిలక్ వర్మ ఒక్కో వికెట్ పడగొట్టారు. నామమాత్రపు మూడో టీ20 ఆదివారం జరగనుంది.తొలుత భారత బ్యాటర్లలో ఇషాన్ కిషన్ (81; 44 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సులు), తిలక్ వర్మ (60లి; 29 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సులు) హాఫ్ సెంచరీలతో మెరిశారు. ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ (20), అభిషేక్ శర్మ (8) పరుగులు చేశారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (25) ఫర్వాలేదనిపించాడు. జింబాబ్వే బౌలర్లలో ముజరబాని, నగరవ, బ్రయాన్ బెన్నెట్, న్యూమన్, బ్రాడ్ ఎవాన్స్ తలో వికెట్ పడగొట్టారు.

# 21ఏళ్లలో తొలిసారిగా..

## చారిత్రాత్మక విజయానికి అడుగు దూరంలో అనాహత్



**విశ్వంభర, స్పోర్ట్స్ :** భారత స్క్వాష్ స్టార్ క్రీడాకారిణి అనాహత్ సింగ్ చరిత్ర సృష్టించడానికి ఒక్క అడుగు దూరంలో నిలిచింది. వరల్డ్ స్క్వాష్ జూనియర్ చాంపియన్‌షిప్ టైటిల్ గెలవడానికి ఆమెకు కావాల్సింది ఒక్క విజయం మాత్రమే. కెనడాలో జరుగుతున్న ఈ టోర్నీలో అనాహత్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగిన సెమీస్‌లో ఈజిప్ట్‌కు చెందిన బార్బ సమెను ఓడించింది. దీంతో జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో 21 ఏళ్ల తర్వాత ఓ భారత ప్లేయర్ ఫైనల్‌కు చేరుకుంది. అనాహత్ కంటే ముందు జోష్న చిన్నప్ప 2005లో ఫైనల్ ఆడింది. ఆ మ్యాచ్‌లో ఆమె ఓడిపోయింది. ఇప్పుడు అనాహత్ విజేతగా నిలిస్తే వరల్డ్ జూనియర్ స్క్వాష్ చాంపియన్‌గా నిలిచిన తొలి భారత ప్లేయర్‌గా రికార్డుకెక్కుతుంది. ప్రస్తుత టోర్నీలో సంచలన ప్రదర్శన చేస్తున్న అనాహత్ సెమీస్‌లోనూ అదే జోరు కొనసాగించింది. ఈజిప్ట్ క్రీడాకారిణి బార్బ సమెపై 3-1 తేడాతో గెలిచింది. తొలి గేమును 11-3తో గెలిచిన ఆమెకు రెండో గేములో ప్రత్యర్థి గెలిచి స్కోరును సమం చేసింది. ఆ తర్వాత అనాహత్ బలంగా పుంజుకుని దూకుడు పెంచింది. వరుసగా 3, 4 గేములను 11-4, 11-6 తేడాతో నెగ్గి ఫైనల్‌లో అడుగుపెట్టింది. టైటిల్ పోరులో అనాహత్ ఈజిప్ట్‌కే చెందిన రుఖయ్యా సలేంతో తలడపనుంది.

# ఏఐ రంగంపై ప్రజలకు నమ్మకం పోతోంది: సత్యనాదెళ్ల



**విశ్వంభర, బిజినెస్:** ప్రపంచమంతా ఏఐ నామస్మరణ వినిపిస్తున్న నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల కీలక వ్యాఖ్యలు చేశారు. ఐటీ రంగంలో మానవ ఉద్యోగాలను భర్తీ చేస్తుందనే నిరంతర భయాల కారణంగా ప్రజలు ఏఐ రంగంపై విశ్వాసం కోల్పోతున్నారని పేర్కొన్నారు. వారి విశ్వాసాన్ని పునరుద్ధరించాలంటే కొన్ని చర్యలు తీసుకోక తప్పదని వ్యాఖ్యానించారు. ఉదాహరణకు ఒక సంస్థ డేటా సెంటర్‌ను నిర్మిస్తున్నట్లయితే.. స్థానిక ప్రజలకు అది ఎంత ఉపయోగకరమో వివరించాలన్నారు. అప్పుడే వారు దాని అవసరాన్ని గుర్తిస్తారన్నారు.ప్రస్తుతం ఉత్పాదకతను మెరుగుపరచడానికి మాత్రమే కాకుండా ఇతర పనులకు కూడా కృత్రిమ మేధను వినియోగిస్తున్నారని సత్యనాదెళ్ల అన్నారు. దీంతో రాబోయే ఏఐ యుగం.. మునుపటిలా కాకుండా భిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. మానవుల పరిజ్ఞానం, సృజనాత్మకతకు ఏఐ సాంకేతికత కలిస్తేనే భవిష్యత్ సంస్థలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఏఐని స్వతంత్ర మేధస్సుగా చూడకూడదని.. మానవ ఆలోచనలను పెంచే, ప్రజల లక్ష్యాల సాధనకు దోహదపడే టూల్‌గా చూడాలన్నారు. ఉద్యోగాల నుంచి కార్మికులను తొలగించి వారి స్థానంలో ఏఐని తీసుకురాకుండా.. మానవ సామర్థ్యాలను పెంపొందించడానికి ఈ సాంకేతికతను ఉపయోగించాలని కంపెనీలకు ఆయన సూచించారు. మానవులు, ఏఐ వ్యవస్థలు ఒకరి నుంచి ఒకరు నిరంతరం నేర్చుకోగల దశలోకి ప్రస్తుత వ్యాపారాలు ప్రవేశిస్తున్నాయన్నారు. కొత్త ఉద్యోగాలను సృష్టించడానికి.. మంచి వేతనాలు నిర్ణయించడానికి కూడా ఏఐని వినియోగించాలని సూచించారు.

## టీమ్‌ఇండియా వైఫల్యాలపై.. వచ్చే నెలలో సమీక్ష: బీసీసీఐ



**విశ్వంభర, స్పోర్ట్స్:** ప్రస్తుతం జింబాబ్వేతో టీ20 సిరీస్ ఆడుతున్న టీమ్‌ఇండియా.. వచ్చే నెలలో శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. ఆగస్టు 15 నుంచి ఆతిథ్య జట్టుతో రెండు టెస్టు మ్యాచ్‌లు ఆడనుంది. ఈ సిరీస్ కోసం జులై 28న భారత జట్టును ప్రకటిస్తామని బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా వెల్లడించారు. ఐర్లాండ్, ఇంగ్లాండ్, జింబాబ్వే పర్యటనల్లో భారత జట్టు ఆటతీరుపై ఆగస్టు ఆరంభంలో సమీక్ష నిర్వహిస్తామని ఆయన తెలిపారు. టీమ్‌ఇండియా సహాయక సిబ్బందిలో కొంతమంది కాంట్రాక్టు ముగిసిందని, దానిపై కూడా సమీక్షా సమావేశంలో చర్చిస్తామని సైకియా పేర్కొన్నారు.ఇటీవల జరిగిన రెండు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్‌కు ఐర్లాండ్ షాకిచ్చిన సంగతి తెలిసిందే. తర్వాత ఇంగ్లాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లోనూ భారత్ వైట్‌వాష్‌కు గురైన సంగతి తెలిసిందే. ఇంగ్లిష్ జట్టుతో మూడు వన్డేల సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో గెలిచిన భారత్.. తర్వాత రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలై సిరీస్‌ను చేజార్చుకుంది. ఈ నేపథ్యంలో భారత జట్టు ప్రదర్శనపై బీసీసీఐ పెద్దలు సమీక్ష నిర్వహించనున్నారు.

## 'ఏఐ'తో సైబర్ దాడులను అరికట్టాలి




టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ ఎన్ని ఉపయోగాలున్నాయో, అంతే స్థాయిలో కొత్త రకం సమస్యలు కూడా ఎదురవుతున్నాయి. ముఖ్యంగా ఇటీవల అందుబాటులోకి వచ్చిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ను సామాన్య ప్రజలు ఏ మేరకు సద్వినియోగం చేసుకుంటున్నారో పక్కనబెడితే, సైబర్ నేరగాళ్లు మాత్రం దీనిని తమ అక్రమ సంపాదనకు ప్రధాన ఆయుధంగా మార్చుకుంటున్నారు. "ఏఐ వినియోగంలో మాకు సాటి ఎవరూ లేరు" అన్న స్థాయిలో వినూత్న రీతుల్లో నేరాలకు పాల్పడుతూ, డీప్‌ఫేక్ వీడియోలు, ఆడియోల ద్వారా అమాయకులను మోసం చేస్తూ సైబర్ దోపిడీకి తెగబడుతున్నారు. ఈ రకమైన ఏఐ ఆధారిత సైబర్ నేరాల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో, వీటిని సమర్థవంతంగా అరికట్టడానికి సైబర్ నేరాల నియంత్రణకై ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని టెక్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అంతేకాకుండా, సాంకేతికతతో ముడిపడి ఉన్న ఈ ఆధునిక నేరాలను పాత పద్ధతుల్లో ఎదుర్కోవడం సాధ్యం కాదని, ఏఐ, డీప్‌ఫేక్ మూలాలను గుర్తించి అడ్డుకునేందుకు తిరిగి శక్తివంతమైన 'ఏఐ టూల్స్' నే రక్షణ కవచంగా వినియోగించాలని సైబర్ సెక్యూరిటీ నిపుణులు గట్టిగా సూచిస్తున్నారు.

## సింగిల్ క్లిక్‌తో కేవైసీ.. ఆర్బీఐ కొత్త రూల్స్

బ్యాంక్ అకౌంట్ తెరవడం, ఇన్సూరెన్స్ తీసుకోవడం, లేదా స్టాక్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టడం.. సేవ ఏదైనా ప్రతిసారీ ఆధార్, పాన్ కార్డులు పట్టుకుని 'కేవైసీ' ప్రక్రియ పూర్తి చేయడం కస్టమర్లకు పెద్ద ప్రహసనంగా మారింది. అయితే, ఈ పదే పదే పత్రాలు సమర్పించే కష్టాలకు త్వరలోనే స్వస్తి పలకనుంది ఆర్బీఐ. దేశీయ ఆర్థిక రంగంలో కస్టమర్ల సౌకర్యం, భద్రతే లక్ష్యంగా ఆర్బీఐ, సెబీ, ఐఆర్డీఏఐ సంయుక్తంగా అత్యాధునిక 'సెంట్రల్ నో యువర్ కస్టమర్' (జఖ్జ 2.0) వ్యవస్థను అందుబాటులోకి తెస్తున్నాయి. ఆగస్టు నుంచి తొలి విడతగా బ్యాంకులు, బీమా కంపెనీలతో ప్రారంభం కానున్న ఈ నయా సిస్టమ్‌లోకి, ఈ ఏడాది చివరి నాటికి మ్యూచువల్ ఫండ్స్, బ్రోకరేజ్ సంస్థలు కూడా పూర్తిస్థాయిలో అనుసంధానం కానున్నాయి. ఈ సీకేవైసీ 2.0 అందుబాటులోకి వస్తే, వినియోగదారులు ప్రతి కొత్త ఆర్థిక సేవ కోసం మళ్లీ డాక్యుమెంట్లు ఇవ్వాల్సిన పని ఉండదు. కేవలం ఒకే ఒక్కసారి వినియోగదారుడు డిజిటల్‌గా తన సమ్మతిని తెలియజేస్తే చాలు.. ఆర్థిక సంస్థలు కేంద్ర రిజిస్ట్రీ నుంచి నేరుగా ఆ వివరాలను సురక్షితంగా పొందుతాయి. దీనివల్ల ఆర్థిక సేవలు అత్యంత వేగంగా, సులభంగా పూర్తవుతాయి. ప్రస్తుతం దేశంలోని కేంద్ర కేవైసీ రిజిస్ట్రీలో దాదాపు 120 కోట్ల రికార్డులు ఉన్నప్పటికీ, వాటిలో నకిలీ నమోదులు, అసంపూర్ణ సమాచారం వంటి సమస్యలు వేధిస్తున్నాయి. ఈ లోపాలను సవరిస్తూ సీకేవైసీ 2.0 సరికొత్త సాంకేతికతతో రూపుదిద్దుకుంది. ఇందులో ప్రతి వినియోగదారుడి డేటాకు ఒక విశిష్టమైన 'కాన్ఫిడెన్స్ స్కోర్' ఉంటుంది. ఇది ఆ సమాచారం యొక్క ఖచ్చితత్వాన్ని తెలుపుతుంది. అంతేకాకుండా కస్టమర్ అనుమతి లేనిదే ఏ సంస్థ కూడా డేటాను చూడలేవు, ఓటీపీ ఆధారిత ప్రాసెసింగ్ ద్వారా మాత్రమే సమాచారం మార్పిడి జరుగుతుంది. ఒకే ఒక ప్రామాణికమైన రికార్డు ఉండటం వల్ల నకిలీ గుర్తింపులు, ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట పడి, వినియోగదారుల డేటాకు పూర్తి రక్షణ లభిస్తుంది.



ప్రజా విశ్వంభర
V3 NEWS




## విశ్వనాథ్ అండ్ సన్స్.. సూర్య పాడిన పాట వచ్చేసింది

సూర్య కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న సరికొత్త చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' . ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈమూవీ ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర ప్రచార కార్యక్రమాలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా 'ది వెడ్డింగ్ సాంగ్' లిరికల్ వీడియోను చిత్ర బృందం విడుదల చేసింది. జీవీ ప్రకాశ్ కుమార్ స్వరాలు సమకూర్చిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. నటుడు సూర్య ఈ సాంగ్‌ను పాడటం విశేషం. ఈ చిత్రంలో సూర్య సరసన మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తున్నారు. బాలీవుడ్ నటి రవీనా టాండన్, సీనియర్ నటి రాధిక శరత్‌కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.



## తొలి హీరోగా విజయ్ హ్యాట్రిక్ రికార్డు..

అగ్ర కథానాయకుడు విజయ్ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జన నాయగన్' బాక్సాఫీస్ వద్ద రికార్డు సృష్టించింది. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ ప్రీసేల్‌లో ఏకంగా 10 లక్షల టికెట్లు అమ్ముడైనట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. దీంతో వరుసగా మూడు సినిమాలకు ప్రీసేల్ బుకింగ్స్‌లోనే వన్ మిలియన్ మార్క్ అందుకున్న తొలి భారతీయ హీరోగా విజయ్ నిలిచారు. గతంలో విజయ్ నటించిన 'వారిసు', 'ది గోట్' చిత్రాలు కూడా విడుదలకు ముందే 10 లక్షలకు పైగా టికెట్ల విక్రయాలతో ఈ ఘనత సాధించగా.. ఇప్పుడు 'జన నాయగన్'తో విజయ్ హ్యాట్రిక్ కొట్టారు.
'జన నాయగన్' కథంటేంటే..దళపతి వెట్రి కొండాన్ (విజయ్) ఓ ఖైదీగా జైలు జీవితాన్ని గడుపుతుంటాడు. ఓ వ్యాపారవేత్తని అంతం చేయడానికి జైలుపై పడిన ముఠాని ఎదురించి నిజాయతీ కలిగిన జైలు అధికారి (గౌతమ్ మేనన్) దృష్టిని ఆకర్షిస్తాడు. ఆ అధికారి సాయంతో ఆగస్టు 15న క్షమాభిక్ష కింద బయటకొస్తాడు వెట్రి. అంతలోనే ఆ అధికారి ఓ ప్రమాదంలో మరణిస్తాడు. దాంతో అతడి కుమార్తె విజ్జి (మమిత బైజు)ని పెంచే బాధ్యతని వెట్రి తన భుజాన వేసుకుంటాడు. చిన్నప్పుడు తల్లి దారుణ హత్యని కళ్లారా చూసిన విజ్జి ప్రతి చిన్న విషయానికీ భయంతో వణికిపోతుంటుంది. ఆమెను ధైర్యవంతురాలిగా మార్చి, సైన్యంలో చేర్పించాలని నిర్ణయించుకుంటాడు. అందుకోసం శిక్షణ కూడా ఇప్పిస్తుంటాడు. ఇంతలో జాన్ హిమ్లర్ (బాబీ దేవోల్) విజ్జిని లక్ష్యంగా చేసుకుని ఆమెని అంతం చేయాలని తన ముఠాని పంపుతాడు. ఇంతకీ విజ్జిని జాన్ హిమ్లర్ లక్ష్యంగా చేసుకోవడానికి కారణమేమిటి?అనేది కథ.

## ఆ హిట్ తర్వాతే నాపై నమ్మకం పెరిగింది: అదా శర్మ



'ది కేరళ స్టోరీ' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు అందాల తార అదా శర్మ. భారీ హిట్ కొట్టిన తర్వాత హీరోయిన్లకు మంచి పాత్రలు దక్కవనే ప్రచారంలో నిజం లేదని ఆమె స్పష్టం చేశారు. ఆ సినిమా విజయంతోనే తనకు మరిన్ని మంచి అవకాశాలు వస్తున్నాయని తాజాగా ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. "ఒక హిట్ పడితే.. మన నటనపై అందరికీ నమ్మకం పెరుగుతుంది. భారీ ప్రాజెక్టుల్లో అవకాశాలు ఇస్తారు. ప్రస్తుతం ప్రతి నటి కోరుకునే డ్రీమ్ రోల్స్ నాకు వస్తున్నాయి. సవాలుతో కూడిన, విభిన్నమైన పాత్రలు దక్కుతున్నాయి" అని చెప్పారు. 2008లో '1920' అనే హిందీ హారర్ సినిమాతో అదా శర్మ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. టాలీవుడ్‌లో 'హార్ట్ ఎటాక్', 'సన్ ఆఫ్ సత్యమూర్తి', 'క్షణం' లాంటి హిట్ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. అలాగే బాలీవుడ్ చిత్రం 'హసీ తో ఫసీ'తో పాటు, విద్యుత్ జమ్వాల్ 'కమాండో' సిరీస్‌లోనూ ఆకట్టుకున్నారు. ఇటీవల మనోజ్ బాజ్‌పాయ్‌తో కలిసి 'గవర్నర్' అనే మూవీలో నటించారు. చిన్మయ్ డి.మాండ్లేకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం.. 1990 నాటి భారత ఆర్థిక సంక్షోభం, ఆర్బీఐ-ప్రభుత్వం మధ్య జరిగిన రిణామాల నేపథ్యంతో తెరకెక్కింది. మరోవైపు, ఆమె 'గర్జా' అనే చిత్రంతో మరాఠీ పరిశ్రమలోకి అడుగుపెట్టనున్నారు. వాస్తవ సంఘటనల ఆధారంగా శ్రేయాస్ జాదవ్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా 2027లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

## మంచి పాత్రలకు తమిళ పరిశ్రమ సరైన చోటు



సినిమాల్లో అవకాశాల కోసం తొందరపడడం లేదని నటి నిధి అగర్వాల్ అన్నారు. 'ఈశ్వరన్', 'భూమి', 'కళగ తలైవన్' తర్వాత తమిళ సినిమా చేయలేదని, సరైన ప్రాజెక్ట్ కోసం ఎదురు చూస్తున్నానని చెప్పారు. "మంచి దర్శకులతో అర్థవంతమైన పాత్రలు ఉన్న సినిమాలు చేయాలనుకుంటున్నాను. అలాంటి పాత్రలకు తమిళ ఇండస్ట్రీ సరైన చోటు. నా జీవితంలో దేనికీ నేను తొందరపడను. పెళ్లి విషయంలో కూడా అంతే. మంచి ప్రాజెక్ట్‌లు వస్తే.. సినిమాలు చేస్తాను. 'హరి హర వీరమల్లు' , 'ది రాజా సాబ్' సినిమాల్లో స్టార్‌లతో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా. ప్రస్తుతం తెలుగు, హిందీ సినిమాలతో బిజీగా ఉన్నాను. దీంతో తమిళంలో నటించడం మిస్ అవుతున్నా. నాది చాలా సున్నితమైన మనస్తత్వం. అందుకే భావోద్వేగాలు ఎక్కువగా బయటపెట్టను. వృత్తిపరంగా బాగా కష్టపడతాను. ఇతర విషయాలకొస్తే అత్యంత సోమరిని. ప్రస్తుతం రెండు ప్రాజెక్టుల గురించి చర్చలు జరుగుతున్నాయి. ఇంకా ఫైనల్ చేయలేదు " అని నిధి తెలిపారు. ఇక, ప్రస్తుతం ఆమె 'మిరాయ్' పార్ట్-2, హిందీ సైకలాజికల్ థ్రిల్లర్ 'ది ఇన్‌ఫ్లుయెన్సర్'లో కనిపించనున్నారు.

## సినిమా ఫలితంతో నా ప్రతిభను అంచనా వేసుకోను



బాలీవుడ్ భామ త్రిప్తి దిమ్రి తనదైన నటనతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. బ్లాక్‌బస్టర్ చిత్రం 'యానిమల్' తో దేశవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకున్నారు. ఈ క్రమంలో స్టార్‌డమ్, హిట్లు, ఫ్లాప్‌ల గురించి త్రిప్తి తాజాగా ఆసక్తికర విషయాలు పంచుకున్నారు." 'యానిమల్' విజయం నాకు ఎంతో స్వేచ్ఛనిచ్చింది. ఆ సినిమాకి ముందు నాలోని ప్రతిభను నిరూపించుకునే అవకాశాల కోసం నిరంతరం ఎదురుచూసేదాన్ని. ఆ తర్వాత ఇండస్ట్రీలో నాపై నమ్మకం పెరిగింది. ఎన్నో ప్రాజెక్టులు వస్తున్నాయి. ఇప్పుడు కేవలం నిలదొక్కుకోవాలనే భయంతో కాకుండా.. నాకు నచ్చిన కథలను ఎంపిక చేసుకునే స్వేచ్ఛ చిత్ర పరిశ్రమలో దొరికింది. మొదట్లో ఈ స్టార్‌డమ్ కాస్త ఇబ్బందిగా అనిపించినా, తర్వాత అలవాటు పడ్డాను. నేను ఎప్పుడూ నా పనిపైనే పూర్తి దృష్టి పెడతాను. సినీ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి రాకపోవడం కూడా నాకు కలిసొచ్చింది. ఎందుకంటే.. అది నన్ను ఎప్పుడూ ఒదిగి ఉండేలా చేస్తుంది" అని అన్నారు. ఇక, త్రిప్తి, షాహిద్ కపూర్ జంటగా విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో ఇటీవల వచ్చిన చిత్రం 'ఓ రోమియో'. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయం సాధించలేదు. దీనిపై ఆమె స్పందిస్తూ.." కమర్షియల్‌గా సినిమా పరాజయం పాలై ఉండొచ్చు. కానీ, నేను దాన్ని వ్యక్తిగత వైఫల్యంగా భావించను. నటీనటులంతా తమ పాత్రలకు ప్రాణం పెట్టి నటిస్తారు. ప్రేక్షకులు దానికి కనెక్ట్ అవ్వాలని కోరుకుంటారు. కానీ, అన్నిసార్లు అనుకున్నట్లు జరగదు. కొన్నిసార్లు సమయం, అంచనాల వల్ల ఫలితం దక్కుతుంది. కొన్ని చిత్రాలకు ఆలస్యంగా గుర్తింపు వస్తుంది. ఈ సినిమా నాకు ఎన్నో విషయాలు నేర్పించింది. మూవీ ఫలితాన్ని బట్టి మన విలువను, ప్రతిభను అంచనా వేసుకోకూడదనే విషయాన్ని ఈ చిత్రం ద్వారానే నేర్చుకున్నాను. పాత్రకు వంద శాతం న్యాయం చేసి, ఫలితాన్ని వదిలేయాలి " అని పేర్కొన్నారు.

## ఈ మూవీలో ట్విస్ట్‌లు ఊహించలేరు: జయకృష్ణ ఘట్టమనేని

"నేను ఈ సినిమా చేస్తున్నానని తెలియక ముందే ఘట్టమనేని అభిమానులు నాకు ఎంతో సపోర్ట్ చేశారు. వాళ్ల నమ్మకాన్ని నిలబెట్టాలి. మంచి కథలు, మంచి పాత్రలు చేయాలనే ఆలోచన నాకు మొదటి నుంచే ఉంది" అంటున్నారు జయకృష్ణ ఘట్టమనేని . ఆయన కథానాయకుడిగా వెండితెరకు పరిచయమవుతున్న తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. అజయ్ భూపతి దర్శకుడు. నటి రవీనా టాండన్ కుమార్తె రషా థడానీ కథానాయిక. మోహన్‌బాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. నిర్మాత పి. కిరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని వైజయంతి మూవీస్ బ్యానర్ పై అశ్వినీదత్ సమర్పిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జులై 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా జయకృష్ణ ఆసక్తికర విశేషాలు పంచుకున్నారు.

**అన్ని అంశాలు కుదిరాయి..**

"నాకు చిన్నప్పటి నుంచి సినిమాలంటే ఇష్టం. అందుకే రెండేళ్ల పాటు ముంబయి, పుదుచ్చేరిలలో శిక్షణ తీసుకున్నా. ఆ తర్వాత న్యూయార్క్ కూడా వెళ్లాను. ఒకసారి జెమినీ కిరణ్‌గారు నాకు అజయ్‌ను పరిచయం చేశారు. ఆయన చెప్పిన కథ చాలా అద్భుతంగా అనిపించింది. ఒక మంచి ఎమోషన్, మంచి క్యారెక్టర్ ఉన్న కథతో ప్రేక్షకుల ముందుకు రావాలని అనుకున్నాను. అలా అన్ని అంశాలు ఈ కథలో కుదిరాయి.



**బాబాయ్ మెచ్చుకున్నారు..**

"మహేష్ బాబాయ్ ప్రతి విషయంలో మార్గ నిర్దేశం ఇస్తారు. ఆయన సినిమా చూశారు. చాలా హ్యాపీగా ఫీలయ్యారు. యాక్షన్ సీక్వెన్స్‌లు, సాంగ్స్ చాలా నచ్చాయని చెప్పారు. స్క్రీన్ మీద చాలా డిఫరెంట్‌గా ఉన్నానని, క్యారెక్టర్‌లోకి పూర్తిగా వెళ్లిపోయానని చెప్పారు. వైజయంతి మూవీస్ లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థ ద్వారా వెండితెరకు పరిచయమవడం సంతోషంగా ఉంది. బాబాయ్ తొలి సినిమా కూడా వైజయంతి మూవీస్‌లోనే వచ్చింది".

**ఈ ప్రయాణంలో చాలా నేర్చుకున్నా..**

"శ్రీనివాస మంగాపురం' చాలా రియలిస్టిక్‌గా ఉంటుంది. క్యారెక్టర్స్, ఎమోషన్స్ అన్నీ కూడా రస్టిక్‌గా అనిపిస్తాయి. ఇదొక వైవిధ్యమైన లవ్‌స్టోరీ. ట్విస్టులు కూడా చాలా కొత్తగా ఉంటాయి. ఈ సినిమా కోసం 70 రోజుల పాటు అవుట్‌డోర్ షూటింగ్ చేశాం. ప్రతిదీ పబ్లిక్‌లోనే షూట్ చేశాం. ఈ ప్రయాణంలో చాలా విషయాలు నేర్చుకున్నాను. ఇక మోహన్‌బాబుగారు వెరీ స్వీట్. చాలా క్లోజ్‌గా ఉంటారు. కెమెరా ముందుకు వచ్చే సమయంలో మాత్రం ఏకాగ్రతతో ఉంటారు"

**యాక్షన్ సినిమాలంటే ఇష్టం..**

"నాకు యాక్షన్ చేయడం చాలా ఇష్టం. యాక్టర్ కావాలనుకున్నప్పుడే మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నాను. సినిమాలో కొన్ని సర్‌ప్రైజెస్ కూడా ఉన్నాయి. వాటిని ప్రేక్షకులు ఊహించలేరు. దర్శకుడు అజయ్ భూపతి చాలా స్పష్టత ఉన్న దర్శకుడు. ఆయనతో తొలి సినిమా చేయడం నా అదృష్టం. నాకు అన్ని రకాల సినిమాలు చేయాలని ఉంది. అయితే పర్సనల్‌గా నాకు యాక్షన్ సినిమాలంటే చాలా ఇష్టం. మంచి కథలతో ప్రేక్షకులను అలరించాలని ఉంది"



## చిట్టిబాబుగా వెంకటేశ్.. 'ఆదర్శ కుటుంబం' ఇదే

వెంకటేశ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న సరికొత్త చిత్రం 'ఆదర్శ కుటుంబం - హౌస్ నెం.47' . శ్రీనిధిశెట్టి కథానాయిక. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీకి సంబంధించి చిత్ర బృందం ఆసక్తికర అప్‌డేట్‌ను పంచుకుంది. 'ఆదర్శ కుటుంబం' ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయడానికి సిద్ధమైంది. జులై 27న స్పెషల్ అప్‌డేట్‌ను పంచుకోనుంది. ఈ సందర్భంగా కీలక నటులు ఏయే పాత్రల్లో కనిపించనున్నారో తెలియజేసింది. ఇందులో చిట్టిబాబు అనే పాత్రలో ఇద్దరు బిడ్డల తండ్రిగా వెంకటేశ్ నటిస్తున్నారు. స్వర్ణగా శ్రీనిధి శెట్టి, సంపూర్ణగా యువిన పార్వతి, శర్వాగా రాజ్ ప్రజ్వల్ నటిస్తున్నారు. జులై 27న ఈ మూవీకి సంబంధించిన మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది. అక్టోబరు 2న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు నిర్మాత నాగవంశీ తెలిపారు. కుటుంబ అంశాలతో ముడిపడిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో వెంకటేశ్ మధ్యతరగతి కుటుంబ పెద్దగా కనిపించనున్నారు. 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' సినిమాలకు త్రివిక్రమ్ స్క్రిప్ట్‌ని అందించారు. వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమాకోసం ఎదురు చూసిన ప్రేక్షకులకు 'ఆదర్శ కుటుంబం'తో ఆ కల నెరవేరనుంది.

## 'సౌండ్ ఇంజినీర్'గా నారా రోహిత్..

కథానాయకుడు నారా రోహిత్ జోరుమీదున్నారు. ఒకప్పుడు వైవిధ్యమైన కథలు, పాత్రలు ఎంచుకుని అలరించేవారు. ఆయన నుంచి సినిమా వస్తుందంటే ఏదో కొత్తదనం ఉందనే భావన ప్రేక్షకులకు కలిగేది. అయితే, కొంతకాలం విరామం తీసుకున్న నారా రోహిత్ గతేడాది 'భైరవం', 'సుందరకాండ' చిత్రాలతో మళ్లీ ట్రాక్‌లోకి వచ్చారు. ఇప్పుడు మరోసారి వరుస చిత్రాలతో అలరించడానికి సిద్ధమయ్యారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా కొత్త సినిమాల కబుర్లు పంచుకుంటున్నారు. రామ్ గన్నీ దర్శకత్వంలో రోహిత్ ఓ సినిమాలో నటిస్తున్నారు. దీనికి 'కపాలి' అనే టైటిల్, ఫస్ట్‌లుక్‌ను తాజాగా విడుదల చేశారు. పురాణాంశాలతో నిండిన సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా ఇది రూపొందుతోంది. ఇక వెంకటేశ్-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న 'ఆదర్శ కుటుంబం: హౌస్ నెం.47'లోనూ నారా రోహిత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందులో ఆయన పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. ఈ లుక్‌ను కూడా చిత్ర నిర్మాణ సంస్థ హారిక హాసిని క్రియేషన్స్ శనివారం సోషల్‌మీడియా వేదికగా పంచుకుంది. దీంతో పాటు, చినిమిల్లి మణికుమార్ దర్శకత్వంలో ఓ వైవిధ్యమైన కథలో నారా రోహిత్ మెరవనున్నారు. ఈ సినిమాకు 'సౌండ్ ఇంజినీర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. పూర్తి వినోదాత్మక చిత్రంగా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. నయన్‌సారిక, నరేశ్, రోహిణి, అజయ్, వెన్నెల కిషోర్, సుదర్శన్, బ్రహ్మాజీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.






Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com